Crime News

# ది క్రైమ్ న్యూస్

తెలుగు దినపత్రిక

బుధవారం, ఏప్రిల్ 29, 2026 | సంపుటి - 20 | సంచిక 223 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## రాష్ట్రంలో సమృద్ధిగా పెట్రోల్, డీజిల్ నిల్వలు

### అనవసర భయాందోళనలకు గురి కావద్దు

### పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర



హైదరాబాద్ : రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ నిల్వలు, సరఫరా సమృద్ధిగా ఉన్నట్లు పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం 27 వ తేదీన డిమాండ్ ను మించి పెట్రోల్ , డీజిల్ లను 29,939 కిలో లీటర్లు సరఫరా చేసినట్లు వివరించారు. సగటున రోజుకు 5,883 కిలో లీటర్లు పెట్రోల్, 7,348 కిలో లీటర్లు డీజిల్ కు డిమాండ్ ఉండేదని ఆయన తెలిపారు. కానీ 27 వ తేదీన 11,490 కిలో లీటర్లు పెట్రోల్, 18,449 కిలో లీటర్లు డీజిల్‌ను వాహనదారులకు సరఫరా చేసినట్లు తెలిపారు.

తరువాయి 2లో




### మహిళా సర్పంచ్‌ల ఫోరం

## రాష్ట్ర కన్వీనర్‌గా గుంటిపల్లి రేణుక

రాష్ట్ర మహిళా సర్పంచ్‌ల ఫోరం కన్వీనర్ గా శ్రీమతి గుంటిపల్లి రేణుక ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ లోని సెక్రటేరియట్ ఆవరణలో జరిగిన మహిళా సర్పంచ్ ల సమావేశంలో మహిళా సర్పంచ్ లందరూ కలిసి రేణుకను కన్వీనర్‌గా ఎన్ను కున్నారు. ఎంబిసీ, సంచార జాతుల సామాజిక నేపథ్యం గల గుంటిపల్లి రేణుక ఇటీవల జరిగిన గ్రామ పంచా యతీ ఎన్నికల్లో హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామం నుండి భారీ మేజార్టీతో ఎన్నికయ్యారు. ఈ సారి తెలంగాణ పంచాయతీల్లో దాదాపు 50 శాతం సర్పంచ్ స్థానాలు మహిళలకే దక్కాయి. 2లో

### ఫ్యూచర్ కోసమే...

# సిటీ నిర్మాణం



- ప్రపంచ దేశాలకు ధీటుగా నగర ప్రణాళిక
- 60 ఎకరాల్లో స్కిల్ యూనివర్సిటీ నిర్మాణం
- ఓఆర్ఆర్ పెద్ద అసెట్ కానుంది
- ప్రజాప్రతినధులు సిటీ కోసం కృషి చేయాలి
- మూడు బుల్లెట్ ట్రైన్స్ కేంద్రంగా శంషాబాద్

**ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ నిర్మాణానికి సిఎం రేవంత్ శంకుస్థాపన**



2

హైదరాబాద్ : ఫ్యూచర్ సిటీ భవిష్యత్ తరాలకు వరమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అందరి కృషితోనే ఫ్యూచర్ సిటీ నిర్మాణం జరుగుతోందని తెలిపారు. ఈ సిటీ నిర్మాణం అంత సులభం కాదన్నారు. అయితే పక్కా ప్రణాళికతో ప్రపంచ నగరా లకు దీటుగా నిర్మించ బోతు న్నామని అన్నారు. నూతనంగా ఏర్పాటు చేసే నగరంలో తమనూ కలపాలని స్థానిక గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారని వెల్లడించారు.




2

### నేడు టెన్త్ ఫలితాలు

## విడుదల

హైదరాబాద్,ఏప్రిల్ 28 : తెలంగాణలో పదో తరగతి పరీక్షా ఫలితాల విడుదలకు ముహూర్తం ఖరారైంది. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఫలితాలు వెల్లడించ నున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం వెల్లడించింది.



### తెలంగాణలో పెరిగిన

## ఎండల తీవ్రత

- ఇప్పటికే వడదెబ్బకు ముగ్గురు మృతి
- దేశవ్యాప్తంగా కొనసాగుతున్న హీట్‌వేవ్
- భారీగా పెరిగిన విద్యుత్ వినియోగం

హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. ఉష్ణోగ్రతలు భారీగా పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. ముఖ్యంగా మధ్యాహ్న సమయంలో బయటకు రావడం కష్టంగా మారింది. 2లో

## కేంద్రమంత్రి రాజీవ్ రంగన్ సింగ్‌తో వాకిటి భేటీ



2

### రాష్ట్రానికి రావాల్సిన సాయం తదితర అంశాల ప్రస్తావన

హైదరాబాద్ : కేంద్రమంత్రి రాజీవ్‌రంగన్ సింగ్‌తో వాకిటి శ్రీహరి భేటీ సందర్భంగా రాష్ట్రానికి రావాల్సిన సాయం తదితర అంశాలను ప్రస్తావించారు. రాజేంద్ర నగర్ లోని జాతీయ ఫిషరీస్ డెవలప్‌మెంట్ కార్యాల యంలో కేంద్ర పశుసంవర్ధక పాడి పారిశ్రామికాభివృద్ధి మత్స్య శాఖ

### ప్రపంచానికి సవాల్‌గా మారిన

# ఉగ్రవాదం



- ఉగ్రవాదానికి ఊతమిచ్చే దేశాలను తిప్పికొట్టాలి
- షాంఘై సహకార రక్షణ మంత్రుల సమావేశంలో రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ : ఉగ్రవాదమే ప్రపంచానికి ప్రధాన ముప్పుగా మారిం దని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యా నించారు. తీవ్రవాదం, ఉగ్రవాదంతో పలు సమస్యలు ఎదుర్కొంటు న్నామని చెప్పారు.

తరువాయి 2లో



### శబరిమలలో మహిళల

## ప్రవేశంపై విచారణ

- రాజ్యాంగపరమైన ప్రశ్నలపైనే మాదృష్టి
- ఆలయాల అంతర్గత ఆచారాల్లోకి వెళ్లదల్చుకోలేదు
- సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : శబరిమల అయ్యప్ప స్వామి దేవాలయంలో మహిళల ప్రవేశం, ఇతర మతపరమైన ఆచారాలపై దాఖలైన రివ్యూ పిటిషన్లపై సుప్రీంకోర్టులో వాదనలు అత్యంత ఆసక్తికరంగా సాగు తున్నాయి. జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని 9 మంది సభ్యుల భారీ రాజ్యాంగ ధర్మాసనం ఈ విచారణను చేపట్టింది. ఈ సందర్భంగా రాజ్యాంగ నైతికత, మతపరమైన విశ్వాసాల మధ్య జరుగు తున్న చర్చ దేశవ్యాప్తంగా ప్రాధాన్యత సంతరించుకుంది. విచారణ సందర్భంగా.. సుప్రీంకోర్టు ధర్మాసనం ఒక కీలకమైన అంశాన్ని స్పష్టం చేసింది. తాము కేవలం రాజ్యాంగ పరమైన ప్రశ్నలపై మాత్రమే దృష్టి పెడుతున్నామని 2లో



### సిక్కిం ఆవిర్భావ

## దినోత్సవం

### పిల్లలతో కలసి ఫుట్‌బాల్ ఆడిన ప్రధాని

న్యూఢిల్లీ : నరేంద్ర మోదీ సిక్కిం రాష్ట్ర రాజధాని గ్యాంగ్‌టక్‌లో సందడి చేశారు. యువతతో కలిసి ఫుట్‌బాల్ ఆడుతూ ఉల్లాసంగా గడిపారు. సిక్కిం రాష్ట్ర అవతరణ జరిగి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వేడుకలు జరుగుతున్నాయి.

తరువాయి 2లో



## వివాదంలో అషురెడ్డి వ్యవహారం

- పెళ్లిపేరుతో ధర్మేంద్ర నుంచి రూ. 9.83 కోట్లు వసూళ్లు
- ధర్మేంద్ర కుటుంబం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు
- హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేసిన అషురెడ్డి




### గూగుల్.. ఎపికి

# గేమ్ ఛేంజర్

- దేశానికి ఎపి డేటా గేట్‌వేగా నిలుస్తుంది
- గ్రోత్ ఇంజిన్‌గా మారనున్న గూగుల్
- 2028 నాటికి గూగుల్ సెంటర్ పూర్తి
- ఎంఓయూలతోనే కాదు..వాటిని ముందుకు తీసుకెళ్తున్నాం
- గూగుల్ సెంటర్‌కు శంకుస్థాపనలో సిఎం చంద్రబాబు

విశాఖపట్నం : గూగుల్ రాక.. విశాఖకే కాదు.. ఏపీకి ఒక గేమ్ ఛేంజర్ అని సీఎం చంద్రబాబు అన్నారు. ఏపీ చరిత్రలో మరచిపోలేని రోజు ఇదన్నారు. భారతదేశానికి ఏపీ..అంతర్జాతీయ డేటా గేట్‌వేగా నిలుస్తుంది. విశాఖలోని తర్లువాడలో గూగుల్ ఏఐ డేటా సెంటర్ నిర్మాణానికి భూమి పూజ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, గూగుల్‌కు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు. గూగుల్ ఏఐ డేటా సెంటర్.. ఏపీ టెక్నాలజీతోపాటు దేశానికే గ్రోత్ ఇంజిన్‌గా మారు తుందన్నారు. టెక్నాలజీ హబ్‌కు భవిష్యత్‌లో తుర్లవాడ పేరు మార్మోగుతుందన్నారు. టెక్నాలజీలో ఏపీ సగర్వంగా తలెత్తుకొని నిలబడుతుంది.

తరువాయి 2లో

### అమరావతి - హైదరాబాద్ మధ్య

# బుల్లెట్ ట్రైన్

- 70 నిముషాల్లోనే ప్రయాణం
- చంద్రబాబు విజనరీ లీడర్
- కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్



విశాఖపట్నం : చంద్రబాబు నేతృత్వంలో విశాఖపట్నం త్వరలోనే ఐటీపట్నం కాబోతోందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. విశాఖలో గూగుల్ ఏఐ డేటా సెంటర్ శంకుస్థాపన కార్యక్రమంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. అమరావతి - హైదరాబాద్ మధ్య బుల్లెట్ ట్రైన్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాల రాజధానుల మధ్య 70 నిమిషాల్లో, చెన్నై నుంచి అమరావతికి 112 నిమిషాల్లో ప్రయాణం సాధ్యమవుతుందని వివరించారు. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు 2 గంటల 08 నిమి షాల్లో ప్రయాణం చేయవచ్చన్నారు.

తరువాయి 2లో

# ఫ్యూచర్ కోసమే... సిటీ నిర్మాణం

ప్రజల్ని అభివృద్ధిలో భాగస్వాములు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రేవంత్ చెప్పుకొచ్చారు. రంగారెడ్డి జిల్లా మీర్ఖాన్‌పేట్‌లో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ శంకుస్థాపన చేశారు. అలాగే పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. మల్కాజ్‌గిరి కమిషనరేట్ భవనం, ఆక్టోపస్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, కుత్బుల్లాపూర్ డీసీపీ కార్యాలయాలను ప్రారంభించారు. గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికీ సీఎం రేవంత్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గతంలో చాలా మంది నేతలు హైదరాబాద్ అభివృద్ధిని కొనసాగించారని చెప్పారు. ఇప్పుడు నాలుగో నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకుంటోందని పేర్కొన్నారు. జపాన్, జర్మనీ, సింగపూర్ వంటి దేశాల్లోని అత్యాధునిక నగరాల తరహాలో, భారత్‌లోనే నాలుగో నగరంగా దీన్ని తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. 60 ఎకరాల్లో స్కిల్ యూనివర్సిటీ నిర్మాణం జరుగుతోందన్నారు. మనకున్న అద్భుతమైన ఆర్ఆర్ఆర్, ఐటీ ఎగుమతులు, కోవిడ్ వ్యాక్సిన్ తయారీలో మన ఘనతలే ఈ నగరానికి స్ఫూర్తి అని తెలిపారు. ఫ్యూచర్ సిటీ కోసం భూములిచ్చిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. ఈ నగర నిర్మాణానికి సహకరించే వారు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. వచ్చే జూన్ నెలలో ఫ్యూచర్ సిటీ కార్యాలయాన్ని ప్రారంభించబోతున్నామని తెలిపారు. సిటీ నిర్మాణానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని.. ప్రపంచంతో పోటీపడేలా నిర్మిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జూన్ 2వ తేదీ లోపు ఫ్యూచర్ సిటీ భవన నిర్మాణం జరుగుతుందన్నారు. గతంలో హైటెక్ సిటీ అంటే అవహేళన చేశారని.. ఏ నగరానికీ లేని ఔటర్ రింగ్ రోడ్డు హైదరాబాద్‌కు ఉందన్నారు. మూడు కొవిడ్ వ్యాక్సిన్లు తెలంగాణలోనే ఉత్పత్తి అయ్యాయని గుర్తు చేశారు. యుద్ధ విమాన సర్వీస్ సెంటర్లూ హైదరాబాద్‌లో ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచంతో పోటీపడేటా ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకుంటుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఫ్యూచర్ సిటీ కేవలం ఒక నగరం కాదు, ఇది రాబోయే తరాల తలరాతను మార్చే అద్భుతమన్నారు. ఈ నగర నిర్మాణం అంత సులభం కాదు. ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజల భాగస్వామ్యం ఉంటేనే ఇది సాధ్యమవుతుంది. ఫ్యూచర్ సిటీలో కలవాలనుకునే గ్రామాలు... గ్రామ సభల్లో తీర్మానం చేసి ముందుకు రావాలని సీఎం పిలుపునిచ్చారు. ప్రజా ప్రతినిధులు ఫ్యూచర్‌సిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. భవిష్యత్ తరాలకు అద్భుత నగరంగా ఫ్యూచర్ సిటీ విలసిల్లుతుందన్నారు. ఫ్యూచర్ సిటీ పరిధి గ్రామాల సర్పంచ్‌ల వివరాలు తెప్పించుకోవాలి. తమ గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలపాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. ఆయా గ్రామాల్లో సభలు పెట్టి తీర్మానాలు చేసి.. కలెక్టర్, మంత్రికి పంపాలి. ఆయా గ్రామాలను ఫ్యూచర్ సిటీలో భాగం చేసే చర్యలు చేపడతాం. ఆదర్శ నగరాలతో పోటీపడేలా ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దుతాం అని సీఎం అన్నారు. ఇకపోతే కేంద్రం దేశవ్యాప్తంగా ఏడు బులెట్ ట్రైన్లను ప్రకటిస్తే.. అందులో మూడు మన రాష్ట్రానికే రాబోతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. శంషాబాద్ కేంద్రంగా ముంబై, బెంగళూరు, అమరావతి నగరాలను అనుసంధానిస్తూ బులెట్ రైళ్లు పరుగులు తీయబోతున్నాయని చెప్పారు. కేవలం రైళ్లే కాదు.. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో భారీ బస్సు టెర్మినల్‌ను కూడా మనం నిర్మించుకోబోతున్నామని రేవంత్ తెలిపారు. మెట్రో, బులెట్ ట్రైన్, అత్యాధునిక బస్ టెర్మినల్.. ఇవన్నీ ఒకే చోట ఏర్పాటు కాబోతున్నాయన్నారు. త్వరలోనే రంగారెడ్డి జిల్లా ఒక మహా అద్భుతానికి సాక్ష్యం కాబోతోందని చెప్పారు. తాను కూడా ఈ గడ్డ నుండే ఊరికి వెళ్తాను.. అందుకే మీపై ఉన్న అభిమానంతో, ఈ ప్రాంత భవిష్యత్తు కోసం అద్భుతమైన ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని చెప్పారు. ఫ్యూచర్ లేనివాడు ఫ్యూచర్ సిటీ అంటున్నాడని కొందరు అంటున్నారు... నా మీద ఏడ్చే వారికి నేను చెప్పేది ఒక్కటే.. మీరు ఏడ్చుకుంటూనే ఉండండి, నేను నా పని చేసుకుంటూనే పోతా.. మీ ఏడుపే నా చెవులకు వినిపించే మధుర సంగీతం అని రేవంత్ అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేలు మహేందర్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎంపి వేం నరేందర్ రెడ్డి, డిజిపి శిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర కన్వీనర్‌గా గుంటిపల్లి రేణుక

రాష్ట్రంలో మొత్తం 12,703 గ్రామాల్లో 6403 మంది మహిళా సర్పంచ్ లే ఉన్నారు. గ్రామ పంచాయతీల్లోని సమస్యలు, ముఖ్యంగా గ్రామాల్లోని మహిళలపై, మహిళా సర్పంచ్ ల ప్రాధాన్యాలపై మహిళా సర్పంచ్ ల ఫోరం పనిచేస్తుంది. మండల, జిల్లా కమిటీల ఎన్నిక అనంతరం హైదరాబాద్ లో రాష్ట్ర మహిళా సర్పంచ్ ల ఫోరం పూర్తి స్థాయి కమిటీని ఎన్నిక ఉంటుంది. ఈ లోగా మహిళా సర్పంచ్ ల ఫోరం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించి సమస్యలపై అధ్యయనం చేస్తుంది. పూర్తి స్థాయి రాష్ట్ర కమిటీ ప్రకటన వరకు రేణుక కన్వీనర్ గా వ్యవహరిస్తారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించి మహిళా సర్పంచ్ లను ఏకం చేసి జిల్లా కమిటీలను, రాష్ట్ర కమిటీని అధికారికంగా నియమిస్తామని, ఇదే క్రమంలో సమస్యలపై చర్చించి పోరాటం చేస్తామని ఈ సందర్భంగా గుంటిపల్లి రేణుక చెప్పారు. గ్రామ పంచాయతీలు ఆర్థిక పరిపుష్టిని సాధించేందుకు నేరుగా నిధులు విడుదల చేయాలని, గ్రామాల్లో మహిళా సర్పంచ్ ల సాధికారిత కోసం ప్రభుత్వం చొరవ తీసుకునే విధంగా, మహిళా సర్పంచ్ ల వేతనం పెంచేవిధంగా ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తామన్నారు. నిత్యం గ్రామాల్లోనే ప్రజల మధ్య ఉంటూ ఇంటింటి ఊరిని చక్కదిద్దే బాధ్యతలను కలిగిన మహిళా సర్పంచ్ ల సమస్యలపై మరింత అధ్యయనం చేస్తున్నామని చెప్పారు.

## తెలంగాణలో పెరిగిన ఎండల తీవ్రత

తెలంగాణలోని నిజామాబాద్ జిల్లాలో అత్యధికంగా 46 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఎండల తీవ్రత కారణంగా తెలంగాణలో విషాద ఘటనలు చోటుచేసుకున్నాయి. వడదెబ్బతో ముగ్గురు మృతి చెందగా, పిడుగుపాటుకు ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఇకపోతే దేశవ్యాప్తంగా హీట్‌వేవ్ కొనసాగుతున్నది. ఎండలు దంచికొడుతున్నాయి. చాలా చోట్ల అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి, కొన్ని చోట్ల వరుసగా గత కొన్ని రోజుల నుంచి ఎండ తీవ్రత 40 డిగ్రీలు దాటుతోంది. అయితే అదే స్థాయిలో విద్యుత్తు వినియోగం కూడా జరుగుతున్నది. సోమవారం ఒక్క రోజే దేశవ్యాప్తంగా గరిష్టంగా 255.85 గిగావాట్ల విద్యుత్తును వినియోగించినట్లు ప్రభుత్వం పేర్కొన్నది. ఎయిర్ కండిషనర్లు, డిజర్ట్ కూలర్లు అధికంగా వాడడం వల్ల విద్యుత్తు వినియోగం కూడా పీక్ స్థాయికి చేరుకున్నది. విద్యుత్తు శాఖ డేటా ప్రకారం సోమవారం సుమారు 256 గిగా వాట్ల విద్యుత్తు వినియోగం జరిగినట్లు తెలిసింది. ఈనెలలో విద్యుత్తు వినియోగం గణనీయంగా పెరుగుతూ వచ్చింది. ఈ నెల రెండో అర్ధభాగం నుంచి విద్యుత్తు మోత మోగుతున్నది. శుక్రవారం రోజు 252.07 గిగావాట్లు, శనివారం ఏప్రిల్ 25వ తేదీన 256.11 గిగావాట్ల వినియోగం జరిగినట్లు ప్రభుత్వం పేర్కొన్నది. అయితే గత ఆదివారం విద్యుత్తు వినియోగం తగ్గింది. ఆదివారం 238.15 గిగావాట్ల విద్యుత్తును వినియోగించారు. కమర్షియల్, ఇండస్ట్రియల్ కంపెనీలు ఎక్కువగా సెలవు తీసుకోవడం వల్ల ఆదివారం విద్యుత్తు వినియోగం తగ్గినట్లు అంచనా వేశారు. దీంతో పాటు కొన్ని చోట్ల డస్ట్ స్టార్మ్, వర్షాలు పడడం వల్ల ఆదివారం వినియోగం తగ్గింది. గత ఏడాది అత్యధికంగా విద్యుత్తు వినియోగం జూన్‌లో రికార్డు అయ్యింది. 2025 జూన్‌లో ఓ రోజు గరిష్టంగా సుమారు 242.77 గిగావాట్ల విద్యుత్తును వినియోగించారు. 2024లో గరిష్టంగా 250గిగావాట్ల విద్యుత్తును మే నెలలో వాడారు. ఇక 2023లో సెప్టెంబర్‌లో సుమారు 243.27 గిగావాట్ల విద్యుత్తును వినియోగించారు. ఈ ఏడాది వేసవిలో ఎండలు మండనున్నట్లు ఐఎండీ హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది గరిష్టంగా 270 గిగావాట్ల విద్యుత్తు వినియోగం జరిగే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ నిపుణులు చెబుతున్నారు.

## సిక్కిం ఆవిర్భావ దినోత్సవం

మంగళవారం జరగబోయే ముగింపు వేడుకల కోసం ప్రధాని గ్యాంగ్‌టక్ చేరుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఫుట్‌బాల్ ఆడారు. సిక్కిం 50వ అవతరణ దినోత్సవం సందర్భంగా ఆ రాష్ట్రంలో పర్యటిస్తున్న ప్రధాని మంగళవారం ఉదయం అక్కడి క్రీడాకారులతో కలిసి సరదాగా ఫుట్‌బాల్ ఆడారు. ఈ ఆటకు సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. గ్యాంగ్‌టక్‌లో యువ మిత్రులతో కలిసి ఆడడం చాలా ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు. ప్రధాని స్పోర్ట్స్ దుస్తుల్లో పిల్లలతో కలిసి ఆనందంగా ఫుట్‌బాల్ ఆడుతున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సిక్కిం 50వ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ ముగింపు కార్యక్రమానికి మోదీ హాజరై.. రూ.4,000 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ఆవిష్కరించారు. ఆ రాష్ట్రం భారత యూనియన్‌లో చేరి 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రోడ్‌షోలో పాల్గొన్నారు. అధికారిక కార్యక్రమాలకు ముందు గ్యాంగ్‌టక్‌లో యువతతో కలిసి ఫుట్‌బాల్ ఆడారు. ఈ సందర్భంగా తీసిన ఫొటోలు, వీడియోలను ప్రధాని తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకోవడంతో అవి వేగంగా వైరల్ అయ్యాయి. యువతతో కలిసి క్రీడల్లో పాల్గొనడం తనకు ప్రత్యేక అనుభూతినిచ్చిందని ప్రధాని పేర్కొన్నారు. 'గ్యాంగ్‌టక్‌లో ఉదయం యువ స్నేహితులతో కలిసి ఫుట్‌బాల్ ఆడడం చాలా ఎనర్జీ ఇచ్చిందని మోదీ పేర్కొన్నారు. కాగా, సిక్కింలో ప్రధాని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయబోతున్నారు. సిక్కింలో రహదారుల కనెక్టివిటీ, ఆరోగ్యం, టూరిజం, విద్య, నగర అభివృద్ధి సహా వివిధ రంగాల్లో రూ.4,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభించనున్నారు.

## అమరావతి - హైదరాబాద్ మధ్య బుల్లెట్ ట్రైన్

చెన్నై నుంచి కోల్‌కతా మధ్య రైల్వే లైన్లను 4 లేన్లుగా విస్తరించే పనులు చేపడతామని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. గతంలో చంద్రబాబు సైబరాబాద్ నిర్మించారని.. ఐటీ అభివృద్ధిలో సైబర్ టవర్‌ది కీలకపాత్ర అని చెప్పుకొచ్చారు. చంద్రబాబు విజన్‌కు సెల్యూట్ చేస్తున్నామని అన్నారు. ఆయనను దేశం గర్వించే విజనరీ లీడర్‌గా కేంద్రమంత్రి అభివర్ణించారు. యువనేత లోకేశ్ ఎనర్జీ, నాయకత్వం అద్భుతమని కొనియాడారు. సమస్యల పరిష్కారంలో యువనేతలకు లోకేశ్ ఆదర్శమని పేర్కొన్నారు. తయారీ రంగంలో నూతన ఆవిష్కరణలు వస్తున్నాయని, భవిష్యత్తులో ఎలక్ట్రానిక్స్ తయారీ అత్యంత కీలకమని అశ్విని వైష్ణవ్ అన్నారు. ఎలక్ట్రానిక్స్ తయారీలో భారత్ కీలకపాత్ర పోషిస్తుందని చెప్పారు. 2024 నుంచి సెమీకండక్టర్ల తయారీపై కేంద్రం దృష్టి సారించిందని తెలిపారు. గూగుల్ వంటి ప్రముఖ సంస్థలు విశాఖపట్నానికి రావడం శుభపరిణామమని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుంచి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. జూన్ 1 నుంచి విశాఖపట్నం రైల్వే జోన్‌ను నోట్గి÷ చేస్తామని కేంద్ర మంత్రి ప్రకటించారు.

## స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

హైదరాబాద్,ఏప్రిల్28 : డాలర్ కాస్త బలపడడం, గ్లోబల్ మార్కెట్‌లో డిమాండ్ తగ్గడం వంటి కారణాలతో మంగళవారం బంగారం ధర తగ్గుదల నమోదు చేసింది. భౌగోళిక, అంతర్జాతీయ రాజకీయ కారణాలతో కాస్త హెచ్చుతగ్గులకు లోనవుతోంది. మంగళవారం ఉదయం పది గంటల సమయంలో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.710 మేర తగ్గుదల నమోదు చేసింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,53,000గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,40,250గా ఉంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే రూ.650 మేర తగ్గింది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,53,150గా, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,40,400గా ఉంది. మరోవైపు వెండి ధరలు కూడా తగ్గుదలను నమోదు చేశాయి. కిలోకు 4 వేల రూపాయల మేర తగ్గాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2.65 లక్షలుగా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2.6 లక్షలుగా ఉంది. అలాగే చెన్నైలో కిలో వెండి ధర రూ.2.65 లక్షలుగా, బెంగళూరులో రూ.2.60 లక్షలుగా ఉంది.

## గూగుల్.. ఎపికి గేమ్ ఛేంజర్

కొత్త ఆవిష్కరణలకు ఆంధ్రప్రదేశ్ ఎప్పుడూ స్వాగతం పలుకుతుంది. ఏఐ డేటా సెంటర్ ఒక గిగావాట్ సామర్థ్యంతో పని చేస్తుంది. సెర్చ్ ఇంజిన్‌గా మొదలైన గూగుల్.. ఇప్పుడు భారత్ గ్రోత్ ఇంజిన్‌గా మారబోతోంది. ప్రముఖ సంస్థలు విశాఖలో పెట్టుబడులకు రావడం శుభపరిణామం. గూగుల్ ఆవిష్కరణలు.. ఏపీ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ రెండూ కలుస్తున్నాయి. ఓడరేవుల వంటి రంగాల్లో పని చేస్తున్న ప్రతిష్ఠాత్మక సంస్థ అదానీ.. ప్రజలకు కమ్యూనికేషన్‌తో అనుసంధానం చేస్తున్న మరో సంస్థ ఎయిర్‌టెల్.. ఈ మూడు సంస్థలు ఎప్పుడూ నూతన ఆలోచనలు చేస్తుంటాయన్నారు. 2028 సెప్టెంబర్ నాటికి గూగుల్ ఏఐ డేటా సెంటర్ నిర్మాణం పూర్తి కావాలి. రెండు, మూడు నెలలు ముందుగానే పూర్తి చేసేందుకు సహకరిస్తాం. జులైలో భోగాపురం ఎయిర్‌పోర్టును జాతికి అంకితం చేస్తాం. భవిష్యత్‌లో అనకాపల్లి జిల్లా మరో రంగారెడ్డి జిల్లాగా మారుతుంది. వ్యాపార నిర్వహణ ఖర్చు.. మిగిలిన నగరాలకంటే చాలా తక్కువగా ఉంటుంది. జూన్ 1న దక్షిణ కోస్తా రైల్వేజోన్ ప్రారంభమవుతుందని అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. ఎంవోయూలకే పరిమితం కాదు.. ముందుకు ఎలా తీసుకెళ్లాలో చూపిస్తున్నాం. పెట్టుబడులు, ఒప్పందాలే కాదు.. ప్రారంభంలోనూ ముందున్నాం అని చంద్రబాబు అన్నారు. అలాగే విశాఖకు గూగుల్ రాక ఉత్తరాంధ్రకే గర్వకారణమని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. ఆసియాలోనే అతిపెద్ద డేటా సెంటర్ ఏర్పాటవుతోందని తెలిపారు. విశాఖను గూగుల్ ఎంపిక చేసుకోవడం ఏపీకి గర్వకారణమని వ్యాఖ్యానించారు. గూగుల్, ఎయిర్‌టెల్ రెండూ కీలక సంస్థలని వెల్లడించారు. సెప్టెంబర్ 2028 నాటికి గూగుల్ డేటా సెంటర్ పూర్తవుతుందని స్పష్టం చేశారు. అతి త్వరలో అన్నిరంగాల్లో ఏఐ సేవలు వస్తాయని వివరించారు. 60 రోజుల్లో అనకాపల్లి, విశాఖపట్నానికి గోదావరి నీళ్లు వస్తాయని చెప్పుకొచ్చారు. గోదావరి పుష్కరాలకు ముందే పోలవరం ప్రారంభిస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. విశాఖకు అద్భుతమైన కనెక్టివిటీ ఉందని తెలిపారు. 2028 చివరినాటికి ఆర్సెలార్ మిట్టల్ ప్లాంట్ తొలిదశ పూర్తి చేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఏఐ సిటీగా విశాఖ ఉంటుందని.. తెలిపారు. టెక్నాలజీలో దేశానికే గేట్‌వేగా ఆంధ్రప్రదేశ్ ఉందని వెల్లడించారు. పెట్టుబడిదారులే ఏపీకి భాగస్వాములని చెప్పారు. ఒప్పందాలే కాదని.. గ్రౌండింగ్ కూడా తమదే బాధ్యత అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## వివాదంలో అషురెడ్డి వ్యవహారం

హైదరాబాద్చ్బ : బిగ్ బాస్ ఫేమ్, ప్రముఖ సినీనటి అషురెడ్డి చుట్టూ వివాదాలు ముదురుతున్నాయి. పెళ్లి పేరుతో తనను, తన కుటుంబాన్ని నమ్మించి దాదాపు రూ. 9.83 కోట్లు మోసం చేసిందంటూ బాధితుడు ధర్మేంద్ర కుటుంబం ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు ఆమెపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ అషురెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. బాధితుడు ధర్మేంద్ర తండ్రి సత్యనారాయణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం ఈ కేసులోని ప్రధానాంశాలు ఇలా ఉన్నాయి. అషురెడ్డి, ధర్మేంద్ర వివాహం చేసుకోవాలని అనుకున్నారని వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో ప్రముఖ జ్యోతిష్కుడు వేణుస్వామి వద్దకు వెళ్లి ఇరు కుటుంబాలు జాతకాలు కూడా చూపించాయని ప్రచారం జరుగుతోంది. పెళ్లి సాకుతో అషురెడ్డి తన వద్ద నుంచి సుమారు రూ. 9.83 కోట్లు వసూలు చేసిందని ధర్మేంద్ర ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా, ఆమె సోదరి దివ్యారెడ్డికి కూడా రూ. 50 లక్షలు ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పెళ్లికి అన్ని సిద్ధమవుతున్న తరుణంలో అషురెడ్డి అకస్మాత్తుగా ధర్మేంద్రను వివాహం చేసుకోవడానికి నిరాకరించినట్లు సమాచారం. అషురెడ్డి తనను మానసికంగా, ఆర్థికంగా వేధించిందని బాధితుడు ధర్మేంద్ర పేర్కొన్నారు. అషురెడ్డి అవసరాల కోసం తాను పలు బ్యాంకుల నుంచి లోన్‌లు తీసుకుని మరీ ఖర్చు చేశానని తెలిపారు. ఇప్పుడు ఆ లోన్‌లు తీర్చలేక ఇబ్బంది పడుతున్నానని ధర్మేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే, తనపై తిరిగి కేసు పెడతానని లేదా ఆత్మహత్య చేసుకుంటానని అషురెడ్డి బెదిరిస్తోందని ఆయన ఫిర్యాదులో తెలిపారు. తన బాయ్‌ఫ్రెండ్ జయంత్‌తో కలిసి అషురెడ్డి ఈ డ్రామా ఆడిందని, తనను మోసం చేసిందని బాధితుడు వాపోతున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అషురెడ్డి కుటుంబంపై పోలీసులు కఠినమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నేరానికి పాల్పడటం వంటి సెక్షన్ల కింద నాన్ బెయిలబుల్ కేసు నమోదైంది. అయితే తనపై వస్తున్న ఆరోపణలను అషురెడ్డి తోసిపుచ్చారు. ఈ మేరకు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. కనీసం తన వెర్షన్ తీసుకోకుండానే పోలీసులు ఏకపక్షంగా కేసు నమోదు చేశారని ఆమె పిటిషన్‌లో పేర్కొన్నారు. తనపై నమోదైన కేసులో వాస్తవం లేదని, కాబట్టి ఆ కేసును వెంటనే కొట్టివేయాలని ఆమె కోర్టును వేడుకున్నారు. ఈ కేసు ఇప్పుడు న్యాయస్థానం పరిధిలో ఉంది. రెండు నెలల క్రితమే ఫిర్యాదు చేసినా, ఇప్పుడు ఈ వ్యవహారం వెలుగులోకి రావడం చర్చనీయాంశమైంది. అషురెడ్డి పిటిషన్‌పై హైకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## శబరిమలలో మహిళల ప్రవేశంపై విచారణ

వ్యక్తిగత ఆలయాల అంతర్గత ఆచారాల్లోకి వెళ్లదల్చుకోలేదని కోర్టు తెలిపింది. నిర్దిష్టమైన ఆలయ సంప్రదాయాల కంటే, మత స్వేచ్ఛకు సంబంధించిన ప్రాథమిక హక్కుల పరిధినే తాము సమీక్షిస్తున్నట్లు వెల్లడించింది. వాదనల సమయంలో ఒక మహిళా న్యాయవాది అస్సాంలోని కామాఖ్య ఆలయ ఉదాహరణను కోర్టు ముందు ఉంచారు. అక్కడ మహిళల రుతుస్రావాన్ని ఒక వేడుకగా జరుపుకొంటారని ఆమె వివరించారు. అదే సమయంలో, అక్కడ జరిగే జంతు బలులను ఆపాలని ఒక పిటిషనర్ కోరగా.. ధర్మాసనం అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆ ప్రస్తావనను తోసిపుచ్చింది. సీనియర్ అడ్వకేట్ శ్రీధర్ పోతరాజు ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. 'మతపరమైన విశ్వాసాలను పరీక్షించేటప్పుడు నాస్తికుల అభిప్రాయాలను కోర్టు పరిగణనలోకి తీసుకోకూడదు' అని ఆయన వాదించారు. మతపరమైన హక్కులు కేవలం భక్తుల కోణం నుంచే చూడాలని, ఆచారాల పట్ల నమ్మకం లేని వారి వాదనలకు ఇక్కడ తావు లేదని ఆయన కోర్టుకు విన్నవించారు. ఆధ్యాత్మిక స్వేచ్ఛ అనేది రాజ్యాంగంలోని ఆర్టికల్-21 (జీవించే హక్కు)లో అంతర్భాగమని శ్రీధర్ పోతరాజు వాదించారు. మతపరమైన ఆచారాల్లో న్యాయస్థానాల జోక్యానికి ఖచ్చితమైన పరిమితులు ఉండాలని న్యాయవాదులు కోరారు. వ్యక్తిగత విశ్వాసాలకు, రాజ్యాంగ నైతికతకు మధ్య ఉన్న సమతుల్యతపై సుదీర్ఘ చర్చ కొనసాగుతోంది.

## కేంద్రమంత్రి రాజీవ్ రంగన్ సింగ్‌తో వాకిటి భేటీ

మంత్రి రాజీవ్ రంజన్ సింగ్‌తో యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. మత్స్య శాఖ డైరెక్టర్ నిఖిల, పశు సంవర్ధక శాఖ అధికారి లక్ష్మీ నారాయణ తదితరులు ఆయన వెంట ఉన్నారు. పశు సంవర్ధక, పాడి, మత్స్య శాఖల్లో తెలంగాణ అమలు చేస్తున్న పథకాలను కేంద్రమంత్రికి మంత్రి వాకిటి శ్రీహరి వివరించారు. కేంద్రం నుంచి తెలంగాణకు సహకారం ఇవ్వాలని కేంద్రమంత్రిని కోరారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ను శాలువా, పూల బోకే, మెమోటెంతో ఘనంగా సన్మానించిన మంత్రి వాకిటి శ్రీహరి రాష్ట్రానికి కేంద్రం నుంచి కావలసిన సహకారం, ఆక్వా కల్చర్, లైఫ్ సైన్సెస్ లో ఇన్సూరెన్స్, మోపెడ్ కేటాయింపుల్లో న్యాయం వంటి పలు అంశాలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.గోదావరి, కృష్ణా నదుల మధ్య ఉన్న 46 వేల పెద్ద చెరువులు, 26 వేల చిన్న చెరువులు, 100 రిజర్వాయర్ల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గత ప్రభుత్వం కేంద్రం నుంచి వచ్చే నిధులను తీసుకు రావడంలో విఫల మయింది.రాజేంద్ర నగర్ లో ఉన్న ఎన్ఎఫ్‌డిసిని తరలించమని కేంద్రమంత్రి హామీ ఇచ్చారని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. తరలింపుపై వస్తున్న ప్రచారంపై కేంద్రమంతి రాజీవ్ రంజన్ దృష్టికి మంత్రి వాకిటి శ్రీహరి తీసుకుపోయారు. దీనిని తరలించే ఆలోచన లేదని కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్ తెలిపారు.

## మిషన్ భగీరథ కార్మికులకు వేతన బకాయిలు

### ఆరు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని ఆరోపణ

మెదక్,ఏప్రిల్28 : మిషన్ భగీరథలో పని చేస్తున్న కార్మికులకు గత 6 నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం సరైనది కాదని సీఐటీయూ మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు అన్నారు. మంగళవారం చిలిపిచేడ్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు సరైన వేతనం ఇవ్వడం లేదని.. ఇచ్చే వేతనం కూడా 6 నెలలుగా రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వేతనాలు చెల్లించాలని లేనిపక్షంలో కార్మికులను ఐక్యం చేసి పోరాటం చేస్తామని తెలిపారు. కార్మికుల పనిగంటలను పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వారు తెలిపారు. 4 కొత్త లేబర్ చట్టాల అమలు కార్మికుల హక్కులను పెట్టుబడిదారులకు కట్టబెట్టడమే అవుతుందని అన్నారు. బ్రిటిష్ కాలం నుంచే కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 రకాల కార్మికచట్టాలను తొలగించడం సిగ్గు చేటు అని విమర్శించారు. దేశం మొత్తం కరోనాతో అతలాకుతలమవుతున్న సమయంలో (2019, 2020)లో నాలుగు కొత్త లేబర్ చట్టాలను తీసుకురావడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో సంపన్నులు పెరిగారని.. నిరంతరం కష్టపడుతున్న కార్మికులు మాత్రం రోడ్డున పడే దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. మే డే స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. దేశవ్యాప్తంగా మే 1 నుంచి 7వ తేదీ వరకు మేడే వార్షికోత్సవాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

## ప్రపంచానికి సవాల్‌గా మారిన ఉగ్రవాదం

ఉగ్రవాదం పై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించే దేశాలు అందుకు తగిన పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. కిర్గిస్థాన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ రక్షణ మంత్రుల సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గత ఏడాది జమ్ముకశ్మీర్ లోని పహల్గామ్ లో జరిగిన ఉగ్రదాడి గురించి రాజ్‌నాథ్ సింగ్ ప్రస్తావించారు. పవాల్గామ్ ఉగ్రదాడి ఘటన యావత్ మానవాళిని కుదిపేసిందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఆ దాడి అనంతరం 'ఆపరేషన్ సింధూర్ చేపట్టి ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా తప్పించుకోలేరని భారత్ నిరూపించిందని తెలిపారు. ఈ సందర్భంగా పాకిస్థాన్ పేరు ప్రస్తావించకుండా ప్రభుత్వ మద్దతుతో జరిగే సీమాంతర ఉగ్రదాడులను అస్సలు విస్మరించకూడదని వ్యాఖ్యానించారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ద్వంద్వ ప్రమాణాలకు తావులేదని అన్నారు. ఉగ్రవాదులకు సాయపడుతూ ఆశ్రయం కల్పించేవారిపై చర్యలు తీసుకోవడంలో ఎస్‌సీవో వెనకాడకూడదని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షోభం గురించి కూడా ఆయన మాట్లాడారు. గత కొన్నేళ్లుగా జరిగిన వరుస ఘర్షణల్లో అనేకమంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని, భారీ ఆస్తి నష్టం కూడా వాటిల్లిందని చెప్పారు. ఉగ్రవాద బెదిరింపులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకునేందుకు భారత్ సిద్ధంగా ఉందని ఆయన నొక్కి చెప్పారు. ఈ క్రమంలో ఉద్రిక్తతల పరిష్కారానికి దౌత్య మార్గాలను అనుసరించాలన్నారు.

## రాష్ట్రంలో సమృద్ధిగా పెట్రోల్, డీజిల్ నిల్వలు

సరఫరాను క్షేత్ర స్థాయి అధికారులు, పెట్రోల్ కంపెనీల ప్రతినిధులతో రెగ్యులర్ గా మానిటరింగ్ చేస్తున్నట్లు తెలిపారు. అపోహలతో పెట్రోల్, డీజిల్ ను నిల్వచేసుకోవద్దని వినియోగదారులకు పౌర సరఫరాల శాఖ కమిషనర్ సూచించారు.

## నేడు టెన్త్ ఫలితాలు విడుదల

ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు ఫలితాలను విడుదల చేయనున్నట్లు సమాచారం. మార్చి 14 నుంచి ప్రారంభమైన ప్రధాన పరీక్షలు ఈ నెల 13న పూర్తయ్యాయి. సుమారు 5.15 లక్షల మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలు రాశారు. ఈ నెల 23వ తేదీతో జవాబుపత్రాల మూల్యాంకనం పూర్తయింది. మే మొదటి వారంలో ఫలితాలు విడుదల చేస్తామని ముందు నుంచి చెబుతున్నా... తాజాగా ఈనెల 29న విడుదల చేసేందుకు రంగం సిద్ధమైంది. దీంతో పరీక్షల విభాగం అన్ని ఏర్పాట్లు చేసింది.

## సిసి కెమరాలను సైతం హ్యాక్ చేస్తున్నారు

### అలాంటి పోలీస్ అధికారులను వదలం
### మాజీమంత్రి హరీష్ రావు హెచ్చరిక

సంగారెడ్డి,ఏప్రిల్ 28 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రేవంత్ మూర్ఖత్వం.. హిట్లర్‌ను మించిపోయిందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌పై దాడి కేసులో జైల్లో ఉన్న బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నే క్రిశాంక్‌ను హరీశ్ పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కొంత మంది ఐపీఎస్‌లు తమ ఫోన్‌లను.. ఇంటి ముందున్న సిసి కెమెరాలను హ్యాక్ చేస్తున్నారని ఆరోపించారు. బెంగళూరు నుంచి హ్యాకర్లను తీసుకొచ్చి తమపై నిఘా పెడుతున్నారన్నారు. 'అలాంటి అధికారులు జాగ్రత్త.. మీరు రిటైర్డ్ అయినా మిమ్మల్ని వదలం' అని హెచ్చరించారు. మన్నే క్రిశాంక్‌తో పాటు ఏడుగురిపై అక్రమ కేసు పెట్టారని మాజీ మంత్రి మండిపడ్డారు. ప్రశ్నించే వారిపై కాంగ్రెస్ అక్రమ కేసులు పెడుతోందని ఆరోపించారు. రైతులు, రాష్ట్ర ప్రజల పట్ల కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదన్నారు. ఎవరు మాట్లాడితే వాళ్లపై కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీపై అక్రమ పోస్టులు పెడుతున్నారని పోలీసులకు క్రిశాంక్ ఫిర్యాదు చేశారని తెలిపారు. కాంగ్రెస్ వాళ్లపై కేసులు పెట్టాల్సింది పోయి ఫిర్యాదు చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు పెట్టారని మండిపడ్డారు. నాన్ బెయిలబుల్ కేసు ఎలా పెడతారని ప్రశ్నించారు. బెయిల్ ఇవ్వాల్సిన కేసును పాత కేసులు చూపెట్టి జైల్లో వేశారని ఆరోపించారు. ప్రభుత్వ అరాచకాలను ప్రశ్నిస్తే కేసు పెడతారా అని మాజీ మంత్రి హరీశ్ రావు నిలదీశారు.

# ఇలాగైతే విమానాలను నడపలేం

## విమాన ఇంధన ధరలను అదుపు చేయండి

## వెంటనే కేంద్రం జోక్యం చేసుకోవాలి

## కేంద్ర విమానయాన శాఖకు ఎఫ్ఐఏ లేఖ




న్యూఢిల్లీ,ఏప్రిల్28 : విమాన ఇంధన ధరల పెరుగుదలపై ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఎఫ్ఐఏ ఆందోళన వ్యక్తం చేసింది. విమాన ఇంధన ధరల్ని అదుపులోకి తెచ్చేందుకు కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరింది. ఈ మేరకు కేంద్ర విమానయాన శాఖకు మంగళవారం లేఖ రాసింది. కేంద్రం జోక్యం చేసుకుని విమాన ఇంధన ధరలు తగ్గించకుంటే విమానయానాన్ని కొంతకాలం మూసివేయాల్సిన పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఎఫ్ఐఏ సంస్థ ఇండిగో ఎయిర్‌లైన్స్, ఎయిర్ ఇండియా, స్పైస్ జెట్ వంటి సంస్థలకు ప్రతినిధిగా వ్యవహరిస్తుంది. తాజాగా ఆయా సంస్థల తరపున కేంద్రానికి లేఖ రాసింది. ఎఫ్ఐఏ ప్రకారం.. ప్రస్తుతం అంతర్జాతీయ పరిణామాల వల్ల విమాన ఇంధన ధరలు (ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్/ఏటీఎఫ్ ) భారీగా పెరిగాయి. దీంతో విమానయాన సంస్థలపై తీవ్ర ఒత్తిడి పెరిగింది. విమాన ఇంధన ధరల పెరుగుదల వల్ల విమానాల నిర్వహణ కష్టమైపోతోంది. ఏటీఎఫ్ ధరలు చమురు సంస్థలకు అందుబాటులో లేకుండా పెరిగాయి. ఒక కిలోలీటర్ చమురుకు దాదాపు రూ.2 లక్షల వరకు ఖర్చవుతోంది. పశ్చిమాసియాలో క్రూడాయిల్ ధరలు పెరగడం వల్ల ఈ పరిస్థితి తలెత్తింది. సాధారణంగా ఎయిర్ లైన్స్ సంస్థల వ్యయంలో 30,40 శాతం ఇంధనానికి ఖర్చవుతుంది. కానీ, ప్రస్తుతం పరిస్థితుల్లో ధరల పెరుగుదలవల్ల ఈ ఖర్చు 55,60 శాతం పెరిగింది. అందుకే కేంద్రం త్వరగా జోక్యం చేసుకుని ధరలు తగ్గించాలని ఎఫ్ఐఏ కేంద్రాన్ని కోరుతోంది. ఏటీఎఫ్ పై ప్రస్తుతం విధిస్తున్న 11 శాతం పన్నును తగ్గించాలని, అలాగే, రాష్ట్రాలు విధించే వ్యాట్ కూడా తొలగించాలనిల కేంద్రాన్ని కోరుతున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో 25 శాతం వరకు వ్యాట్ ఉన్న సంగతిని ఎఫ్ఐఏ ప్రస్తావిస్తోంది. అలాగే, ఇంధన ధరల్లో స్థిరత్వం తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నాయి. ధరల స్థిరీకరణకు ఒక ప్రత్యేక వ్యవస్థ ఉండాలని ఎఫ్ఐఏ కోరుతోంది. ఇంధన ధరల పెరుగుదల వల్ల అనేక మార్గాల్లో విమానాలు నడపడం ఆయా సంస్థలకు భారంగా మారుతోంది. అంతేకాదు.. కొన్ని రూట్లలో విమాన సర్వీసుల్ని తగ్గించడం, రద్దు చేయడం చేస్తున్నాయి. ఫ్యుయల్ ధరలు పెరిగితే, అంతిమంగా విమాన టిక్కెట్ల ధరలు పెరుగుతాయి.

# త్వరలో ఎస్400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్

### ఐదో దశ సిస్టమ్స్ సరఫరాకు రష్యా అంగీకారం

న్యూఢిల్లీ,ఏప్రిల్28 : రష్యాకు చెందిన ఎస్400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ త్వరలో ఇండియాకు రానున్నాయి. ఇవి ఐదో దశ డిఫెన్స్ సిస్టమ్స్. ఇప్పటికే నాలుగోదశ ఎస్400 క్షిపణులు ఇండియాకు చేరాయి. వీటిని ఇండియా గతంలోనే ఉపయోగించింది కూడా. గత ఏడాది పాకిస్తాన్‌పై ఇండియా ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ దాడి సమయంలో భారత వాయుసేన.. ఎస్400 డిఫెన్స్ సిస్టమ్స్ ను ఉపయోగించింది. ఇప్పుడు ఎస్400 ఐదో దశలో ఇండియాకు అందించేందుకు రష్యా సిద్ధమైంది.వచ్చే నవంబర్ నెలలోనే ఇవి ఇండియాకు రానున్నట్లు సమాచారం. వచ్చే నెల మధ్యలో నాలుగో ఎస్ 400 క్షిపణి విధ్వంసక వ్యవస్థలు ఇండియన్ పోర్టుకు చేరుకుంటాయని సంబంధిత అధికారులు వెల్లడించారు. ఇండియా?రష్యాల మధ్య ఉన్న సైనిక సహకారం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్షిపణులు 400 కిలోమీటర్ల రేంజ్ కలిగి ఉన్నాయి. మరోవైపు కొత్తగా ఇంకో ఐదు ఎస్ 400 సిస్టమ్స్ కొనేందుకు కేంద్రం అంగీకరించింది. 400 కిలోమీటర్ల పరిధిలో భారత గగనతలంపైకి దూసుకొచ్చే క్షిపణుల్ని, విమానాల్ని ఇవి ధ్వంసం చేస్తాయి. ముఖ్యంగా పాకిస్తాన్ నుంచి సింధు నది ప్రాంతం నుంచి వచ్చే గగనతల దాడుల్ని ఇవి అడ్డుకుంటాయి. ఇప్పటికే భారత రక్షణ రంగ అధికారులు రష్యా సందర్శించి ఎస్400 సిస్టమ్స్ తనిఖీ చేశారు. కొత్తగా వచ్చే క్షిపణి విధ్వంసక వ్యవస్థను రాజస్థాన్?లో ఏర్పాటు చేయబోతున్నారు. గతంలో ఆపరేషన్ సిందూర్ సమయంలో ఎస్ 400 క్షిపణి విధ్వంసక వ్యవస్థను ధ్వంసం చేసేందుకు పాకిస్తాన్ ప్రయత్నించింది. పంజాబ్, గుజరాత్లోని ఎస్400 డిఫెన్స్ సిస్టమ్స్ పై దాడికి విఫలయత్నం చేసింది. ఈ సిస్టమ్స్ వల్ల పాకిస్తాన్లోని వైమానిక స్థావరాలు సురక్షితం కాదని ఆ దేశం భావించింది. దీంతో స్థావరాల్ని మార్చేసినట్లు సమాచారం.

# తెలంగాణ డిజిపిగా సివి ఆనంద్

### ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

హైదరాబాద్,ఏప్రిల్28 : తెలంగాణ కొత్త డీజీపీగా సీవీ ఆనంద్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. యూపీఎస్సీ ఎంపానెల్ సిఫార్సుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. ప్రస్తుతం సీవీ ఆనంద్ హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఆయన డీజీపీగా ప్రమోషన్ పొందనున్నారు. ఈ బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఈ నియామకం అమల్లోకి వస్తుంది. తెలంగాణ ప్రస్తుత డీజీపీ కె. శివధర్ రెడ్డి ఈనెల 30వ తేదీన ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ పోలీస్ బాస్‌గా సీవీ ఆనంద్ నియమితులయ్యారు. ఏప్రిల్ నెలాఖరులో ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి పదవి విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో కొత్త డీజీపీ ఎంపిక అనివార్యమైంది. అందుకు రాష్ట్రంలోని సీనియర్ ఐపీఎస్ అధికారుల పేర్లు జాబితాను ఇటీవల యూపీఎస్సీ.. రాష్ట్ర ప్రభుత్వం పంపింది. ఆ జాబితాలో 1991 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్‌తోపాటు 1994 బ్యాచ్‌కు చెందిన వినాయక్ ప్రభాకర్ ఆప్టే, సౌమ్యా మిశ్రా ఉన్నారు. వారిలో సీనియర్ అయిన సీవీ ఆనంద్‌ను రాష్ట్ర ప్రభుత్వం కొత్త డీజీపీగా ఎంపిక చేసింది.

# చర్లపల్లి స్టేషన్ వద్ద భూమి కేటాయించండి

### సిఎం రేవంత్‌కు కిషన్ రెడ్డి లేఖ

హైదరాబాద్,ఏప్రిల్28 : ఆధునీకరించిన చర్లపల్లి రైల్వే స్టేషన్ వద్ద సౌకర్యాల కోసం అవసరమైన భూ కేటాయింపులు చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ రాశారు. చర్లపల్లి రైల్వే స్టేషన్ దగ్గర రోడ్లు, పార్కింగ్ కోసం భూమి, సికింద్రాబాద్ స్టేషన్ రోడ్డు విస్తరణ గురించి లేఖలో ప్రస్తావించారు. చర్లపల్లి స్టేషన్ దగ్గర రోడ్లు ఇరుకుగా ఉండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని.. వాటిని విస్తరించాలని కోరారు. పార్కింగ్ కోసం స్టేషన్ దగ్గర అదనంగా 5 ఎకరాల భూమి కావాలన్నారు. అలాగే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద కూడా రోడ్లు ఇరుకుగా ఉన్నాయని.. విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. సీఎం స్వయంగా వీటిపై దృష్టి సారించాలని కోరారు.

# పార్లమెంటులో ఏం జరుగుతుందో తెలుసుకో

### కెసిఆర్‌కు ఎంపి మల్లు రవి చురకలు

హైదరాబాద్,ఏప్రిల్28 : పార్లమెంటులో ఏం జరుగుతుందో తెలుసుకుని మాట్లాడితే బాగుండేదని బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌పై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి మరోసారి మండిపడ్డారు. మంగళవారం హైదరాబాద్‌లో మల్లు రవి విలేకర్లతో మాట్లాడుతూ.. ఫాం హౌస్‌లో ఉండే కేసీఆర్‌కు పార్లమెంట్‌లో ఏం జరుగుతుందో తెలియనట్లు ఉందన్నారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలంటూ కేసీఆర్‌కు ఆయన హితవు పలికారు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య క్షమాపణలు చెప్పాలని తాము వెంటనే పార్లమెంట్‌లో డిమాండ్ చేశామని ఈ సందర్భంగా మల్లు రవి గుర్తు చేశారు. అలాగే పార్లమెంట్ బయట కూడా కాంగ్రెస్ ఎంపిలు ఆందోళన చేశారని అన్నారు. ఇవన్నీ బిఆర్ఎస్ నేతలకు తెలియవా అన్నారు. పార్లమెంట్‌లో తేజస్వీ వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించిందన్నారు. కాంగ్రెస్ నేతలపై కేసీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేయడం సరికాదని ఆయన సూచించారు.

# కేజ్రీవాల్ బాటలో సిసోడియా

### హైకోర్టు విచారణకు హాజరుకాబోనంటూ లేఖ

న్యూఢిల్లీ,ఏప్రిల్28 : ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ రూట్లోనే ఆ పార్టీ నేత మనీష్ సిసోడియా వెళ్తున్నారు. ఢిల్లీ లిక్కర్ కేసులో.. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వరణ కాంత శర్మ ముందు హాజరుకాబోనన్నారు. ఈ నేపథ్యంలో ఆయన మంగళవారం జస్టిస్ స్వరణ కాంతకు లేఖ రాశారు. జస్టిస్ స్వరణ శర్మ కోర్టులో ఈ కేసు ముందు హాజరాకాబోనని కేజ్రీవాల్ సోమవారం ఓ లేఖ రాసిన విషయం తెలిసిందే. వ్యక్తిగతంగా కానీ, న్యాయవాది ద్వారా కానీ ఆయన హాజరుకాబోనన్నారు. అయితే అదే తరహాలో ఇవాళ సిసోడియా కూడా లేఖ రాశారు. ప్రస్తుత పరిస్థితుల్లో న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదని సిసోడియా పేర్కొన్నారు. న్యాయ ప్రక్రియపై తనకు నమ్మకం లేదన్నారు. ఇంకా ఆయన తన లేఖలో తీవ్ర విమర్శలు కూడా చేశారు. మీ పిల్లల భవిష్యత్తు తుషార్ మెహతా చేతుల్లో ఉందని సిసోడియా వ్యాఖ్యలు చేశారు. సిసోడియా చేసిన వ్యాఖ్యలు న్యాయవ్యవస్థతో పాటు రాజకీయా విభాగాల్లోనే తీవ్ర చర్చ జరిగే అవకాశాలు ఉన్నాయి. తన కేసులో న్యాయవాదిని పెట్టుకోను అని, సత్యాగ్రహ బాటలో నడవనున్నట్లు సిసోడియా పేర్కొన్నారు.

# రిలయన్స్ ఫ్రాడ్ కేసులో ఇడి దూకుడు

### సుమారు 3034 కోట్ల ఆస్తుల అటాచ్

ముంబై,ఏప్రిల్28 .: రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ బ్యాంకు ఫ్రాడ్ కేసులో సుమారు 3034 కోట్ల ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అటాచ్ చేసింది. దీంతో ఈ కేసులో ఇప్పటి వరకు రిలయన్స్ అనిల్ అంబానీ గ్రూపుకు చెందిన సుమారు 19,344 కోట్లు అటాచ్ చేశారు.అటాచ్ చేసిన ప్రాపర్టీల్లో ముంబైకి చెందిన ఉషా కిరణ్ బిల్డింగ్, ఖండాలాలోని ఫార్మ్‌హౌజ్, అహ్మదాబాద్‌లోని సనాంద్‌లో ఉన్న భూమి ఉన్నాయి. రిలయన్స్ ఇన్‌ఫ్రాస్టక్చర్ సంస్థకు చెందిన 7.71 కోట్ల విలువైన షేర్లను కూడా జప్తు చేశారు. అనిల్ అంబానీకి చెందిన రైస్ ట్రస్ట్ ఆధీనంలో ఆ గ్రూపు ఉన్నది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఏర్పడిన సిట్ బృందం రిలయన్స్ అనిల్ అంబానీ గ్రూపు కేసులను విచారిస్తున్నది. మనీల్యాండరింగ్‌తో పాటు నిధుల మళ్లింపు, బ్యాంక్ నిధుల దుర్వినియోగం కోణంలో కేసు విచారణ జరుగుతున్నది. ఎస్బీఐ, పీఎన్బీ, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఎల్ఐసీ ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా సీబీఐ కేసులు నమోదు చేసింది. ఆ కేసులపై ఈడీ దర్యాప్తు చేస్తున్నది. ఆర్‌కామ్‌తో పాటు ఆ గ్రూపు కంపెనీలు దేశీయ, విదేశీ కంపెనీల నుంచి రుణాలు తీసుకున్నది, ఆ మొత్తం విలువ సుమారు 40,185 కోట్లు ఉంటుందని భావిస్తున్నారు.

# వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘం భేటీ

### కొత్త వరివంగడాలను విడుదల చేసిన అధికారులు

ఆదిలాబాద్,ఏప్రిల్28 : కొత్త వరి, సోయా వంగడాలను అధికారులు విడుదల చేశారు. ఉత్తర తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘం సమావేశం మంగళవారం ఆదిలాబాద్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ రాజర్షిషా హాజరయ్యారు. గతేడాది చేపట్టిన విస్తరణ, 2026-2027 సంవత్సరానికి గాను వానాకాలం, యాసంగిలో చేపట్టనున్న కార్యక్రమాలను గురించి ఈ సమావేశంలో చర్చించారు. ఆయా జిల్లాల వ్యవసాయాధికారులు మాట్లాడుతూ జిల్లాల్లోని వాతావరణ పరిస్థితులు, సాగవుతున్న పంటలు, శాఖాపరంగా తీసుకుంటున్న చర్యలను వివరించారు. గతేడాది నిర్వహించిన సమావేశం సిఫారసులపై కార్యాచరణ నివేదికను కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా. బి.రాంప్రసాద్, ఉత్తర తెలంగాణ మండలాల్లో గతేడాది చేపట్టిన వివిధ విస్తరణ కార్యక్రమాల గురించి ఆదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డా. ఎన్. రాంగోపాల్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో ప్రొ. జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డా. ఎం, బాల్ రాజ్, విస్తరణ సంచాలకులు డా. యాకాద్రి, వ్యవసాయ మిషనరేట్ ప్రతినిధి అనిత, ఉత్తర వ్యవసాయ విస్తరణ సలహా మండలి సభ్యుడు కె. నరసింహ నాయుడు, తెలంగాణ జిల్లాల వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

# సింగరేణిని పదేళ్లలో దోచేశారు

### ఏటిఎంలా వాడుకుని వదిలేశారు

### రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దివాళా తయించారు

### కెసిఆర్ తీరుపై మండిపడ్డ మంత్రి వివేక్

మంచిర్యాల,ఏప్రిల్28 : గత పదేళ్లలో సింగరేణి సంస్థను కేవలం ఒక ఏటీఎంలా వాడుకున్నారే తప్ప, కార్మికుల శ్రేయస్సును పట్టించుకోలేదని బిఆర్ఎస్ పాలకులపై మంత్రి వివేక్ మండిపడ్డారు. కొత్త గనుల కేటాయింపులో బీఆర్ఎస్ వైఫల్యం చెందిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సింగరేణిని గాడిన పెడుతున్నామని.. నేరుగా వేలంలో పాల్గొని కొత్త బొగ్గు గనులను దక్కించు కుంటున్నామని తెలిపారు. మంత్రి వివేక్ వెంకటస్వామి బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్‌పై నిప్పులు చెరిగారు. తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టడమే కాకుండా, సింగరేణిని ఏటీఎంలా వాడుకున్నారని ధ్వజమెత్తారు. మంచిర్యాల జిల్లా మందమర్రిలో మీడియాతో మాట్లాడిన ఆయన.. రూ. 60 వేల కోట్ల అప్పుగా ఉన్న తెలంగాణను.. 8 లక్షల కోట్ల అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత కేసీఆర్‌దేనని వివేక్ విమర్శించారు. ఇందులో భాగంగానే రామకృష్ణ పూర్ ఓపెన్ కాస్ట్ ఫేజ్-2 మైన్ మంజూరైన విషయాన్ని గుర్తుచేశారు. నాడు సింగరేణికి రావాల్సిన 25 వేల కోట్ల బకాయిలపై నోరు మెదపని కార్మిక సంఘాలు.. నేడు నెలకు 10 కోట్లు ఖర్చు చేస్తూ సోషల్ మీడియాలో ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మంత్రి మండిపడ్డారు. ఒక అట్టర్ ఎ÷-లాప్ అని.. అందులో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాల్సిన బాధ్యత కేంద్రానిదేనని స్పష్టం చేశారు. గతంలో నడ్డా, అమిత్ షా వంటి వారు అవినీతి జరిగిందని ఆరోపించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు.

# లొంగిపోయిన మావోలకు పునరావాసం

### పర్యాటక శాఖలో గిరిదర్శక్ గైడ్లుగా శిక్షణ

హైదరాబాద్ : రాష్ట్రంలో లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో పునరావాసం కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన చర్యలు ముగింపు దశకు చేరుకున్నాయి. పర్యాటక శాఖలో గిరి దర్శక్ గైడ్ల పేరుతో వారికి ఉద్యోగాలు కల్పించింది. వారంతా కర్రెగుట్టలు, భద్రాచలం, ములుగు జిల్లాల్లో విధులు నిర్వహించనున్నారు. అందుకోసం వారికి.. నెల రోజులపాటు తెలంగాణ స్పెషల్ ఇంటిలిజెన్స్ బ్యూరో(ఎస్ఐబీ), పర్యాటక శాఖ సంయుక్తంగా శిక్షణ అందించాయి. ఈ శిక్షణ పూర్తి కావడంతో.. వారిని పర్యాటక శాఖలో కొలువుల్లోకి తీసుకున్నారు. దేశవ్యాప్తంగా మావోయిస్టులు లొంగిపోయి.. జన జీవన స్రవంతిలో కలిసి దేశాభివృద్ధికి పాటుపడాలని కేంద్రం పిలుపునిచ్చింది. అందుకోసం'ఆపరేషన్ కగార్'ను తెరపైకి తీసుకు వచ్చింది.

# కవిత ప్రశ్నలకు ఎందుకు సమాధానం ఇవ్వలే

### కాలేశ్వరం తదితర విషయాలపై ఎందుకు దాటవేస్తున్నారు

### రైతుల గురించి బిఆర్ఎస్‌ది మొసలి కన్నీరు

### కెసిఆర్ తీరుపై మండిపడ్డ విప్ ఆది శ్రీనివాస్

హైదరాబాద్,ఏప్రిల్28 : రైతు ప్రయోజనాలకు పెద్దపీట వేసిందే కాంగ్రెస్ పార్టీ అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ఆలోచన చేయడంతోపాటు, పంటలకు మద్దతు ధర చట్టాన్ని తీసుకొచ్చిందే కాంగ్రెస్ పార్టీ అని చెప్పారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో తరుగు పేరుతో రైతులను దోపిడీ చేశారని విమర్శించారు. ఏ రైతునూ కలవని కేసీఆర్‌కు తాము ఇబ్బందుల్లో ఉన్నామని చెప్పిందెవరని నిలదీశారు. సారు బయటకి రారు.. ఎవరినీ కలవరు.. అని స్వయంగా కేసీఆర్ కుమార్తె అన్నారు. రాష్ట్ర రైతులను పట్టించుకోని కేసీఆర్.. ఇతర రాష్ట్రాలకు వెళ్లి చెక్కులు ఇచ్చారని ఆమె చెప్పారు. కవిత చేసిన వ్యాఖ్యలపై సమాధానం చెప్పని కేసీఆర్.. కాంగ్రెస్‌ను తప్పు పడుతున్నారని మండిపడ్డారు. ముందు ఆమె చేసిన వ్యాఖ్యలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతుల కోసం గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఏడాదికి రూ.2,800 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. వరిసాగు విస్తీర్ణంలో తెలంగాణ ఇవాళ పంజాబ్‌ను అధిగమించింది. ఈ సీజన్‌లో కూడా 8వేల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం నడుపుతోందన్నారు. మసిపూసి మారేడుకాయ చేయడం బీఆర్ఎస్ నేతలకు అలవాటు. ధాన్యానికి బోనస్‌గా రైతుల ఖాతాల్లో ఇప్పటికే రూ.3 వేల కోట్లు వేశాం. వరికి బోనస్ ఇవ్వాలనే ఆలోచన కేసీఆర్‌కు ఎప్పుడైనా వచ్చిందా అని ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. కేసీఆర్ ఒక్క రైతుబంధు అమలు చేసి అన్ని పథకాలు నిలిపివేశారు. పంట నష్ట పరిహారం, వ్యవసాయ పరికరాలకు సబ్సిడీ ఆపేశారు. ఈ ప్రభుత్వం రైతు భరోసాతోపాటు గతంలోని పథకాలను అమలు చేస్తోంది. బీఆర్ఎస్ ఎందుకు ఓడిపోయిందో.. పోస్టుమార్టం చేసుకోవట్లేదు. ఆ పార్టీ నేతలు అహంకార ధోరణిలో ఇంకా ప్రజలనే తప్పుపడుతున్నారని ఆది శ్రీనివాస్ విమర్శించారు. చేసిన తప్పులను కెసిఆర్ కూతరు కవితే బయట పెట్టారని అన్నారు. కాళేశ్వరం సహా అనేక విషయాల్లో సంధించిన ప్రశ్నలకు కెసిఆర్ సమాధానం చెప్పివుంటే హుందాగా ఉండేదని అన్నారు.

# పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెంపు

### దేశవ్యాప్తంగా కొరతపై పుకార్లు.. పుకార్లను ఖండించిన కేంద్రం

### అలాంటి ఆలోచన లేదని స్పష్టీకరణ

న్యూఢిల్లీ,ఏప్రిల్28 : నేడు బెంగాల్ ఎన్నికలు ముగియగానే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతారంటూ వస్తున్న పుకరా÷-లను కేంద్రం తోసిపుచ్చింది. అయితే అలాంటిదేమీ లేదని వినియోగదారులకు హామీ ఇచ్చింది. పశ్చిమబెంగాల్ పోలింగ్ ఈనెల 29న పూర్తి కాగానే పెట్రోల్, డీజిల్ ధరలు పెరగనున్నాయంటూ వస్తున్న ఊహాగానాలను కేంద్రం కొట్టివేసింది. అలాంటి ఆలోచన ఏదీ లేదని వివరణ ఇచ్చింది. పశ్చిమాసియాలో ఘర్షణలతో గత రెండు నెలలుగా క్రూడాయిల్ ధరలు 50 శాతం పెరిగాయి. అయినప్పటికే రికార్డు స్థాయిలో గత నాలుగేళ్లుగా రిటైల్ పెట్రోల్, డిజిల్ ధరల్లో ఎలాంటి మార్పు చోటుచేసుకోలేదు. పశ్చిమాసియాలో తలెత్తిన ఘర్షణల కారణంగా చమురు ఉత్పత్తి ధరలు, పంప్ ధరల మధ్య వ్యత్యాసం పెరిగింది. దీంతో ఇంధనం రిటైలర్లు ప్రతిరోజూ రూ.2,400 కోట్ల మేర నష్టాలను చవిచూస్తున్నారని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారంతో పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పూర్తికాగానే పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం అనివార్యమని బలంగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీనిపై పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాతా శర్మ మాట్లాడుతూ, పెట్రోలో, డీజిల్ ధరలు పెంచే ప్రతిపాదన ఏదీ లేదని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో 'ప్యానిక్ బైయింగ్' జరుగుతున్నట్టు తెలుస్తోందని, ఆయా ప్రాంతాల్లో పరిస్థితి గురించి రాష్ట్ర ప్రభుత్వాలతో నిరంతర సంప్రదింపులు జరుపుతున్నామని, రిటైల్ ఔట్‌లెట్స్‌ను మానిటర్ చేస్తున్నామని, అవసరమైన సరఫరాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని, స్టాక్ అందుబాటులో ఉండేలా చూస్తున్నామని, ఎలాంటి డ్రైఔట్‌లు లేవని చెప్పారు. 'తగినన్ని ఎల్‌పిజీ, పెట్రోల్, డీజిల్ సరఫరాలు మావద్ద ఉన్నయి. ధరలు కూడా నిలకడగా ఉన్నాయి. రేట్లలో ఎలాంటి పెరుగుదల లేదు' అని వివరించారు. వదంతులు నమ్మవద్దని కోరారు.

# ఆంధ్రాలో కొలిక్కి వచ్చిన పెట్రో సమస్య

### సరఫరా యథావిధిగా ఉన్నట్లు ప్రకటన

అమరావతి,ఏప్రిల్28 : ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని రోజులుగా ఎదురైన పెట్రోల్, డీజిల్ కొరత సమస్య క్రమంగా తగ్గుముఖం పట్టింది. మంగళవారం సాయంత్రం 7 గంటల సమయానికి రాష్ట్రంలోని సుమారు 90 శాతం పెట్రోల్ బంకుల్లో సాధారణ పరిస్థితులు నెలకొన్నట్లు అధికారులు వెల్లడించారు. సరఫరా మెరుగుపడటంతో పెట్రోల్ బంకుల వద్ద రద్దీ భారీగా తగ్గిపోయింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు సమస్యను అధికారులు నిరంతరం పర్యవేక్షించారు. ఇంధన సరఫరాను వేగవంతం చేయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఈరోజు సాయంత్రం 6 గంటల వరకు వినియోగదారులకు 5,373 కిలోలీటర్ల పెట్రోల్, 8,777 కిలోలీటర్ల డీజిల్ సరఫరా చేసినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. ఇదే రోజు స్టాక్ పాయింట్ల నుంచి పెట్రోల్ బంకులకు 10,402 కిలోలీటర్ల పెట్రోల్, 17,805 కిలోలీటర్ల డీజిల్ పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈరోజు అర్ధరాత్రి నుంచి రేపు ఉదయం వరకూ ఏపీలోని 100 శాతం బంకుల్లో పెట్రోల్, డీజిల్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుందని అధికారులు చెబుతున్నారు. పరిస్థితి మెరుగుపడటంతో అధికారులు, వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.

# హైదరాబాద్‌లో భారీగా డ్రగ్స్ పట్టివేత

హైదరాబాద్,ఏప్రిల్28 : గంజాయి, డ్రగ్స్‌పై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నా.. వీటి అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. మంగళవారం హైదరాబాద్ మహానగరంలో భారీ ఎత్తున డ్రగ్స్, విదేశీ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో భారీ ఎత్తున డ్రగ్స్‌ను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటిలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు పట్టుకున్నారు. స్టేషన్‌లో ఇద్దరు మహిళల నుంచి 11.4 కిలోల నిషేధిత అంఫెటమైన్ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిద్దరినీ అరెస్ట్ చేసి.. విచారణ కోసం డీఆర్ఐ కార్యాలయానికి తరలించారు. స్వాధీనం చేసుకున్న ఈ డ్రగ్స్ విలువ రూ.11.40 కోట్లు ఉంటుందని డీఆర్ఐ అధికారులు తెలిపారు. సోమవారం బ్యాంకాక్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న ప్రయాణికుడి వద్ద నుంచి 6.5 కేజీల విదేశీ గంజాయిని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ. 2.15 కోట్ల ఉంటుందని తెలిపారు. డీఆర్ఐ అధికారులు ఇచ్చిన ముందస్తు సమాచారం మేరకు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో మాటు వేసి.. అతడిని పట్టుకున్నామని కస్టమ్స్ అధికారులు వివరించారు. ఎవరికీ అనుమానం రాకుండా లగేజ్ బ్యాగులో దాచి విదేశీ గంజాయిని తీసుకొచ్చినట్లు తెలిసింది. స్మగ్లర్‌పై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు కస్టమ్స్ అధికారులు వెల్లడించారు.

# సంపాదకీయం

## భూసేకరణలతో రైతుల గుండెల్లో రైళ్లు !

రాజధాని అమరావతికి ఇప్పటికే 32వేల ఎకరాలు సేకరించారు. మరో దశలో భూసేకరణకు సిద్ధం అవుతున్నారు. ఇప్పటి వరకు సేకరించిన భూములకు సంబంధించి రైతులకు సరైన పరిహారం దక్కలేదు. ప్లాట్లు కూడా దక్కలేదు. కౌలు కూడా అరకొరగా అందచేస్తున్నారు. అయినా రైతులు రాజధాని కోసం సర్వస్వం త్యాగం చేశారు. మరిన్ని భూములు సేకరించే ప్రయత్నంలో కొంత వ్యతిరేకత తప్పడం లేదు. మూడు పంటలు పండే, కృష్ణా పరివాహక భూములు ఇవ్వడం సాధ్యం కాదని అంటున్నారు. రైతులకు మంచి ధరలు ఇచ్చి కొనడంలో కూడా సర్కార్ మీనమేషాలు లెక్కిస్తోంది. గతంలో ఇచ్చిన భూముల రైతులకు పెద్దగా దక్కింది కూడా లేదు. ఇప్పుడది చాలదన్నట్టు 65వ నెంబరు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా 189 కిలోమీటర్ల పొడవున 250 మీటర్ల వెడల్పుతో ఔటర్ రింగురోడ్డు ఒఆర్ఆర్ నిర్మాణం చేపట్టబోతున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో గుంటూరు, ఎన్‌టిఆర్, పల్నాడు, కృష్ణా, ఏలూరు జిల్లాల్లో ప్రభావిత ప్రాంతాల రైతులు తీవ్రమైన ఆందోళన చెందుతున్నారు. ఎన్‌టిఆర్ జిల్లా పరిటాల నుండి ఇబ్రహీంపట్నం వరకూ కృష్ణానదికి సమీపంగా ఒఆర్ఆర్ నిర్మిస్తామంటూ అక్కడి భూయజమానులతో ఇటీవల అధికారులు చెప్పారు. దీంతో ఇప్పటికే మూడుసార్లు భూసేకరణ కింద భూమిని కోల్పోయామనీ, ప్రభుత్వానికి ఇంకెన్నిసార్లు భూములివ్వాలని రైతులు అభ్యంతరం తెలిపారు. మరోమారు భూసేకరణ పిడుగు పడడంతో వారు ఆందోళనలో ఉన్నారు. దేశంలో అనేక ముఖ్య నగరాల్లో ఒఆర్ఆర్, జాతీయ రహదారులు 70 మీటర్ల వెడల్పుతో నిర్మించగా అమరావతి రింగురోడ్డును 250 మీటర్ల వెడల్పుతో నిర్మించే ప్రతిపాదన సరికాదు. రైతుల అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా కేంద్ర ప్రభుత్వ జాతీయ రహదారుల అథారిటీ (ఎన్‌హెచ్‌ఎఐ) డిపిఆర్ కూడా సిద్ధం చేసి, ముందుకు పోతుండడం రైతుల ప్రయోజనాలు దెబ్బతీయడమే. వారికి భూమికి భూమి ఇచ్చివుంటే సమస్యలు వచ్చి ఉండేవి కావు. రాజధాని నిర్మాణం, పట్టణాభివృద్ధి పేరిట రాష్ట్ర ప్రభుత్వం రైతులను తీవ్ర ఒత్తిళ్లకు గురిచేయడం సరైన పద్ధతికాదు. అమరావతి కోసం తొలి దశ పూలింగ్‌లో భూములిచ్చిన రైతులకు డెవలప్ చేసిన ప్లాట్లు ఇప్పటికీ ఇవ్వలేదు. భూ యజమానులకు కౌలు, పేదలకు పింఛన్లు సరిగా అందడం లేదు. ఇబ్బందులిలా వుండగానే ఏలినవారు రెండవ దశ, అనంతరం మరింత విస్తరించడానికి భూములు సమీకరిస్తామని ఊరూరా తిరుగుతుంటే అన్నదాతల గుండెలు అదురుతున్నాయి. అదేపనిగా వేల ఎకరాలు సేకరించడం వెనక రియల్ మోసం ఉందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. తొలుత రాజధాని కోసం ప్రతిపాదించిన భూమితో సరిపెట్టుకోకుండా మరోమారు భూసేకరణకు దిగారు. ఇప్పుడు ఓఆర్ఆర్ ప్రతిపాదిస్తున్న మండలాలు, గ్రామాల పరిధిలో భూములు చాలా విలువైనవి. రైతులు, కూలీల జీవనం వాటిపైనే ఆధారపడి ఉంది. ఆ భూముల విలువ బహిరంగ మార్కెట్లో కోటి రూపాయల నుండి రెండుకోట్ల వరకూ ఉంటుంది. భూములు కోల్పోయే రైతులకు వ్యక్తిగతంగా నోటీసులు ఇవ్వకుండా కొన్ని గ్రామాల్లో సచివాలయాల ముందు భూముల సేకరణకు సంబంధించి సర్వే నెంబర్లు, ఎల్‌పి నెంబర్లు సేకరించే భూమి విస్తీర్ణం వంటి వివరాలతో నోటీసులు అతికించారు. ఇందులో ఏ రైతు భూమిని ఎంత విస్తీర్ణం ప్రభుత్వం సేకరించబోతోంది వంటి వివరాలు రైతుల వారీగా లేకపోవడంతో గందరగోళం నెలకొంది. ప్రభుత్వం పత్రికల్లో చేసిన ప్రకటన, సచివాలయాల్లో వేలాడదీసిన పత్రాలు పారదర్శకంగా లేకపోవడంతో రైతులు భయాందోళనల్లో ఉన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం గ్రామసభలు జరిపి సామాజిక ప్రభావ అంచనా వివరించి రైతులు, ప్రజల సమ్మతి పొందడం అవసరం. అటువంటి చట్టబద్ధమైన ప్రక్రియ అమరావతి ఔటర్‌రింగు రోడ్డు ప్రతిపాదిత గ్రామాల్లో ఇప్పటి వరకూ ఎక్కడా చేపట్టకపోవడం ప్రభుత్వానికి తగదు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో ఉన్న భూముల రేటుకు అనుగుణంగా ప్రభుత్వం పరిహారం ఇవ్వాలన్న రైతుల కోర్కె ఎంతో సమంజస మైనది. నయాయబద్ధమైనది కూడా. ఆ ప్రాంతం అభివృద్ధి చెందితే భూముల విలువలు ఎంతగానో పెరుగుతాయని భూ సమీకరణకు రైతులను అంగీకరింపజేయడానికి చెప్పిన ఏలికలు ఆ రైతులకు ఇప్పటి మార్కెట్ విలువనైనా పరిహారంగా చెల్లించలేదు. ఆర్ఆర్‌లో భూమి కోల్పోతున్న ఎన్‌టిఆర్ జిల్లాకు చెందిన 71 మంది రైతులు హైకోర్టును ఆశ్రయించారు. కొత్తగా జాతీయ రహదారి వేయాలనుకున్న ప్రాంతం కృష్ణానది బఫర్‌జోన్లో ఉందని, గతంలో వరదలు వచ్చిన సమయంలో పెద్దఎత్తున ముంపునకు గురయ్యాయని, నీటి ఒత్తిడి కూడా ఎన్‌టిఆర్ జిల్లావైపు ఉంటోందని, వరదలు వచ్చిన సమయంలో నష్టం ఎక్కువగా ఉండటంతోపాటు రోడ్డుకు దక్షిణభాగంలో ఉండే గ్రామాలన్నీ మునిగిపోతాయని ధర్మాసనం ఎదుట మొరపెట్టుకున్నారు. అన్నదాతల వాదనలను పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం జాతీయ రహదారి విస్తరణకు సంబంధించిన పూర్తి వివరాలు కోర్టుకు సమర్పించాలని ఆర్‌అండ్‌బి, జలవనరులు, ఎన్‌హెచ్‌ఎఐ అధికారులను ఆదేశించింది. అభివృద్ధి పేరిట భారీగా భూములు గుంజుకుంటున్న ప్రభుత్వం ఇప్పటికైనా విచక్షణతో వ్యవహరించడం అవసరం. ఒఆర్ఆర్ ను 70 మీటర్లకే పరిమితం చేయడం విజ్ఞతగా ఉంటుంది. భూమి కోల్పోయే రైతులను, నష్టపోయే ప్రజలను భాగస్వాములను చేసి వారి ఆమోదంతోనే ముందుకు వెళ్లడం అన్ని విధాలా మంచిది. అలాగే భూములు కావాల్సి వచ్చినప్పుడు బహిరంగ మార్కెట్ ధరలు చెల్లించి సేకరించడం అవసరం. అంతేగానీ రైతులను మహ్యా పెట్టి, వారిని కూలీలుగా దిగజార్చే చర్యలు మాత్రం సహించరానివి.

# రగులుతున్న రాజకీయ హింసాగ్ని



అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌పై ఆదివారంనాడు జరిగిన హత్యాయత్నంపై ప్రపంచమంతా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తోంది. ఈ హత్యాయత్నానికి దారి తీసిన కారణాలపై చర్చ తీవ్రంగా జరుగుతోంది. అమెరికాలో రాజకీయ హింస అనేది కొత్తేమీ కాదు. ఆ దేశచరిత్రలో తుపాకీ సంస్కృతి ఒక భాగమై పోయింది. రిపబ్లికన్ అధినేత అబ్రహం లింకన్ 1865లో హత్యకు గురికాగా, అప్పటి నుంచి 1963లో జాన్ ఎఫ్. కెన్నడీ వరకు అధికారంలో ఉన్న నలుగురు అధ్యక్షులు హత్యకు గురయ్యారు. 2007 కాంగ్రెసనల్ రీసెర్చి సర్వీస్ నివేదిక ప్రకారం ప్రభుత్వ అధినేతలుగా ఉన్న 45 మంది ప్రముఖుల్లో 10 మందిపై ప్రత్యక్ష దాడులు జరిగినట్టు తేలింది. ఇక హత్యాయత్న వైఫల్యాలు, బెదిరింపులు తదితర సంఘటనలు 30కి పైగా జరిగాయి. ఈ నేపథ్యంలో కూడా 2024లో కూడా ట్రంప్‌పై రెండుసార్లు హత్యా ప్రయత్నాలు జరిగాయి. ఇప్పుడు ఈ సంఘటనను రిపబ్లికన్లు, డెమోక్రాట్లు తమ రాజకీయ ప్రయోజనాలకు అన్వయించుకుంటున్నారు. ట్రంప్ మద్దతుదారులు, రిపబ్లికన్లు ఇది ప్రజాస్వామ్యంపై దాడిగా విమర్శిస్తుండగా, ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై యుద్ధాన్ని ప్రేరేపించడం, ద్వేషపూరిత హెచ్చరికలు ఇవే ట్రంప్‌పై దాడికి కారణమవుతున్నాయని డెమోక్రాట్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్రంప్ మాటలు యుద్ధనేరాలని, నరమేధాన్ని ప్రోత్సహిస్తున్నాయని చట్టసభ సభ్యులు ఆరోపిస్తున్నారు. ట్రంప్‌ను పదవినుంచి వెంటనే తొలగించాలని, 25వ రాజ్యాంగ సవరణను ఉపయోగించాలని గతంలో కూడా డెమోక్రాట్లు డిమాండ్ చేయడం గమనార్హం. మొత్తం మీద రానున్న నవంబర్‌లో మధ్యంతర ఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ హత్యాయత్నం జరగడం రాజకీయంగా ఎవరికి లాభం? అన్న కోణంలో చర్చలు జరుగుతున్నాయి. కాల్పుల తరువాత ట్రంప్‌పై సానుభూతి పెరిగి రేటింగ్ లభిస్తుందని రిపబ్లికన్లు ఆశిస్తుండగా, ఇరాన్ విషయంలో ట్రంప్ అనుసరిస్తున్న తీరు ఆయనకే నష్టం కలిగిస్తుందని, ప్రజాభిప్రాయాన్ని అర్థం చేసుకోకుండా ట్రంప్ మరోసారి తప్పుడు నిర్ణయాలు తీసుకోవడమేమిటి? అన్న ప్రశ్న ఎదురవుతోంది. 1765 1783 మధ్య అమెరికా విప్లవ పోరాటంతో ప్రజాస్వామ్య దేశంగా అవతరించిన అమెరికా రక్తపాతంతో కూడిన అంతర్యుద్ధాన్ని చూసింది. రేవంత్-మహేష్ ద్వయం కాంగ్రెస్ భవితకు దిక్సూచి 1960లో సామాజిక సంఘర్షణలు సంభవించాయి. సామాజిక న్యాయం, ప్రాంతీయ గుర్తింపు, భూమికోసం పోరాటాలు జరిగాయి. ఇవి ఆయా సమయాల్లోని వ్యవస్థాగత లోపాలపై నిరసనగా వచ్చాయి. ఇప్పుడు ఆందోళనలు, సంఘర్షణలు రాజకీయ ప్రేరేపితం, తీవ్రమైన ధ్రువీకరణలతో సోషల్ మీడియా ప్రభావంతో హింసాత్మక సంఘటనలుగా మారుతున్నాయి. ఇప్పుడు రాజకీయ లక్షాలను సాధించడానికి హింసామార్గాన్ని అవలంబించడం సాధారణమవుతోంది. రిపబ్లికన్, డెమోక్రాట్ల మధ్య విభేదాలు తీవ్రస్థాయికి చేరాయి. 2016 నుంచి రాజకీయ నాయకులపై దాడులు, బెదిరింపులు, ద్వేష ప్రసంగాల విద్వేషాలు పెచ్చరిల్లాయి. 2025 26 మధ్యకాలంలో ట్రంప్ అనుకూల, వ్యతిరేక వర్గాల మధ్య ఘర్షణలు, ట్రంప్ సన్నిహితుడు, కరడుకట్టిన జాతీయవాది చార్లీకిర్క్ (31) తుపాకీ కాల్పులకు బలయ్యాడు. 2020 నాటి అధ్యక్ష ఎన్నికల్లో క్యాపిటల్ హిల్ అటాక్ తర్వాత రాజకీయ నాయకులను లక్షంగా చేసుకుని హింసాత్మక దాడులు సాగించడం బాగా పెరిగింది. ప్రస్తుతం ఎటువంటి అధికారిక సంస్థలతో సంబంధం లేని వ్యక్తులు ఇంటర్నెట్ ద్వారా తీవ్రవాదులుగా మారి హింసకు పాల్పడుతున్నారు. గతంలో రాజకీయ మార్పుల కోసం హింసాత్మక సంఘటనలు జరిగినా, ప్రస్తుతం తీవ్రమైన రాజకీయ విభజన, విద్వేషం కారణంగా దాడులు తీవ్రమవుతున్నాయి. ప్రస్తుతం రాజకీయ హింసకే ఆందోళనకర స్థాయిలో మద్దతు ఉన్నట్టు బయటపడుతోంది. ప్రతి పదిమంది అమెరికన్ ఓటర్లలో ఆరుగురు కేవలం భిన్నమైన రాజకీయ అభిప్రాయాలు కలిగి ఉన్నారనే కారణంతో కొంతమందిని ద్వేషిస్తున్నారు. పార్టీ పరంగా చూస్తే డెమోక్రాట్లలో 51 శాతం మంది, రిపబ్లికన్లలో 39 శాతం మంది రాజకీయ హింసకే మద్దతు పలకడం గమనార్హం. తమ రాజకీయ ప్రయోజనాలను సాధించుకోవడానికి హింస తప్ప వేరే మార్గం లేదన్న అభిప్రాయాన్ని వీరు వెలిబుచ్చారు. ట్రంప్ రెండోసారి పదవీ కాలంలో చార్లీ కిర్క్ హత్య వంటి సంఘటనలు జరుగుతాయని డెమోక్రాట్లలో 53 శాతం అభిప్రాయపడుతున్నారు. మరిన్ని కనుగొనండి జిల్లా వార్తలు వార్తల విశ్లేషణ లైవ్ అప్‌డేట్స్ ూశ్రీంశీ =ఝుఒ – పేరుతో పోరు మొదలెట్టి.. బాపూపైనే బాణాలు గురిపెట్టి! రాజకీయ వాతావరణం ప్రశాంతంగా, నాగరిక నాయకత్వంలో ఉండాలని కోరుకునే అత్యధికుల్లో ఒక చిన్నవర్గం నుండి వస్తున్న హింసాత్మక ప్రతిస్పందన ఆందోళన కలిగిస్తోంది. ఇజ్రాయెల్‌కు తలొగ్గి అనవసరంగా ఇరాన్‌పై యుద్ధానికి కాలుదువ్విన అధ్యక్షుడు ట్రంప్‌పై ఆయన మద్దతుదారుల్లోనే ఆగ్రహం రగిలిస్తోంది. కొంతమంది రిపబ్లికన్లు, ఇండిపెండెట్లు ట్రంప్‌కు దూరమయ్యారు. ట్రంప్ తన యుద్ధోన్మాదం వదులుకుంటేనే వారు తిరిగి ట్రంప్ గూటిలోకి చేరే అవకాశం ఉంటుంది. అలా జరిగితేనే తిరిగి అధ్యక్షునిగా ట్రంప్ అధికారం చేపట్టడానికి మార్గం సుగమం అవుతుంది. ట్రంప్ ఈ విషయంలో తన వైఖరి మార్చుకోకుంటే కాంగ్రెస్‌ను డెమోక్రాట్లు నియంత్రించ గలుగుతారు. రిపబ్లికన్లు నష్టపోతారు. రిపబ్లికన్లు ఈ అంచనాను నమ్మడం లేదు. డెమోక్రాటిక్ పార్టీ ట్రంప్‌పై ఇరాన్ యుద్ధ ముద్రవేసి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారని, ఈ కారణంగానే హత్యాయత్నానికి యువ వామపక్ష కార్యకర్త ఉగ్రవాదిలా మారాడని రిపబ్లికన్లు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు ప్రధాన స్రవంతి మీడియా కూడా ట్రంప్‌కు వ్యతిరేకంగానే ప్రచారం సాగిస్తోందని తప్పును పడుతున్నారు.

## అర్థరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం

### అతివేగంతో పాదచారులను ఢీకొన్న కారు

### ప్రమాదంలో నలుగురు వ్యక్తులు దుర్మరణం

విజయనగరం,ఏప్రిల్28 : పూసపాటిరేగ మండలం పేరాపురం వద్ద జాతీయ రహదారి 16పై సోమవారం అర్థరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో నలుగురు దుర్మరణం చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. శ్రీకాకుళం నుంచి విశాఖపట్నానికి వెళ్తున్న గుత్తేదారుల మిత్ర బృందం ప్రయాణిస్తున్న కారు మితిమీరిన వేగం వల్లే ఈ ప్రమాదం జరిగింది. రాత్రి 12 గంటల సమయంలో అతివేగంగా వచ్చిన కారు.. పేరాపురం వద్ద దుకాణంలో టీ తాగి రోడ్డుపై ఉన్న ఇద్దరు పాదచారులను ఢీకొట్టింది. అనంతరం వాహనాన్ని అదుపు చేయలేక సమీపంలో ఆగి ఉన్న లారీ వైపు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఒకరు.. పాదచారులిద్దరూ అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. కారు చోదకుడితో పాటు తీవ్రంగా గాయపడిన మరొకరిని విజయనగరంలోని మహారాజా ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా ఒకరు మార్గమధ్యలో మృతి చెందారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి బొబ్బిలి వాసిగా పోలీసులు గుర్తించారు. ప్రమాదంలో విశాఖకు చెందిన ఇరిగేషన్ కాంట్రాక్టరు శ్రీనివాస్ మృతి చెందినట్లు భావిస్తున్నారు. కారులో ప్రయాణిస్తున్న వారిలో అమరావతికి చెందిన ఓ న్యాయమూర్తి బంధువులు ఉన్నారని తెలిసింది. ఎస్పీ ఏఆర్ దామోదర్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. సీఐ రామకృష్ణ, ఎస్సై దుర్గాప్రసాద్‌తో కలిసి సహాయక చర్యలు చేపట్టారు.

## ఒకటో తేదీన జీతాలు రావడం లేదు

### ఎమ్మెల్యేకు అంగన్‌వాడీల స్పష్టీకరణ

మహబూబాబాద్,ఏప్రిల్28 : కాంగ్రెస్ ప్రజాపాలన అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతి నెలా ఒకటో తేదీన ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రూనాయక్ పేర్కొన్నారు. దీంతో అక్కడే ఉన్న అంగన్‌వాడీలు 'అయ్యో సార్ మాకు ఒకటో తేదీన జీతాలు రావడంలేదు' అని ముక్తకంఠంతో ఎమ్మెల్యే ప్రసంగానికి అడ్డుతగిలారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని రైతువేదికలో కల్యాణలక్ష్మి చెక్కులు, అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేశారు. రామచంద్రూనాయక్ మాట్లాడుతూ.. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనాలు ఇస్తున్నామని తెలిపారు. దీంతో అక్కడే ఉన్న అంగన్‌వాడీ కలుగజేసుకొని 'సార్ మాకు మాత్రం జీతాలు రావడం లేదు' అని ప్రసంగానికి అడ్డుతగిలారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టిలో జీతాలు పెంచాలనే అంశం ఉందని, త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని చెప్పగా.. 'సార్ మాకు పోయిన నెల జీతం రూ.13,650 ఇప్పటి వరకు రాలేదు' అని అంగన్‌వాడీలు గుసగుసలాడారు.

## ఇండోనేషియాలో రెండు రైళ్లు ఢీ

### 14మంది మహిళల దుర్మరణం


జకార్తాన్యూఢిల్లీ,ఏప్రిల్28(ఆర్ఎన్ఎ): ఇండోనేషియాలో రెండు రైళ్లు ఢీకొన్న ఘటనలో 14 మంది మృతిచెందగా, 84 మంది గాయపడ్డారు. దేశ రాజధాని జకార్తా శివారులో ఉన్న బెకాసి వద్ద ఈ ప్రమాదం జరిగింది. శిథిలాల కింద చిక్కుకున్న వారిని తొలగించే ప్రయత్నం జరుగుతుందని రైల్వే అధికారులు చెప్పారు. ఓ కమ్యూటర్ ట్రైన్‌తో పాటు లాంగ్ డిస్టాన్స్ రైలు సోమవారం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 14కు చేరుకున్నట్లు ఇండోనేషియా రైల్వే శాఖ అధికారులు తెలిపారు. గాలింపు ప్రక్రియ ముగిసినట్లు రెస్క్యూ ఏజెన్సీ అధికారులు తెలిపారు. రైల్వే బోగీలు నుజ్జు నుజ్జు అయ్యాయని, వాటిల్లో చిక్కుకున్న వారిని తొలగించడం పెద్ద సమస్యగా మారిందన్నారు. రైలుకు చెందిన మహిళా బోగీ దెబ్బతిన్నదని, బాధితుల్లో అందరూ మహిళలే ఉన్నట్లు అధికారులు తెలిపారు. బోగీల్లో చిక్కుకున్న ప్రయాణికులను బయటకు తీసేందుకు ఇనుపకడ్డీలను గ్రైండర్లతో కట్ చేశారు. స్థానికంగా తిరిగే లోకల్ కమ్యూటర్ రైలు తొలుత ఓ ట్యాక్సీ ఢీకొన్నదని, ఆ తర్వాత అది మళ్లీ దూరం వెళ్లే మరో రైలును ఢీకొన్నట్లు బాబీ తెలిపారు.

## డ్రగ్స్ కేసులో రోహిత్ రెడ్డికి బెయిల్

### నేడు జైలు నుంచి విడుదల అయ్యే ఛాన్స్

హైదరాబాద్,ఏప్రిల్28 : మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసులో తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో గత మార్చి 14న రాత్రి రోహిత్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో మొత్తం ముగ్గురిని అరెస్ట్ చేసి జైలుకు పంపారు పోలీసులు. వారిలో పైలట్ రోహిత్ రెడ్డి, ఆయన సోదరుడు రితేష్ రెడ్డి, వ్యాపారవేత్త నమిత్ శర్మ ఉన్నారు. రోహిత్ రెడ్డి తరపున మాత్రమే న్యాయవాదులు హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. బెయిల్ మంజూరు కావడంతో బుధవారం చంచల్‌గూడ జైలు నుంచి రోహిత్ రెడ్డి విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మార్చి 14న మొయినాబాద్ ఫాంహౌస్‌లో దాడులు చేసిన పోలీసులు.. కొకైన్, లిక్కర్ బాటిళ్లు, స్వాధీనం చేసుకున్నారు. పార్టీలో పాల్గొన్న 11 మందికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా.. వారిలో ఆరుగురికి డ్రగ్స్ పాజిటివ్‌గా తేలింది.

## దిశశ్చ నారాయణః



ఆధ్యాత్మికం

తిరుమల : దిక్కులకు మనం తూర్పు, పశ్చిమం అని ఇలా దిక్కులు పెట్టుకున్నాం. మనకు కనిపించిన వాటిలో సూర్యుడు ఎప్పటికీ ఉండువాడు కనక ఆ సూర్యుడు ఎక్కడ కనపడితే అది తూర్పు అని ఇలా దిక్కులు ఏర్పాటుచేసుకున్నాం. ఆ దిక్కులను బట్టి ప్రతి దిక్కులు ఆగ్నేయం, ఈశాన్యం అని ఇలా పెట్టుకున్నాం. మరి ఈ అనంతమైన విశ్వంలో సూర్యుడి కంటే పెద్ద నక్షత్రాలు ఎన్నో ఉన్నాయి. ఒక వేల మనం సౌరమండలాన్ని దాటి బయటికి వెళ్తే మనం దిక్కులు ఎట్లా చెప్పగలం ? దిక్కులనేవి ఒకేలా ఉండవు. అందుకే మన పూర్వులు చాలా అందంగా చెబుతారు. ఇప్పుడు మనం చూసే తిరుమలని ఉత్తర తిరుమల అని అంటారు. మరి దక్షిణ తిరుమల అని కూడా ఒకటి ఉంది. ఆండాళ్ తల్లి తను వెయ్యి గంగాలాల్లో పాయసం పెడతానని మొక్కుబడి చేసింది, ఆయన పేరు సుందరభాహు స్వామి. ఆ ఉందరభాహు స్వామి ఉండే ప్రదేశాన్ని దక్షిణ తిరుమల అని అంటారు. ఉత్తర దక్షిణాలు ఎవరిని బట్టి నిర్ణయం చేసారు అంటే, ఈ సూర్యుడిని బట్టి చేయలేదు. భగవంతుడిని బట్టి నిర్ణయం చేసారు. ఈ భూమిపై మొదటగా కనిపించిన భగవంతుడు 'శ్రీరంగ నాథుడు', ఆయనను బట్టి చెప్పారు. మొదట శ్రీరామ చంద్రుడి ఇలవేల్పు అతడు. తరువాత ఉభయ కావేరీ మధ్యన చేరి ఉన్నాడు. సూర్యుడికి కూడా కాంతినిచ్చేవాడు ఆ భగవంతుడే కదా. భగవద్గీతలో భగవంతుడు ఇదే చెప్పాడు. ఉపనిషత్ కూడా ఈ విషయమే చెబుతుంది. నతత్ర సూర్యో భాతి నచంద్ర తారకంనేమా విద్యుతో భాతి కుతోయమగ్నిఃతమేవ భాంతమనుభాసితర్వం తస్య భాస సర్వమిదం విభాసి ఈ కాంతి నిచ్చే గోళాలు ఏవీ సహజంగా కాంతి నివ్వడంలేదు. వెనకాతల ఆయన లేకుంటే ఆ కనిపించే సూర్య గోళం కూడా మూలన పడి ఉండాల్సిందే. అందుకే మనకు శ్రీరంగనాథుడు ఎక్కడ ఉంటే సూర్యుడు ఉన్నట్టు లెక్క. దాన్ని బట్టి దిక్కులు. శ్రీరంగం మధ్యలో ఉంది ఇటు వెంకటేశుడు ఉన్నాడు, అటు సుందరబాహు స్వామి ఉన్నాడు. అందుకే వెంకటేశుడు ఉన్న ప్రాంతాన్ని ఉత్తర తిరుపతి అని, సుందరబాహు స్వామి ఉన్న ప్రదేశాన్ని దక్షిణ తిరుపతి అని అంటారు

# గింజ కటింగ్ లేకుండా వరి ధాన్యం కొనుగోలు

- రైతు సమస్యలపై రాజీ పడే ప్రసక్తి లేదు...
- ప్రతి గింజ కొనుగోలు చేస్తాం...
- కొనుగోలు జరిపిన వెంటనే ఖాతాలోకి డబ్బులు జమ...
- నియోజకవర్గంలోని పలు గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ప్రభుత్వ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు







**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** అన్నదాతలు ఆరుగాలం కష్టపడి పండించిన పరిధాన్యం గింజ కటింగ్ లేకుండా కొనుగోలు చేస్తామని అన్నదాతలు అధైర్య పడవద్దని చివరి గింజ వరకు మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తామని ప్రభుత్వ విప్ స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. పెద్దపల్లి మండలంలోని బ్రాహ్మణపల్లి, రాగినేడు, కూరమపల్లి, అందుగులపల్లి, దేవునిపల్లి, రంగాపూర్, గౌరెడ్డిపేట, ముత్తారం, హన్మంతునిపేట, చీకురాయి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు సెంటర్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుల నుండి కటింగుల పేరిట కొనుగోలు సెంటర్లలో ధాన్యం నిలువు దోపిడి చేశారని అన్నారు. ఆరుగాలం కష్టపడి రక్తాన్ని చెమటగా మార్చి రైతులు పండించిన పంటలను కటింగుల పేరిట బిఆర్ఎస్ పెద్దలు దోచుకు తిన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సమస్యల విషయంలో తాను ఏనాడు రాజీ పడేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో రైతులకు కూడా సంపూర్ణ మైన నమ్మకం విశ్వాసం తనపై ఉందన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలోని ప్రతి ఒక్క రైతు కూడా తనను రైతుబిడ్డగా చూడటం సంతోషంగా ఉందన్నారు. రైతుల విశ్వాసం పూర్తిగా చూరగొనడం తన అదృష్టమన్నారు. అయితే రైతు సమస్యలను పరిష్కరించడంలో తన కష్టాన్ని కూడా గుర్తించాలని ఆయన ప్రజలను కోరారు. కొనుగోళ్ల విషయంలో రైస్ మిల్లర్ నుండి ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని కోరారు. సన్న వడ్లకు బోనస్ అందించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అలాగే, రైతు భరోసా విషయంలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని ఆయన కోరారు. విడతల వారిగా రైతు భరోసా ను ప్రభుత్వం విడుదల చేస్తోందని చెప్పారు. అలాగే సెంటర్లలో కొనుగోలు పూర్తయిన వెంటనే ఒకటి రెండు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ విషయంలో గతంలో పోలిస్తే బిఆర్ఎస్ హయాంలో రోజుల తరబడి డబ్బుల కోసం రైతులు పడిగాపులు కాశారని అన్నారు. రైతులు తరచూ వరి పంట కాకుండా పంటల మార్పిడి పై శ్రద్ధ చూపాలని కోరారు. సేంద్రియ ఎరువులను వాడితే భూసారం పెరుగుతుందన్నారు. పెద్దపల్లి నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి అలుపెరుగని కృషి చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఇంటింటికి ఇసుకను సులభతరం చేసిన ఘనత కూడా తమదేనన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేందుకు అహోరాత్రులు కష్టపడుతున్నట్టు తెలిపారు. అంతకుముందు పెద్దపల్లి మండలం,రంగాపూర్ గ్రామంలో సర్పంచ్ గంట రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో 30 మంది అర్హులైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమం లో ఎంపీడీఓ, సింగల్ విండో అధికారులు, మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ కూర మల్ల రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్లు, ఉప సర్పంచ్లు, వార్డు సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

# ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 33 శాతం మహిళా రిజర్వేషన్ కోసం విద్యార్థినుల సంతకాల సేకరణ



**కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 28(ది క్రైమ్ న్యూస్):** చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద ఆదేశాల మేరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వివిధ కళాశాలల్లో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కాలేజీల విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని తమ మద్దతును తెలియజేశారు. మహిళలకు రాజకీయ రంగంలో సమాన అవకాశాలు లభించినప్పుడే నిజమైన మహిళా సాధికారత సాధ్యమవుతుందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. దేశ జనాభాలో సగభాగంగా ఉన్న మహిళలకు చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని డిమాండ్ చేశారు. నేరెళ్ల శారద చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి మహిళల భద్రత మరియు హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్నారని, అందులో భాగంగానే ఈ అవగాహన, సంతకాల సేకరణ చేపట్టినట్లు తెలిపారు. నేరెళ్ల శారద మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా కళాశాలల్లో విద్యార్థినుల భద్రతపై కూడా ప్రత్యేక దృష్టి సారించి, తరచుగా తనిఖీలు నిర్వహిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు.

# మున్సిపల్ ఉద్యోగులపై జరిగిన అసాంఘిక చర్యపై తీవ్ర నిరసన

- నిందితుల పై తగిన చర్యలు తీసుకోవాలి ఉద్యోగుల జేఏసీ డిమాండ్



**కరీంనగర్ టౌన్, ఏప్రిల్28(ది క్రైమ్ న్యూస్):** మంగళవారం రోజున మున్సిపల్ ఉద్యోగులపై చేసిన అసాంఘిక చర్యను నిరసిస్తూ, ఈరోజు ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు దారం శ్రీనివాస్ రెడ్డి, మడిపెల్లి కాళీ చరణ్ మాట్లాడుతూ విధుల్లో ఉన్న ఉద్యోగులపై దుర్భాషలాడుతూ, అసభ్య పదజాలంతో అవమానకరంగా ప్రవర్తించడం ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటని మండిపడ్డారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయాలని ఒత్తిడి తేవడమే కాకుండా, అడ్డుకున్నందుకు దౌర్జన్యానికి దిగడం అన్యాయమని పేర్కొన్నారు. "ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించిన నిందితుల పై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. బాధితులకు న్యాయం జరగకుంటే, భవిష్యత్తులో ఈ నిరసనను మరింత ఉధృతం చేస్తాం మున్సిపల్ సేవలన్నింటినీ నిలిపివేసి నిరవధిక సమ్మెకు దిగుతాం" అని జేఏసీ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు, జేఏసీ సభ్యులు వివిధ విభాగాల సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

# బాలల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- ప్రతి బాలుడికి నాణ్యమైన విద్య, సముచిత పోషకాహారం హక్కు
- చిన్న పిల్లల హక్కుల భంగన సమస్య వస్తే వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలి
- విద్యా నాణ్యత పెంపుతో పాటు పిల్లల ఆరోగ్యం, పోషణపై ప్రత్యేక దృష్టి
- సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల సంరక్షణ పై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** బాలల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ బాలల సంరక్షణలో ప్రతి ఒక్కరి బాధ్యత ఉందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న మిషన్ వాత్సలయ్, అంగన్వాడీ సేవలు, ప్రీ-ప్రైమరీ విద్య, బాలల సదనాల ద్వారా పిల్లల సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి బాలుడికి నాణ్యమైన విద్య, సముచిత పోషకాహారం, సురక్షిత వాతావరణం పొందే హక్కు ఉందని స్పష్టం చేశారు. ఏ చిన్నారికి అయినా సమస్యలు ఎదురైతే వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. పెద్దపల్లి జిల్లాలో విద్యా రంగంలో మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు నాణ్యత పెంపుపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల చదివే సామర్థ్యం (రా=ఖీ), పఠన అవగాహన (=జ) వంటి సూచికల్లో గణనీయమైన మెరుగుదల నమోదైందన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నపిల్లలకు సమతుల్య పోషకాహారం అందిస్తూ, వారి ఎదుగుదలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. ఆర్.బీ.ఎస్.కే కార్యక్రమం ద్వారా పిల్లలకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ, ఏ ఆరోగ్య సమస్య ఉన్నా తక్షణ చికిత్స అందిస్తున్నామని, అవసరమైతే శస్త్రచికిత్సలను కూడా ఉచితంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం బాల్యవివాహాల రహిత గ్రామంగా ఎంపికైన పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామ సర్పంచ్ కు జిల్లా కలెక్టర్ సర్టిఫికెట్‌ను అందజేశారు. బాల్యవివాహాల నిర్మూలనలో గ్రామ ప్రజలు చూపిన చైతన్యం అభినందనీయమని కలెక్టర్ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి వేణుగోపాల్ రావు,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని రంగంపల్లి జిల్లా కోర్టు దారి రాజీవ్ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం చెందాడు. వివరాల్లోకి వెళితే కుమ్మరి కుంట గ్రామానికి చెందిన ఆవునరి బాపయ్య తండ్రి/ రామయ్య వయసు 33 సంవత్సరాలు కుమ్మరి కులానికి చెందిన మేస్త్రీ తన ద్విచక్ర వాహనంపై కుమ్మరి కుంట నుండి రంగంపల్లికి వచ్చి అక్కడి నుండి పెద్దపల్లి వైపు వెళ్తుండగా ఉదయం 6:30గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టగా బాపయ్య తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందినట్లు పెద్దపల్లి పోలీసులు తెలిపారు. కాగా మృతునికి భార్య కొడుకు కూతురు ఉన్నారని భార్య ఆవునూరి రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పెద్దపల్లి ఎస్సై పేర్కొన్నారు.

# పెట్రోలు బంక్‌లలో 'నో స్టాక్' బోర్డులు పెట్టొద్దు

- కేంద్ర ప్రభుత్వ కుట్రలను ఎండగట్టాలి



**నల్గొండ జిల్లా ప్రతినిధి: ఏప్రిల్ 28 (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత కారణంగా బంక్‌ల వద్ద 'నో స్టాక్' బోర్డులు కనిపించడం వల్ల ప్రజలు, రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొండేటి శ్రీను ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం నిడమనూరు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ఆయిల్ కంపెనీలు కేవలం లాభాపేక్షతోనే కృత్రిమ కొరతను సృష్టిస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని, చమురు సంస్థల ద్వారా అన్ని పెట్రోల్ బంక్‌లకు సరఫరా పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఒకవైపు దేశంలో ఇంధన నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని చెబుతూ, మరోవైపు కృత్రిమ కొరత సృష్టించడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. ఇరాన్--ఇజ్రాయిల్ యుద్ధ పరిస్థితులను చూపిస్తూ ఆయిల్ సంక్షోభాన్ని ఎదుర్కొనడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, ఎన్నికల నేపథ్యంలో ధరలను తాత్కాలికంగా నియంత్రించి, ఎన్నికల అనంతరం భారాన్ని ప్రజలపై మోపే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. రష్యా నుంచి తక్కువ ధరకు ముడి చమురు దిగుమతి చేసుకున్నప్పటికీ, ఆ లాభాలను ప్రజలకు అందించడం లేదని అన్నారు. పెట్రోల్ బంక్ డీలర్లు భారీ మొత్తంలో డిపాజిట్లు చెల్లించినప్పటికీ, ఆయిల్ ట్యాంకర్ల సరఫరా జరగకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. డీజిల్ లభ్యం కాక లారీలు, ఇతర వాహనాలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడుతోందని, దీనివల్ల నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి పేద, మధ్యతరగతి ప్రజలపై భారం పడుతుందని తెలిపారు. కొన్ని చోట్ల పెట్రోల్, డీజిల్‌ను బ్లాక్ మార్కెట్‌లో లీటర్‌కు ?50 నుంచి ?100 వరకు అధిక ధరలకు విక్రయిస్తున్నారని, దీనిపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కందుకూరు కోటేష్, మండల కమిటీ సభ్యులు కోమాండ్ల గురువయ్య, మల్లీకంటి చంద్రశేఖర్, వెంపటి మహేష్, బొడ్డు లింగయ్య, కోమాండ్ల ఆంజనేయులు, వింజమూరి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# యువతలో భద్రతపై అవగాహన పెంపొందించడమే లక్ష్యం

- ఏ.హెచ్.టీ.యూ ఎస్.ఐ శైలజ
- విద్యాసంస్థల్లో షీ టీమ్స్, సైబర్ నేరాలపై అవగాహన





**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** యువతలో భద్రతపై అవగాహన పెంపొందిం చడమే లక్ష్యమని ఏ.హెచ్.టీ.యూ ఎస్.ఐ శైలజ అన్నారు. మంగళవారం రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు రామగుండం కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏహెచ్‌టీయూ ఎస్.ఐ శైలజ ఆధ్వర్యంలో నాలుగు విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. సెంట్ క్లేర్స్ హై స్కూల్ ఎన్‌టీపీసీ, శ్రీ చైతన్య డిగ్రీ కాలేజ్ గోదావరిఖని, కస్తూర్బా గాంధీ బాలికల ఉన్నత పాఠశాల నస్పూర్, ఏకలవ్య ఆశ్రమం మంచిర్యాలలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఎస్.ఐ శైలజ విద్యార్థులకు లింగ సమానత్వం, బాల్య వివాహాల నిర్మూలన, పిల్లల భద్రత, పితృస్వామ్య భావజాలం, మహిళలపై ద్వేషం, లింగ వివక్ష, జెండర్ బైయాస్, హింస, సైబర్ నేరాలు, సైబర్ బులీయింగ్ వంటి ముఖ్య అంశాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. షీ టీమ్స్ కార్యకలాపాలు, మహిళలు మరియు పిల్లలు ఎదుర్కొనే సమస్యలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించాల్సిన హెల్ప్‌లైన్ నంబర్లు డయల్ 100, 112, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి సమాజంలో బాధ్యతగల పౌరులుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమాల ద్వారా యువతకు భద్రతపై పూర్తిస్థాయి అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలపై ప్రభుత్వం నిర్లక్ష్యం

- హమాలీ కూలీ ప్రభుత్వమే చెల్లించాలి
- బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి సదానందం



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో తెలంగాణా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తోందని భారతీయ జనతా పార్టీ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం ఆరోపించారు. ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, కొనుగోలు కేంద్రాల్లో వసతులను కల్పించాలని కోరుతూ మంగళవారం జిల్లా కలెక్టరు కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ, చివరి గింజ వరకు వరి, మొక్కజొన్న పంటను ప్రభుత్వమే కొనుగోలు చేసి, వెంటనే నగదును ఖాతాల్లో జమ చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తగిన సౌకర్యాలు కల్పించాలని, టార్పాలిన్ కవరులను సమకూర్చాలని, హమాలీ చార్జీలను ప్రభుత్వమే చెల్లించాలన్నారు. సిఎంఆర్ చెల్లించని రైసుమిల్లులకు ధాన్యం విక్రయించవద్దని, డీఫాల్టర్లపై చర్యలు తీసుకోవాలాని, తూనికల యంత్రాలను సంబంధిత అధికారులు సమీక్షించాలని కలెక్టరును కోరినట్లు తెలిపారు. వినతిపత్రం సమర్పించిన వారిలో నాయకులు శిలివేరు ఓదెలు, భూషణవేని శ్రీనివాస్, మోర మనోహర్, జెట్టి రాజు, కలవేణ స్వామి తదితరులు ఉన్నారు.

# క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

● పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ● ఆశ్రమ విద్యార్థులకు క్రీడా సామగ్రి, స్టేషనరీ పంపిణీ





**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. మంగళవారం రామగుండంలోని తబితా ఆశ్రమంలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్.ఐ. సంధ్యరాణి ఆధ్వర్యంలో నిర్వహించిన చైల్డ్ సేఫ్టీ-డ్రగ్స్‌కు నో చెప్పండి అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీ అంబర్ కిషోర్ ఝా, పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పిల్లల భద్రతకు సంబంధించిన ముఖ్యమైన అంశాలను వివరించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, మానసిక ప్రభావాలు మరియు భవిష్యత్ జీవనశైలిపై వాటి దుష్ప్రభావాల గురించి అవగాహన కల్పించారు. యువత డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండి, క్రమశిక్షణతో శ్రద్ధగా చదువుకోవాలని, మంచి అలవాట్లు అలవరచుకుని ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని పాటించాలని సూచించారు. విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధిని ప్రోత్సహించే ఉద్దేశంతో ఆశ్రమంలోని పిల్లలకు క్రీడా సామగ్రి మరియు స్టేషనరీ వస్తువులను పంపిణీ చేశారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలలో కూడా రాణించి, మంచి భవిష్యత్తు కోసం కృషి చేయాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీపీసీ ఎస్.ఐ. ఉదయ్ కిరణ్, పోలీస్ సిబ్బంది, ఆశ్రమం నిర్వాహకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ ఇన్చార్జి వెలిచాల రాజేందర్రావుకు పూర్తిస్థాయిలో బాధ్యతలు అప్పగించాలి

● టీపిసిసి ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డికి కార్పొరేటర్లు కాంటెస్టరు కార్పొరేటర్లు సర్పంచులు ముఖ్య నేతల వినతి



**కరీంనగర్ టౌన్, ఏప్రిల్28(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావుకు అధిష్టానం పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించాలని కోరుతూ టిపిసిసి ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు కంటెస్టెడ్ అభ్యర్థులు సర్పంచులు, పలువురు కాంగ్రెస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. మంగళవారం కరీంనగర్ డిసిసి కార్యాలయంలో జరిగిన కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రత్యేక సమావేశంలో ఈ మేరకు వారు చంద్రశేఖర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు కాంటెస్టెడ్ కార్పొరేటర్లు సర్పంచులు కాంగ్రెస్ ముఖ్య నేతలు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతము పటిష్టత కోసం అన్ని రకాలుగా పూర్తి బాధ్యతలు రాజేందర్రావుకు అప్పగించాలని కోరారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అధిష్టానం పెద్దల దృష్టికి తీసుకెళ్లాలని వారు కోరారు. ఇతర నేతల జోక్యం లేకుండా రాజేందర్రావుకు ఫ్రీ హ్యాండ్ ఇవ్వాలని తద్వారా పూర్తిస్థాయిలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్ల గలుగుతారని పేర్కొన్నారు. దీంతోపాటు నేతలు అందర్నీ సమన్వయం చేసుకుంటూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీని మరింత పటిష్టం చేస్తారని వారు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డికి వివరించారు. ఈ మేరకు ఆయన సానుకూలంగా స్పందించి విషయాన్ని ముఖ్యమంత్రి పిసిసి అధ్యక్షుడు అధిష్టానం పెద్దల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్పొరేటర్లు ఆకుల నర్మదా నర్సన్న, ఆకుల నందిని ఉదయ్, గుమ్మడి రాజకుమార్, కాంతాల జగన్ రెడ్డి, భాస్కర్ నాయక్ గంట శ్రీనివాస్ కల్లేపల్లి శారద బాలరాజు, పడాల శ్రీజ అజయ్, పడిశెట్టి వసంతలక్ష్మి భూమయ్య పర్వతాల మల్లేశం, వరాల నరసింగం ఇక్రమ్ సికిందర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రామ్ రెడ్డి, కంటెస్టెంట్ అభ్యర్థులు దుగ్గు మహేందర్ వేముల శ్రీనివాసు రేగొండ సందీప్ తిప్పారపు శ్రీనివాస్ కర్రె పావని జల్లోజు శ్రీనివాస్ సర్పంచులు మోతే ప్రశాంత్ రెడ్డి గుర్రం తిరుపతిరెడ్డి కూర నరేష్ రెడ్డి సుద్దాల కమల్ గౌడ్ లక్ష్మీనారాయణ భాష వేణి, మల్లేశం నిమ్మల అంజన్న తప్పట్ల రాజు, మైనార్టీ నాయకులు మజీద్, కరీం, వజీరు కాంగ్రెస్ నాయకులు జగ్గని కనకయ్య గసికంటి కుమారు బోనాల అశోక్ పంజాల కృపా సాగర్ మీసా రమాధవి, లక్ష్మీనారాయణ, వేల్పుల వెంకటేష్, పోరండ్ల రమేష్ గండి రాజేశ్వర్ గండి శ్యాము కాసారపు కిరణ్ కుమార్ గండి గణేష్ తో పాటు పలువురు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల వినియోగం భవిష్యత్తుకు ప్రమాదకరం

● డ్రగ్స్ అరికట్టేందుకు విద్యార్థులు బాధ్యతగా వ్యవహరించాలి: ఎస్.ఐ. అనూష



**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** మాదకద్రవ్యాల వినియోగం భవిష్యత్తుకు ప్రమాదకరమని ఎస్.ఐ. అనూష అన్నారు. మంగళవారం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు, గోదావరిఖని 1 టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనా రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలుర విద్యార్థుల కోసం ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగమైన 99 రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఐ. అనూష మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ప్రమాదాలు, ఆరోగ్యంపై వాటి దుష్ప్రభావాలు మరియు భవిష్యత్ జీవనశైలిపై వాటి ప్రభావం గురించి వివరంగా తెలియజేశారు. యువతలో పెరుగుతున్న డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు ప్రతి విద్యార్థి బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. మాదకద్రవ్యాలు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీసే ప్రమాదకరమైనవని, విద్యా జీవితం మరియు భవిష్యత్ లక్ష్యాలను నాశనం చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, మంచి స్నేహితులను ఎంచుకోవడం, సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచుకోవాలని సూచించారు. అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినప్పుడు వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. మహిళల భద్రత, బాలల రక్షణ, లింగ సమానత్వం, పితృస్వామ్యం, జెండర్ బైయాస్, సైబర్ నేరాల నివారణ, బాల్య వివాహాల నిర్మూలన మరియు భరోసా సెంటర్ అందిస్తున్న సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యా జీవితం మరియు భవిష్యత్ లక్ష్యాలను నాశనం చేసే మాదకద్రవ్యాలకు యువత బానిస కాకూడదని ఎస్.ఐ. అనూష పిలుపునిచ్చారు.

## కనడమెందుకు...వదిలించుకోవడమెందుకు...?

# కన్నోళ్ళు కాదు వాళ్ళు... కర్కశకులు...!



**తిమ్మాపూర్, ఎప్రిల్28(ది క్రైం న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్లో గొడవల కారణంగా భార్యా భర్తలిద్దరూ తమ పిల్లలను వదిలివెళ్ళిన అమానుష ఘటన చోటు చేసుకుంది.మండలంలోని అలుగునూరు చేపలకాలనికి చెందిన రవి, నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం పెర్కిట్ కు చెందిన లలిత అనే ఇద్దరు గత పన్నెండేళ్ళ క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీళ్ళకు ఇద్దరు కూతుళ్లు ఉండి రవి ఎలక్ట్రిషియన్ పనిచేస్తూ లలిత నర్సుగా పనిచేస్తుండగా గత కొంత కాలం నుండి లలిత చరవాణిలో అధికంగా సంభాషిస్తూ ఇష్టంవచ్చినట్టు ప్రవర్తిస్తుండటంతో ఇద్దరి మధ్య మనస్పర్ధలేర్పడి గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గతంలో రవిపై మహిళా పోలీస్ స్టేషన్లో లలిత వేదింపుల కేసు పెట్టగా చాలా సార్లు పంచాయతీలు కూడా జరగడంతో ఇద్దరు పిల్లలతో లలిత వేరుగా ఉంటుంది. ఈ క్రమంలో సోమవారం రవిపై ఎల్ఎండి పోలీస్ స్టేషన్లో మళ్ళీ కేసు పెట్టిన లలిత ఈసారి తన మెడలోని తాళి, మట్టెలతో పాటు ఇద్దరు పిల్లలను పోలీస్ స్టేషన్లో వదిలి వెళ్ళిపోయింది. భార్యే తనను వద్దని వెళ్ళిపోతే ఆ పిల్లలు తనకెందుకంటూ రవి కూడా వదిలి వెళ్ళిపోయాడు. పిల్లలిద్దరూ అమ్మా, నాన్న కోసం ఏడుస్తుండడంతో అక్కడున్నవాళ్ళు సైతం చలించిపోయారు. దీంతో పోలీసులు భార్యాభర్తలను పిలిచి వాళ్ళ మధ్య సయోధ్య కుదిర్చేందుకు ప్రయత్నించినా వినకపోవడంతో పోలీసులు పిల్లలిద్దరినీ వాళ్ళ నాన్నమ్మకు అప్పజెప్పారు. ఐతే తమకే పనులు సరిగా దొరకక పూటగడవని పరిస్థితి ఉందని జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని తల్లిదండ్రుల ద్వారా పిల్లలిద్దరి జీవితాలకు న్యాయం చేయాల్సిందిగా పిల్లల నానమ్మ కోరుతుంది.

# మౌనిక మృతి పట్ల దిగ్భ్రాంతి కుటుంబానికి అండగా నిలిచిన హెల్పింగ్ హాండ్స్



**మంథని, ఏప్రిల్ 28 (ది క్రైమ్ న్యూస్):** కమాన్‌పూర్ మండల కేంద్రంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన జంగపల్లి లక్ష్మి--ఆశాలు చిన్న కుమార్తె జంగపల్లి మౌనిక (18) హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందడం స్థానికంగా విషాదాన్ని నెలకొల్పింది. యువతీ అకాల మరణం గ్రామ ప్రజలను తీవ్రంగా కలిచివేసింది. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు హెల్పింగ్ హాండ్స్ సంస్థ ముందుకు వచ్చి మానవతా సేవను చాటింది. సంస్థ అధ్యక్షుడు నారగోని సతీష్ నేతృత్వంలో సభ్యులు రూ.1,01,100 ఆర్థిక సహాయాన్ని సేకరించి, మాజీ ఎంపీపీ మల్యాల రాంచంద్రం గౌడ్, సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, కమాన్‌పూర్ ఎస్ఐ కొట్టే ప్రసాద్ సమక్షంలో కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మల్యాల రాంచంద్రం గౌడ్ మాట్లాడుతూ, ఆపదలో ఉన్నవారికి తోడుగా నిలిచి, వైద్య సహాయం అవసరమైన వారికి అండగా నిలుస్తూ సమాజంలో మానవతా విలువలను పెంపొందించే దిశగా కృషి చేస్తున్న హెల్పింగ్ హాండ్స్ సేవలు ప్రశంసనీయం అని పేర్కొన్నారు. సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ, ఇలాంటి క్లిష్ట సమయంలో కుటుంబానికి అండగా నిలవడం సమాజ బాధ్యత అని పేర్కొన్నారు. హెల్పింగ్ హాండ్స్ చేసిన ఈ సహాయం ఇతరులకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు. అలాగే ఎస్ఐ కొట్టే ప్రసాద్ మాట్లాడుతూ, మానవతా దృక్పథంతో సేవా కార్యక్రమాలు నిర్వహించడం సమాజానికి ఎంతో అవసరమని, ఇలాంటి సేవా సంస్థలు మరింత ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మల్యాల విజయ్ గౌడ్, మహమ్మద్ జావీద్, దయ్యాల రాజు, గరిగంటి విష్ణు, నల్లవెల్లి ఈశ్వర్, సయ్యద్ నజీబ్, జంగపెల్లి సది, అజయ్, అనిల్, యశ్వంత్, రాకేష్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మౌనిక కుటుంబానికి సహాయం చేసిన హెల్పింగ్ హాండ్స్ సభ్యులకు అధ్యక్షులు నారగోని సతీష్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

# జిల్లా నోడల్ ఆఫీసర్‌గా తుల శోభారాణి నియామకం



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ యూనివర్సిటీ వారితో సమన్వయం చేయడానికి పెద్దపల్లి జిల్లా నోడల్ ఆఫీసర్ గా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అంతర్గాం లో ఫిజికల్ డైరెక్టర్ గా పని చేస్తున్న తుల శోభారాణి ని జిల్లా కలెక్టర్ ఆమోదంతో జిల్లా విద్యాధికారి శారద నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వారితో సమన్వయం చేస్తూ జిల్లాలో క్రీడల అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా శోభారాణి తెలిపారు. నోడల్ ఆఫీసర్ గా నియామకం చేసినందుకుగాను జిల్లా కలెక్టర్ మరియు విద్యాధికారి గార్లకు కృతజ్ఞతలు తెలియజేశారు. శోభారాణి ఎంపిక పట్ల పెద్దపెల్లి జిల్లా యువజన క్రీడల అధికారి అక్కపాక సురేష్,జిల్లా ఎస్ జి ఎఫ్ కార్యదర్శి కనుకుంట్ల లక్ష్మణ్, పెద్దపల్లి జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘ అధ్యక్ష కార్యదర్శులు వేల్పుల సురేందర్ దాసరి రమేష్ లు సీనియర్ ఫిజికల్ డైరెక్టర్లు కే శ్రీనివాస్ విజయ్ శైలజ మాధవి మాధురి తదితరులు అభినందనలు తెలియజేశారు.

# సేవా భావంతో ముందుకు సాగాలి: జగదీశ్వర్ గౌడ్



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** సేవాదళ్ అనేది కేవలం ఒక సంస్థ మాత్రమే కాదని, క్రమశిక్షణ, సేవా భావం, త్యాగం అనే మూడు స్తంభాలపై నిలిచిన శక్తి అని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీ నుంచి మే 2వ తేదీ వరకు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న సమర్థ శిక్షణ శిబిరంలో రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అధికారానికి మాత్రమే పరిమితం కాలేదని, ప్రజల హక్కుల కోసం, స్వాతంత్ర్య సమరంలోనూ, సామాజిక న్యాయం సాధనలోనూ ముందుండి పోరాడిన పార్టీ అని అన్నారు. అలాంటి గొప్ప సిద్ధాంతాలను నమ్మి సేవాదళ్ ఎప్పుడూ ప్రజల కోసం ముందుండి పనిచేస్తుందని పేర్కొన్నారు. "కాంగ్రెస్ అంటే సేవ... సేవ అంటే ప్రజల గెలుపు" అని పేర్కొంటూ, ప్రజల పక్షాన పోరాటమే సేవాదళ్ ధర్మమని అన్నారు. సమాజానికి సేవ చేయాలనే సంకల్పంతో, దేశ నిర్మాణంలో యువత పాత్రను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ప్రతి కార్యకర్తను సిద్ధం చేసే దిశగా ఈ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ శిబిరంలో పాల్గొనే ప్రతి సేవాదళ్ సభ్యుడు నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేసుకుంటూ, ప్రజల సమస్యలను అర్థం చేసుకునే దిశగా ముందుకు సాగుతారని చెప్పారు. క్రమశిక్షణ, సేవా భావం, ఐక్యత వంటి విలువలను అలవర్చుకుంటారని తెలిపారు. రాబోయే కాలంలో నాయకులను తీర్చిదిద్దే వేదికగా ఈ శిక్షణ శిబిరం నిలుస్తుందని, సేవాదళ్ స్ఫూర్తితో ప్రజల కోసం పోరాడే శక్తిని ఇక్కడి నుంచి అందిపుచ్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం నాయకులు విజయభాస్కర్ రెడ్డి, సౌందర్య రాజన్, యలమంచి ఉదయ్ కిరణ్, సేవాదళ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నాగలింగేశ్వర స్వామి దేవస్థానం వార్షికోత్సవ వేడుకలు



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని దత్తాత్రేయ కాలనీలో గల శ్రీ నాగలింగేశ్వర స్వామి దేవస్థానంలో 8వ (అష్టమ) వార్షికోత్సవం వేడుకలు మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ హాజరై తాజా మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్ లతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ ఈ పవిత్రమైన నాగలింగేశ్వర స్వామి దేవస్థాన వార్షికోత్సవంలో పాల్గొనడం నాకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందించడంతో పాటు యువతలో మంచి విలువలను నూరిపోస్తాయని అన్నారు. దేవస్థానం అభివృద్ధికి నా వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. ఈ వేడుకల్లో స్థానిక నాయకులు, కార్యకర్తలు, భక్తులు, కాలనీ వాసులు భారీ సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు.


# రజకులపై అగ్రవర్ణాల దాడులకు ప్రత్యేక చట్టం తేవాలి: పూసాల సంపత్

**కరీంనగర్, ఎప్రిల్28(ది క్రైం న్యూస్):** కరీంనగర్ జిల్లాకేంద్రంలోని రజక సంఘ జిల్లా కార్యాలయంలో మంగళవారం సంఘ సమావేశాన్ని నిర్వహించారు.సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్ హజరై మాట్లాడుతూ.... రాష్ట్రంలో రజకులపై రజక ప్రజాప్రతినిధులపై దాడులకు పాల్పడ్డుతున్న అగ్రవర్ణాలను కఠినంగా శిక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలన్నారు.ఫిబ్రవరి 18న నాగర్ కర్నూలు జిల్లా కొమ్మెరలో ఫిబ్రవరి 18న జరిగిన మల్లన్న జాతరలో రజకులు దేవాలయంలోకి రావద్దంటూ అగ్రవర్ణాలైనా మధుకర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి నెలల పసిపాపను కాళ్లతో తన్ని హత్యచేయగా ఆరుగురిని అరెస్టు చేసి మిగతా ముగ్గురిని పోలీసులు వదిలిపెట్టారన్నారు. పెద్దపెల్లి జిల్లా ఎలిగేడు మండలంలో పోచమ్మ ఆలయం వద్ద రాజకీయ కక్షతో రజకుడైన చంద్రగిరి పరిశీపై అగ్రవర్ణాలు చేసిన దాడులు మరవకముందే ఈనెల 25న రంగారెడ్డి జిల్లా చౌదరి గూడెం మండలం ఎలకగూడెంలో జరిగిన జాతరలో రజకుడైన సర్పంచ్ బందయ్యపై మాజీ సర్పంచి రామ్ రెడ్డి అతని అనుచరులు నలుగురు కత్తులతో దాడీచేసి హత్యాయత్నానికి పాల్పడగా ఇద్దరిని అరెస్ట్ చేసి ప్రధాన నిందితుడైన రామ్ రెడ్డిని అరెస్టు చేయకపోవడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు.రజకుల రాజకీయ ఎదుగుదలను జీర్ణించుకోలేక దాడులకు పాల్పడుతున్న అగ్రవర్ణాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సర్పంచ్ బందయ్యకు ఏమైనా జరిగితే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని పూసాల సంపత్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రజక సంఘం జిల్లా అధ్యక్షుడు రాచకొండ నరేష్, ప్రధాన కార్యదర్శి కొత్తకొండ శ్రీనివాస్, కార్యదర్శి లింగంపల్లి సమ్మయ్య, గంగిపల్లి శ్రీనివాస్, బూత్కూరి శివ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# నిన్న యూరియా చెప్పులు... నేడు డీజిల్ క్యాన్లు.. మరి రేపు?

**● రైతుకు డీజిల్ దొరకని దౌర్భాగ్యం ● విత్తనం నుంచి విక్రయం దాకా ప్రతి అడుగులో అడ్డంకులే ● హార్వెస్టర్ సిద్ధం... పంట సిద్ధం... కానీ డీజిల్ లేదు ● రైతు చెమటతో దేశం నిలబడుతుంది... కానీ రైతే నిలబడలేని పరిస్థితి!**

**బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లాలో ఉన్న పెట్రోల్ బంకుల్లో డీజిల్ కొరకు క్యాన్ల క్యూ లైన్లు కనబడుతున్నాయి. నిన్నటిదాకా పంట పండించడానికి యూరియా బస్తాల కోసం రైతులు షాపుల ముందు చెప్పుల క్యూ లైన్లు పెట్టారు.ఇప్పుడు పంట కోయడానికి డీజిల్ కోసం క్యాన్ల క్యూ లైన్లు కనిపిస్తున్నాయి. ఇది కేవలం కొరత కాదు... ఇది రైతు జీవితాన్ని క్యూ లైన్లలో నిలబెట్టిన వ్యవస్థ వైఫల్యం. పంట కోయాల్సిన అత్యవసర సమయంలో హార్వెస్టర్లు సిద్ధంగా ఉన్నాయి. ట్రాక్టర్లు రెడీగా ఉన్నాయి. కానీ వాటిని కదిలించే డీజిల్ మాత్రం లేదు! ఫలితం---హార్వెస్టర్లు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. పొలాల్లో సిద్ధంగా ఉన్న పంట... రైతు కళ్ల ముందే వాడిపోతోంది. రైతు ప్రయాణం విత్తనం వేసిన దగ్గర నుంచి ప్రారంభమవుతుంది. ఆ ప్రయాణం ప్రతి అడుగులోనూ కష్టాలతో నిండిపోతున్నది. నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందులు సమయానికి దొరకని ఎరువులు, ప్రకృతి వైపరీత్యాల బెడద అంతా ఎదుర్కొని పంట కోత దశకు వచ్చిన రైతుకు... ఇప్పుడు డీజిల్ కొరత మరో పిడుగుపాటుగా మారింది. కోసిన ధాన్యాన్ని అమ్ముకోవాలంటే మరో కష్టం. రోడ్ల మీద ఆరబోస్తే పోలీసుల వేధింపులు... కాంటాల్లో ఆలస్యం... తేమ శాతం సరిపోలేదని, లారీలు దొరకలేదని, గోనెసంచులు రాలేదని రకరకాల కారణాలతో నిలిపివేతలు... ఇదంతా చాలదనట్టు ఆకాశం నుంచి అకాల వర్షాలు ముంచుకొస్తున్నాయి. పొట్టకూటి కోసం నాలుగు పైసల సంపాదన కొరకు నెలల తరబడి కష్టపడిన రైతుకు... ఆ పంట చేతికి అందుతుందా లేదా అన్న అనిశ్చితి! ఇది 80 ఏళ్ల స్వతంత్ర భారతం పరిస్థితి. పేరుకు మాత్రం "రైతు సంక్షేమ ప్రభుత్వం". మాటల్లో మాత్రం "రైతుల ముఖాల్లో చిరునవ్వులు"... కానీ వాస్తవం? రైతు ముఖంలో చిరునవ్వు కాదు---నిస్సహాయత, నిస్పృహ. దేశంలో ఎక్కడా లేని విధంగా సదుపాయాలు ఇస్తున్నామంటూ గొప్పలు చెప్పే నాయకులకు... ఈ క్యూ లైన్లు కనిపించడం లేదా? రైతు తన పని తన సమయానికి చేసుకోవాలనుకుంటాడు. కానీ ఆ అవకాశమే లేకుండా చేస్తున్న ఈ వ్యవస్థను చూసి... అతను నోరు విప్పి ప్రశ్నించడానికి వెనుకాడుతున్నాడు. "ఇది నా రాతే" అని సర్దుకుపోతున్నాడు. దేశాన్ని పోషించే రైతు... ఇంకా ఎంతకాలం ఇలా బాధ పడాలి? అన్న ప్రశ్నలకు కాలమే సమాధానం చెప్పాలంటున్నారు.



పెట్రోల్ బంకుల వద్ద డీజిల్ కొరకు బారులు తీరిన క్యాన్లు

# గత ప్రభుత్వాల కాలంలో ఆలయాన్ని పట్టించుకోని పాలకులు

**● నేడు అందరి సహకారంతో ధర్మపురి క్షేత్ర మాస్టర్ ప్లాన్ అమలు చేస్తాం ● రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**ధర్మపురి, ఏప్రిల్ 28, (ది క్రైమ్ న్యూస్):** గత ప్రభుత్వ కాలంలో ఏనాడు ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రాన్ని పట్టించుకోలేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మంగళవారం రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, దేవాదాయ శాఖ వైదిక సలహాదారు గోవిందుల హరి తో కలిసి మంత్రి ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మాస్టర్ ప్లాన్ అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ 2027 లో నిర్వహించే గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు ఏలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారని మంత్రి అడ్లూరి తెలిపారు. ఇందులో భాగంగా గోదావరి తీరం వెంట ఉన్న పలు ఆలయాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించారని మంత్రి వివరించారు. గోదావరి తీరంలో ఉన్న భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం మాస్టర్ ప్లాన్, టెంపుల్ సిటీ పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారని ఈ సందర్భంగా మంత్రి వివరించారు. బాసరలోని సరస్వతి అమ్మవారు కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయం, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంతో పాటు ధర్మపురి లోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించినట్లు మంత్రి అడ్లూరి పేర్కొన్నారు. ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధి మాస్టర్ ప్లాన్ అమలుతో పాటు టెంపుల్ సిటీ నిర్మాణ పనులకు ప్రణాళికలు తయారు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు దేవాదాయ శాఖ కమిషనర్ తోపాటు పలువురు అధికారులు కలిసి మాస్టర్ ప్లాన్ అమలు తీరును పరిశీలించి నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తారని మంత్రి వివరించారు. ధర్మపురిలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి ప్రజల నుంచి సహకారం కావాలని మంత్రి కోరారు. పట్టణంలోని అన్ని వర్గాల ప్రజల సహకారంతో ధర్మపురి క్షేత్ర మాస్టర్ ప్లాన్ అమలతో పాటు టెంపుల్ సిటీ నిర్మాణ పనులు చేస్తామని ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి వివరించారు.





# పుష్కరాల పనులు వేగవంతం చేయాలి

**● రహదారుల నిర్మాణం కోసం కేంద్ర మంత్రులను కలుస్తాం ● ధర్మపురిలో పుష్కరాల పనులపై సమీక్ష నిర్వహించిన మంత్రి అడ్లూరి**





**ధర్మపురి, ఏప్రిల్ 28, (ది క్రైమ్ న్యూస్):** గోదావరి పుష్కరాల పనులతో పాటు ధర్మపురి క్షేత్రం శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కరాలు, ఆలయ అభివృద్ధిపై అధికారులతో మంగళవారం మంత్రి లక్ష్మణ్ కుమార్ జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తో పాటు వివిధ శాఖల అధికారులతో ధర్మపురిలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా అధికారులతో కలిసి శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి అడ్లూరి మాట్లాడుతూ 2027లో నిర్వహించే గోదావరి పుష్కరాలకు సంబంధించిన పనులు వేగవంతం చేయాలని అన్నారు. అధికారులు ఇప్పటికే తయారుచేసిన ప్రణాళికలు మరో మారు పున సమీక్షించి ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు రాకుండ చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. పుష్కరాలు కావాల్సిన నిధుల కోసం త్వరలోనే ముఖ్యమంత్రిని కలుస్తానని మంత్రి తెలిపారు. ధర్మపురి మండలం రాయపట్నం నుండి ధర్మపురి వరకు ఉన్న నేషనల్ హైవే 63 అభివృద్ధి పనుల నిధుల కోసం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిని కలిసి నిధులు సమకూర్చాలని కోరుతామని మంత్రి అన్నారు. ధర్మపురి క్షేత్రం అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. భూసేకరణకు ఉన్న ఇబ్బందులను స్థానికులతో చర్చించి భూసేకరణ ప్రక్రియ పూర్తయ్యే విధంగా స్థానిక నేతలు చొరవ తీసుకోవాలని మంత్రి అడ్లూ5 సూచించారు.

# గుడ్డు- పాలు..ఇందులో ఆరోగ్యానికి ఏది ఎక్కువ ప్రయోజనకరం!



గుడ్డు, పాలు రెండూ ఎక్కువ పరిమాణంలో తీసుకుంటారు. అయితే ఎప్పుడూ చర్చకు వచ్చే ప్రశ్న ఒకటుంది. అదేంటంటే రెండు గుడ్లు లేదా పాలల్లో ఏది ఎక్కువ ప్రయోజనకరం. ఈ రెండింటిలోనూ శరీరానికి మేలు చేసే పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. గుడ్లు, పాలు రెండింటిలో ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. కండరాల పెరుగుదలను మెరుగుపరచాలనుకునే వ్యక్తులు గుడ్లు, పాలు తీసుకోవడం మంచిది. రెండింటిలో విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. అయితే మరింత ప్రయోజనకరమైనది ఏమిటో తెలుసుకుందాం. ఒక గుడ్డులో ఎలాంటి పోషకాలు ఉంటాయి? హెల్త్‌లైన్ నివేదికల ప్రకారం, ఒక ఉడికించిన గుడ్డు (1 గుడ్డు)లో 6.3 గ్రాముల ప్రోటీన్, 77 కేలరీలు, 5.3 గ్రాముల మొత్తం కొవ్వు, 212 మిల్లీగ్రాముల కొలెస్ట్రాల్, 0.6 గ్రాముల కార్బోహైడ్రేట్లు, 25 మిల్లీగ్రాముల కాల్షియంతో పాటు విటమిన్ విటమిన్ 2, విటమిన్ 12, విటమిన్ బి5, ఫాస్పరస్, సెలీనియం వంటి అనేక పోషకాలు కూడా ఉన్నాయి. ఇంకో విషయం ఏంటంటే ఇది కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉంటుంది. అయితే ఇది రక్త కొలెస్ట్రాల్‌పై తక్కువ ప్రభావాన్ని చూపుతుంది. అలాగే గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచదు. అధిక కొలెస్ట్రాల్ ఉన్నవారు గుడ్లు తీసుకునే ముందు వారి వైద్యుడిని లేదా డైటీషియన్‌ను సంప్రదించాలి. ఒక కప్పు పాలలో ఎలాంటి పోషకాలు ఒక కప్పు పాలలో అంటే 250 గ్రాముల పాలు. 8.14 గ్రాముల అధిక నాణ్యత గల ప్రోటీన్, 152 కేలరీలు, 12 గ్రాముల పిండి పదార్థాలు, 12 గ్రాముల చక్కెర, 8 గ్రాముల కొవ్వు, 250 మిల్లీగ్రాముల కాల్షియం, విటమిన్ 12, రిబోఫ్లావిన్, ఫాస్పరస్, అనేక ఇతర పోషకాలు ఉన్నాయి. పాలలో 88 శాతం నీరు ఉంటుంది. ఇది శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచడంలో సహాయపడుతుంది. పాలలో కొంత వెయ్ ప్రోటీన్ కూడా ఉంటుంది. ప్రోటీన్‌తో పాటు, పాలు కాల్షియం అద్భుతమైన మూలంగా పరిగణించబడుతుంది. ముఖ్యంగా పాల నుండి లభించే కాల్షియం శరీరం సులభంగా గ్రహించబడుతుంది. రెండింటిలో ఏది ఎక్కువ ప్రయోజనకరం? ఇప్పుడు మనం పాలు, గుడ్లను పోల్చినట్లయితే రెండింటిలో మంచి మొత్తంలో ప్రోటీన్లు ఉంటాయి. కానీ పాలలో గుడ్లు కంటే ఎక్కువ కాల్షియం ఉంటుంది. గుడ్లలో కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉంటుంది. కానీ పాలలో ఉండదు. రెండూ చాలా ఎక్కువ కేలరీలు కలిగి ఉండవు. తినడానికి సురక్షితంగా పరిగణించబడతాయి. కానీ మీరు శాఖాహారులైతే పాలను సమృద్ధిగా తీసుకోండి. కానీ గుడ్లు తింటే వారానికి 4 నుంచి 5 గుడ్లు తినొచ్చు. మరోవైపు మీరు ప్రతిరోజూ పాలు తాగవచ్చు. ఎందుకంటే ప్రతిరోజూ పాలు తాగడం వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ రావు.

# 'అన్నా' అంటే అంత ఆగ్రహమా?

## - పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ జులూంపై ఎస్ఎస్‌డీ ఆగ్రహం





**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని ఓ సెలూన్ షాపులో కార్మికుడిపై ఎస్సై చందర్ ప్రవర్తించిన తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉందని సమత సైనిక్ దళ్ (ఎస్ఎస్‌డీ) రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ మండిపడ్డారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన పోలీసు అధికార దుర్వినియోగాన్ని తీవ్రంగా ఖండించారు. ఖాకీ దుస్తులు ధరించామని సామాన్యుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయాలనుకోవడం సహించబోమని హెచ్చరించారు.ఒక మనిషిని గౌరవంగా 'అన్నా' అని సంబోధించినందుకు కార్మికుడు రాముపై దాడి చేయడం అమానుషమని నగేష్ అన్నారు. ప్రజలకు రక్షణగా నిలవాల్సిన పోలీసులు రౌడీల తరహాలో వ్యవహరించడం అత్యంత దురదృష్టకరమని విమర్శించారు. అధికార గర్వం, అహంకారంతో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ప్రజాస్వామ్యానికి మచ్చ అన్నారు.ఈ ఘటనపై ఉన్నతాధికారులు తక్షణమే నిష్పక్షపాత విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన ఎస్సైపై కేవలం విచారణతో సరిపెట్టకుండా విధుల నుంచి తొలగించాలని కోరారు. భవిష్యత్తులో కార్మికులు, సామాన్యులపై ఇలాంటి దాడులు జరగకుండా ప్రభుత్వం స్పష్టమైన భరోసా కల్పించాలని అన్నారు.బాధితుడు రాముకు సమత సైనిక్ దళ్ పూర్తి అండగా ఉంటుందని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునే వరకు ఉద్యమం కొనసాగిస్తామని డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ స్పష్టం చేశారు.

# లబ్ధిదారులకు ఎమ్మెల్యే చెక్కుల పంపిణీ



**మానకొండూర్, ఏప్రిల్28(ది క్రైం న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలానికి చెందిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం పంపిణీ చేశారు. పథకాలను అమలు చేస్తూ నిర్ణీత గడువులోగా లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న తెలంగాణా ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. తహసీల్దార్ విజయ్ కుమార్, ఎంపీడీవో వరలక్ష్మి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు నందగిరి రవీంద్ర చారి,ఆయా గ్రామాల సర్పంచ్లు,పార్టీ నాయకులు, లబ్ధిదారులు తదితరులు చెక్కుల పంపిణీలో పాల్గొన్నారు.

# క్యాన్సర్ భూతాన్ని పారదోలే అద్భుత ఫలం.. ఎక్కడ కనిపించినా వదిలిపెట్టకండీ!



ఆప్రికాట్ పండు చాలా రుచికరమైన పండు. యాంటీఆక్సిడెంట్లతో నిండిన ఈ పండులో పోషకాలు కూడా ఎక్కువగా ఉంటాయి. రోగనిరోధక శక్తిని పెంచడంలో కీలకంగా వ్యవహరిస్తుంది. వీటిని రోజు వారీ ఆహారంలో క్రమం తప్పకుండా తింటే ఎన్నో ప్రయోజనాలు పొందుతారు. ఆప్రికాట్ పండును సూపర్ ఫుడ్ అని కూడా అంటారు. ఇందులో చాలా తక్కువ కేలరీలు ఉంటాయి. అయితే పోషకాలు మాత్రం పుష్కలంగా ఉంటాయి. ఆప్రికాట్ పండ్లలో బీటా కెరోటిన్, లుటిన్, పొటాషియం, విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ ఇ, జియాక్సంతిన్ అధికంగా ఉంటాయి. ఇవన్నీ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఆప్రికాట్ పండ్లు కళ్లకు కూడా చాలా మేలు చేస్తాయని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ఇందులో బీటా కెరోటిన్, విటమిన్ ఎ, జియాక్సంతిన్ ఉంటాయి. ఈ మూడు పదార్థాలు కళ్లకు ఎంతో మేలు చేస్తాయి. ఆప్రికాట్‌పండ్లు కంటిశుక్లం, రేచీకటి ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఆప్రికాట్ పండ్లలో వివిధ రకాల ఫైబర్ ఉంటుంది. కాబట్టి ఈ పండు తింటే జీర్ణం సులువుగా కడుపు క్లీన్ చేస్తుంది. బరువు తగ్గాలనుకునే వారికి కూడా ఈ పండు ఎంతగానో ఉపయోగపడుతుంది. బీటా-కెరోటిన్, లుటిన్, జియాక్సంతిన్, విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ ఇ, యాంటీఆక్సిడెంట్లు వంటి పదార్థాలు శరీరంలోని యాంటీ-క్యాన్సర్ ఏజెంట్లుగా పనిచేస్తాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ నుండి కణాలను రక్షిస్తాయి. ఆప్రికాట్ పండ్లు శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచుతాయి. ఆప్రికాట్ పండ్లలో అధికంగా పొటాషియం ఉంటుంది. కాబట్టి ఇది రక్తపోటును పెంచదు. ఆప్రికాట్ కూడా కాలేయం దెబ్బతినకుండా కాపాడుతుంది. ఈ పండు కాలేయ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఆప్రికాట్ పండ్లు శరీరంలోని ఎలక్ట్రోలైట్స్ తగ్గకుండా కాపాడుతాయి. అంటే మీరు ఎంత కష్టపడి పనిచేసినా శరీరం బలహీనపడకుండా ఉంటుంది.

# తమలపాకును నీళ్లలో మరిగించి తాగితే ఏమవుతుందో తెలుసా..? నమ్మలేని లాభాలు..

ఇందుకోసం ముందుగా పొయ్యి మీద ఒక పాత్ర పెట్టి, ఒక గ్లాసు నీళ్లు పోసి, ఒక తమలపాకును ముక్కలుగా కట్ చేసి అందులో వేయాలి. 5 నుంచి7 నిమిషాలు మరిగించి ఆ నీటిని వడకట్టి తాగాలి. మలబద్ధకం సమస్య ఉన్నవారికి ఈ తమలపాకు నీరు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. పేగు కదలికలు బాగా జరిగేలా చేస్తుంది. శరీరంలో వాపులను తగ్గిస్తుంది. తమలపాకులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉండటంవల్ల ఛాతీలో పేరుకుపోయిన కఫాన్ని తొలగిస్తుంది. అలాగే జలుబు, దగ్గు, గొంతు నొప్పి నుండి ఉపశమనం కలిగిస్తుంది. మధుమేహం నియంత్రణలో కూడా తమలపాకు నీరు తోడ్పడుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచటమే కాకుండా, మధుమేహం కారణంగా వచ్చే సమస్యలను కూడా తగ్గిస్తుంది. చెడు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్స్ స్థాయిలను కూడా తమలపాకు నీరు నియంత్రిస్తుంది. తద్వారా గుండె ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. తమలపాకులో యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉండుటవల్ల ఆస్తమాను కూడా అదుపులో ఉంచుతుంది. అంతేగాక తమలపాకును మౌత్ ఫ్రెషనర్‌గా ఉపయోగిస్తున్నారు. ఇది నోటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. తమలపాకు నోటిలో బ్యాక్టీరియా పెరుగుదలను నిరోధిస్తుంది. అయితే తమలపాకు నీటిని ఎప్పుపడితే అప్పుడు తాగడం కూడా మంచిదికాదు. రోజులో ఒకసారి మాత్రమే తీసుకోవాలి.

# నైపుణ్య శిక్షణ ద్వారా యువతకు విదేశాల్లో ఉద్యోగాలు

**● గల్ఫ్ ఏజెంట్ల బారిన పడకుండా ప్రత్యేక జాగ్రత్తలు ● రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**






**ధర్మపురి, ఏప్రిల్ 28, (ది క్రైమ్ న్యూస్):** రాష్ట్రంలో యువతకు సాంకేతిక నైపుణ్య శిక్షణ ఇచ్చి విదేశాల్లో ఉద్యోగాలు సాధించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మంగళవారం కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ తో కలిసి ధర్మపురిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ 2027 లో నిర్వహించే గోదావరి పుష్కరాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందు చూపుతో భక్తులకు ఏలాంటి ఇబ్బందులు రాకుండా అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని మంత్రి అన్నారు. ఇందులో భాగంగా బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న అన్ని ఆలయాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు మంత్రి వివరించారు. పుష్కరాల ఏర్పాట్ల కోసం మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసి అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని మంత్రి తెలిపారు. గత పాలకులు చంద్రబాబు నాయుడు, కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పుష్కరాలను ధర్మపురి క్షేత్రం నుంచి ప్రారంభించినప్పటికీ ధర్మపురి అభివృద్ధికి నిధులు కేటాయించలేదని మంత్రి ఆరోపించారు. గతంలో పుష్కరాల సమయంలో పనులు చేయడం వల్ల నాణ్యత లేకపోవడం, భక్తులు పుష్కరాలకు వస్తున్న సమయంలో పనులు చేయడంతో పుష్కర స్నానానికి వచ్చిన భక్తులు ఇబ్బంది పడ్డారని మంత్రి తెలిపారు. ఈసారి పుష్కరాలను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తుందని మంత్రి అడ్లూరి తెలిపారు. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ లో శిక్షణ పొందిన యువతకు స్థానికంగా ఉపాధి లభించడంతో పాటు విదేశాల్లో సైతం ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం టాంకాం దార యువతీ యువకులకు విదేశీ భాష పై అవగాహన కల్పించి గల్ఫ్ ఏజెంట్ల చేతిలో మోసపోకుండా ప్రభుత్వమే ఉద్యోగ భద్రత కల్పించి విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని మంత్రి వివరించారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటిసారి ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి వచ్చిన సందర్భంగా మంత్రి వివేక్ కి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో అగ్రికల్చర్ కోర్సును నూతనంగా ప్రవేశపెడుతున్నట్లు రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి డాక్టర్ వివేక్ తెలిపారు. తెలంగాణలో ముఖ్యంగా వ్యవసాయ ఆధారిత కుటుంబాలు ఎక్కువగా ఉన్నందున ఏటీసీల్లో అగ్రికల్చర్ కోర్స్ ప్రవేశ పెడుతున్నట్లు మంత్రి తెలిపారు. 1400 ఏళ్ల చరిత్ర కలిగిన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టడం సంతోషకరమని మంత్రి తెలిపారు. టామ్ కామ్ ద్వారా జగిత్యాల జిల్లా నుండి 30 మందికి శిక్షణ ఇవ్వడానికి అభ్యర్థులను ఎంపిక చేయాలని మంత్రి వివేక్ ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు.

# పంటినొప్పికి.. ఇంటి చిట్కాలు



పంటినొప్పి.. భరించలేని సమస్య. దాని ప్రభావం ముఖం, తలమీద కూడా ఉంటుంది. కారణం ఏదైనా పంటినొప్పికి మనవాళ్లు ఇంటిచిట్కాలకే ప్రాధాన్యం ఇస్తారు. అలాంటి ప్రభావవంతమైన చిట్కాలు ఓ ఐదు ఉన్నాయి. అయితే, ఇవి వైద్యుడి చికిత్సకు ప్రత్యామ్నాయాలు మాత్రం కాదు. చిట్కాలు ప్రయోగించినా పంటినొప్పి తగ్గలేదంటే వైద్యుణ్ని సంప్రదించడం మానుకోవద్దు. ఉప్పునీళ్లు ఉప్పులో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. ఉప్పునీళ్లను పుక్కిలించినప్పుడు నోట్లో ఉండే బ్యాక్టీరియా నశించిపోతుంది. నొప్పి, మంట కూడా తగ్గిపోతుంది. దీనికోసం ఓ గ్లాసు గోరువెచ్చటి నీళ్లలో టీస్పూన్ ఉప్పు కలుపుకోవాలి. ఈ ద్రావణాన్ని ఓ ముప్పై సెకండ్లపాటు పుక్కిలించి ఉమ్మేయాలి. ఇలా రోజులో కొన్నిసార్లు చేస్తూ ఉండాలి. ముఖ్యంగా తిన్న తర్వాత, పడుకునే ముందు పుక్కిలించడం మర్చిపోవద్దు. లవంగం నూనె పంటినొప్పి ఉపశమనానికి వందల ఏండ్లుగా లవంగం నూనెను ఉపయోగిస్తున్నారు. ఇందులో కూడా ఎనల్జీసిక్, యాంటీబ్యాక్టీరియల్ గుణాలు ఎక్కువే. లవంగం నూనెలో ఉండే యూజెనాల్ అనే మూలకం పంటినొప్పి నుంచి తాత్కాలిక ఉపశమనాన్ని ఇస్తుంది. పత్తి ఉండను తీసుకుని దాన్ని కొన్నిచుక్కల లవంగం నూనెతో తడపాలి. తర్వాత నొప్పిగా ఉన్న దంతాలు, చిగుళ్ల దగ్గర మర్దన చేయాలి. రోజులో పలుమార్లు ఇలా చేస్తే మంచి ఫలితాలు కనిపిస్తాయి. మంచుముక్కలు ఓ పల్చటి వస్త్రంలో మంచుముక్కలు తీసుకోవాలి. దీంతో నొప్పి ఉన్న దగ్గర్లో బుగ్గపై రుద్దుకోవాలి. ఇలాఓపది పదిహేను నిమిషాలపాటు చేస్తేనొప్పి ఉన్నచోట మొద్దుబారినట్టుగాఉంటుంది. పంటినొప్పిని తప్పించుకోవడానికి ఈ ప్రక్రియను కొన్నిగంటలకోసారి చేస్తూ ఉండాలి. పెప్పర్‌మింట్ టీ దీనిలో పుదీనా ఉంటుంది. దీనికి నోటిని చల్లగా చేస్తూ తిమ్మిరి కలగజేసే గుణాలు ఉంటాయి. పెప్పర్‌మింట్ టీని నోట్లోకి తీసుకోవడం ద్వారా పంటినొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. చల్లటి పెప్పర్‌మింట్ టీని నోట్లో ఓ ముప్పై సెకండ్లపాటు పుక్కిలించి ఉమ్మేయడం మంచిది. పెప్పర్‌మింట్ టీ బ్యాగ్‌ను నొప్పి ఉన్నచోట ఉంచినా ఇదే ఫలితం ఉంటుంది. ఇలా వీలైనన్ని సార్లు చేయాలి. వెల్లుల్లి వెల్లుల్లిలో యాంటీమైక్రోబియల్, యాంటీఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. దీనిలో ఉండే అలిసిన్ చెడు బ్యాక్టీరియాకు వ్యతిరేకంగా పోరాడుతుంది. ఓ వెల్లుల్లి రేకును మెదుపుకోవాలి. దీన్ని నేరుగా చిగుళ్లు, పంటిపై ఉంచాలి. వెల్లుల్లి రేకును, పేస్టును చప్పరించినా మంచి ఫలితాలే ఉంటాయి.

# ఈ ఆహారంతో కిడ్నీలు పదిలం

కిడ్నీలను దీర్ఘకాలం ఆరోగ్యంగా ఉంచుకునేందుకు పోషకాలతో నిండిన సమతులాహారం కీలకం. ఆహార నియమాల్లో చిన్నపాటి మార్పులతో కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. సోడియం, పాస్ఫరస్, పొటాషియంతో కూడిన ఆహారం అధికంగా తీసుకోవడం కిడ్నీలపై అదనపు భారం మోపుతుంది. ఇతర కాంప్లికేషన్స్ తలెత్తకుండా ఈ తరహా ఆహారాన్ని తగిన మోతాదు మించకుండా చూసుకోవాలి. అధిక ప్రొటీన్ ఆహారం కూడా కిడ్నీ వ్యాధిగ్రస్తుల్లో మూత్రపిండాలపై పనిభారం పెంచుతుంది. ఆహారంలో తాజా పండ్లు, కూరగాయలు తీసుకుంటే వాటిలో ఉండే పోషకాలు, యాంటీఆక్సిడెంట్ల కిడ్నీ పనితీరుకు ఊతమిస్తాయి. పండ్లు, కూరగాయలతో పాటు తృణధాన్యాలను తీసుకోవడం, బీపీ, శరీర బరువును అదుపులో ఉంచుకోవడంతో కిడ్నీ పనితీరు మెరుగవుతుంది. విటమిన్స్, మినరల్స్‌తో కూడిన ఆహారం కిడ్నీలకు మేలు చేయడంతో పాటు రోజంతా ఉత్సాహంగా, ఉత్తేజంగా ఉండేందుకు ఉపకరిస్తాయి. ఇవి వాపు ప్రక్రియ నివారించి, రోగ నిరోధక వ్యవస్థను ఉత్తేజితం చేస్తాయి. కిడ్నీ వ్యాధితో బాధపడేవారు పోషకాహారంతో పాటు సమతులాహారం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. కిడ్నీల ఆరోగ్యానికి పండ్లలో ముఖ్యంగా జామ, యాపిల్, పియర్, పపాయ, పైనాపిల్ తీసుకోవాలని చెబుతున్నారు. వీటిలో ఉండే యాంటీఆక్సిడెంట్స్ కిడ్నీలు దెబ్బతినకుండా కాపాడతాయి. ఇక ఐరన్, విటమిన్ కే వంటి కిడ్నీ ఆరోగ్యాన్ని మెరుగుపరిచే పాలకూర, కేల్ వంటి ఆకుకూరలు తీసుకోవాలి. ఫైబర్ అధికంగా ఉండే బ్రౌన్ రైస్, క్వినోవా కిడ్నీ ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఫిష్, తోఫు వంటి లీన్ ప్రొటీన్ కిడ్నీ ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతున్నారు.



## ఈ అద్భుతమైన ఆకుపచ్చపండు రోజూ తింటే.. డాక్టర్‌తో పని లేదు.. మందుల అవసరమే ఉండదట..!

సీజనల్ పండ్లలో అవోకాడో ఒక ప్రసిద్ధ పండు. అవకాడోలో చాలా పోషకాలు ఉన్నాయి. ఇది అధిక కొవ్వు ఆమ్లాలు, విటమిన్లు , ఫైబర్, ఖనిజాలు, ప్రోటీన్లతో సహా అవసరమైన పోషకాలను కలిగి ఉంటుంది. ఇది అనేక వ్యాధుల నుండి శరీరాన్ని రక్షించడంలో సహాయపడుతుంది. ఇది రుచికరమైన, పోషకమైన పండు. అవకాడో మన జుట్టు, చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఇది మధుమేహం, క్యాన్సర్, అజీర్ణం, డయేరియా వంటి వ్యాధుల నుండి ఉపశమనాన్ని అందించడంలో కూడా సహాయపడుతుంది. అవకాడో పండుతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలేంటో ఇక్కడ తెలుసుకుందాం.. ఆర్థరైటిస్‌లో మేలు చేస్తుంది: ఆర్థరైటిస్‌లో అవకాడో చాలా ప్రభావవంతంగా పని చేస్తుంది. ఇది కీళ్ళు, కణజాలం, కండరాల వాపును తగ్గించడంలో సహాయపడుతుంది. మోకాళ్ల నొప్పులను తగ్గిస్తుంది. రక్తంలో చక్కెర నియంత్రణ : అవకాడో అధిక కొవ్వు, తక్కువ కార్బోహైడ్రేట్ ఆహారం. తక్కువ కార్బోహైడ్రేట్ కంటెంట్ కారణంగా, ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. అవకాడో అనేది శక్తిని పెంచే ఆహారం. అధిక రక్తపోటు నుండి ఉపశమనం: అవోకాడో ఆకుల్లో యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇది రక్త కణాలను నయం చేయడంలో సహాయపడుతుంది. అధిక రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. క్యాన్సర్‌లో మేలు చేస్తుంది: ప్రోస్టేట్ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడంలో అవకాడో చాలా ప్రభావవంతంగా ఉంటుంది. మోనోశాచురేటెడ్ కొవ్వులో కెరోటినాయిడ్లు తగినంత ఉంటాయి.. ఇది క్యాన్సర్‌ను తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది: అవకాడో పండ్లలో ఫ్లేవనాయిడ్స్, సపోనిన్లు, టానిన్లు ఉంటాయి. ఈ సమ్మేళనాల సహాయంతో ఇది ఎసిడిటీ, గ్యాస్ట్రిక్ సమస్యలు, మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. చర్మ సమస్యలను నయం చేయడానికి : యాంటీ ఆక్సిడెంట్ గుణాలు పుష్కలంగా ఉండే అవకాడోస్ తీసుకోవడం వల్ల చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. అవకాడో అనేక చర్మ సంబంధిత సమస్యలను దూరం చేయడంలో మేలు చేస్తుంది.

# శరీరం హైడ్రేటెడ్‌గా ఉండాలంటే వీటిని తప్పక తీసుకోవాలి.. లేదంటే కష్టాలు కొని తెచ్చుకున్నట్లే!



ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిరోజు సరిపడా నీళ్లు తాగాలని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. కానీ రోజువారీ పనుల్లోపడి నీటిని సమృద్ధిగా నీళ్లు తాగరు. రోజంతా గడచిన తర్వాత ఎక్కువ నీరు తాగలేదనే విషయం గుర్తుంది. కానీ ఇలా మళ్లీ మళ్లీ జరిగితే, మీరు పెద్ద ఇబ్బందుల్లో పడతారు. అందుకే రోజంతా తగినంత నీరు త్రాగాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా వేసవిలో శరీరంలో నీటి శాతాన్ని పెంచడానికి, నీటి శాతం ఎక్కువగా ఉండే కొన్ని రకాల పండ్లు, కూరగాయలను కూడా తినవచ్చు. అవసరమైతే, పండ్ల రసాలు కూడా తాగవచ్చు. ప్రతిరోజూ ఉదయం నిద్రలేచిన తర్వాత 1 గ్లాసు నీరు తాగడం అలవాటు చేసుకోవాలి. రోజులో ప్రతి భోజనానికి కనీసం అరగంట ముందు ఒక గ్లాసు నీరు త్రాగాలి. ఇలా చేస్తే ఆహారం జీర్ణమవడంతోపాటు ఆహారంలోని పోషకాలు సమృద్ధిగా శరీరానికి అందుతాయి. నిమ్మకాయ-పుదీనా లేదా దోసకాయ-తులసి ఆకులతో తయారు చేసిన నీటిని కూడా త్రాగవచ్చు. నీటి రుచి మారడంతో, మళ్లీ మళ్లీ నీరు తాగాలనే విషయం మీరు గుర్తుంచుకుంటారు. మొదట్లో కాస్త కష్టంగా అనిపించినా క్రమంగా అది అలవాటుగా మారుతుంది. ఇది మీ శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచడంలో సహాయపడుతుంది. అనేక వ్యాధుల నుంచి తేలిగ్గా బయటపడవచ్చు. శరీరం హైడ్రేట్ గా ఉండాలంటే తాజా పండ్లు తినాలి. ఎండాకాలం వచ్చిందంటే చాలు పుచ్చకాయలు మార్కెట్‌లో అధికంగా దొరుకుతాయి. ప్రతిరోజూ కొన్ని పుచ్చకాయ ముక్కలు తినడానికి ప్రయత్నించాలి. పుచ్చకాలయలోని పోషకాలు శరీరంలో నీటి కొరతను తీరుస్తుంది. పంటినొప్పికి.. ఇంటి చిట్కాలు పంటినొప్పి.. భరించలేని సమస్య. దాని ప్రభావం ముఖం, తలమీద కూడా ఉంటుంది. కారణం ఏదైనా పంటినొప్పికి మనవాళ్లు ఇంటిచిట్కాలకే ప్రాధాన్యం ఇస్తారు.

## బీకేర్‌ఫుల్..! శరీరంలో ఈ ఖనిజం లోపం ఉంటే జుట్టు నెరిసిపోతుందట..

అన్ని పోషకాలు సమృద్ధిగా ఉంటేనే శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. అందుకే.. మనం తీసుకునే ఆహారంలో ఖనిజాలు, విటమిన్లు, పోషకాలు ఉండేలా చూసుకోవాలి.. అలాంటి ముఖ్యమైన ఖనిజాల్లో రాగి ఒకటి.. రాగి ఆరోగ్యానికి చాలా ముఖ్యమైనది.. కానీ ఇది తక్కువ పరిమాణంలో అవసరం. ఈ పోషకం ఎర్ర రక్త కణాలు, ఎముకలు, బంధన కణజాలం, కొన్ని ముఖ్యమైన ఎంజైమ్‌లను తయారు చేయడానికి ఉపయోగిస్తారు. కాపర్ కొలెస్ట్రాల్ ప్రాసెసింగ్, మీ రోగనిరోధక వ్యవస్థ సరైన పనితీరు, కడుపులో శిశువుల అభివృద్ధికి కూడా కాపర్ అవసరం.. ఆరోగ్య నిపుణుల ప్రకారం.. ఆరోగ్యకరమైన వయోజన వ్యక్తికి ప్రతిరోజూ 900రాగి అవసరం.. ఈ పోషకం లోపం వల్ల అలసట, బలహీనత, తరచుగా అనారోగ్యం, బలహీనమైన, పెళుసుగా ఉండే ఎముకలు, జ్ఞాపకశక్తి కోల్పోవడం, నడవడంలో ఇబ్బంది, చలికి సున్నితత్వం, లేత చర్మం, జుట్టు నెరిసిపోవడం, కంటి చూపు కోల్పోవడం వంటి సమస్యలు వస్తాయి.. అందుకే.. కాపర్ రిచ్ ఫుడ్స్ ను తప్పనిసరిగా తీసుకోవాలి.. రాగి సమృద్ధిగా ఉండే పదార్థాలు ఏంటో ఇప్పుడు తెలుసుకోండి.. కాపర్ రిచ్ ఫుడ్స్.. నట్స్ ను పోషకాల నిధి అని పిలుస్తారు. వీటిలో ఫైబర్, ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. ఇందులో రాగి కూడా సమృద్ధిగా లభిస్తుంది. బాదం, వేరుశెనగ లాంటి వాటని తింటే ఈ పోషకానికి లోటు ఉండదు రొయ్యలు సముద్రపు అడుగుభాగంలో ఎక్కువగా ఉంటాయి. ఇంకా పలు ప్రాంతాల్లో వీటిని పెంచుతారు. రొయ్యల మాంసంలో తక్కువ కొవ్వు ఉంటుంది. అంతేకాకుండా అధిక ప్రోటీన్, సెలీనియం, విటమిన్ 12తో సహా పలు విటమిన్లు, ఖనిజాలతో నిండి ఉంటుంది. అంతేకాకుండా, ఇందులో రాగి కూడా పుష్కలంగా ఉంటుంది. డార్క్ చాక్లెట్: డార్క్ చాక్లెట్‌ని ఇష్టపడని వారంటూ ఎవరూ ఉండరు.. ఇందులో కోకో ఘనపదార్థాలు సమృద్ధిగా ఉంటాయి. తక్కువ చక్కెర కంటెంట్ కూడా ఉంటుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్, అనేక పోషకాలు ఉంటాయి. దీన్ని నిత్యం తినడం వల్ల శరీరానికి రాగి పుష్కలంగా అందుతుంది. తృణధాన్యాలు: తృణధాన్యాలు (గింజలు) వంటి వాటిల్లో కూడా పోషకాలు పుష్కలంగా ఉంటాయి. వీటిలో రాగి పుష్కలంగా లభిస్తుంది. ఇందులో నువ్వులను రాగి పవర్‌హౌస్ అని కూడా పిలుస్తారు. ఆకు కూరలు: గ్రీన్ లీఫీ వెజిటేబుల్స్ దాదాపు అన్ని మంచివే.. వీటిలో అన్ని రకాల పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఫైబర్, విటమిన్ కె, కాల్షియం, మెగ్నీషియం, ఫోలేట్ ఇందులో ఉంటాయి. బచ్చలికూర, పాలకూర లాంటివి తింటే శరీరంలో రాగి లోపం అనే మాటే ఉండదు.

## పంచామృతం అంటే ఏంటి..? ఎలా తయారు చేసుకోవాలి..

# ఆరోగ్యానికిది అమృతంతో సమానం..!



దేవుడికి పంచామృతాలతో అభిషేకం చేస్తారు. భారతీయ సంప్రదాయం ప్రకారం, పంచామృతం అనేది పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదార లేదా బెల్లం మిశ్రమం. ఇవి ఐదు పవిత్ర పదార్థాలు హిందూ మతంలో ఆరాధన, భక్తిలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. పంచామృతం హోమం హవన్, పూజ సమయంలో అనేక మతపరమైన ఆచారాలలో ఉపయోగిస్తుంటారు. ఈ ఐదు పదార్థాలను ఉపయోగించడం ద్వారా, దేవునికి అంకితమైన పవిత్రమైన, స్వచ్ఛమైన నైవేద్యం సిద్ధమవుతుంది. ఇది శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యాన్ని సమతుల్యం చేయడానికి దోహదం చేస్తుంది. ఆవు పాలు, ఆవు పెరుగు, ఆవు నెయ్యి, తేనె, పండ్ల నుంచి వచ్చే రసం గానీ, కొబ్బరి నీళ్లు గానీ కలిపితే పంచామృతం అవుతుంది. ఐదు పవిత్ర పదార్థాలతో తయారు చేసే ఈ పదార్థం.. దేవుడికి అభిషేకం చేయడానికి, పూజలో ఉపయోగిస్తారు. పంచామృతాన్ని ఉపయోగించడం వల్ల కలిగే ప్రయోజనం ఏమిటి? పూజలో పంచామృతాన్ని ఎందుకు ఉపయోగిస్తారు..? ఇక్కడ తెలుసుకుందాం.. పంచామృతం ప్రయోజనాలు: 1. పాలు: పాలు స్వచ్ఛత, పోషణకు చిహ్నంగా పరిగణించబడతాయి. 2. పెరుగు: పెరుగు ఆరోగ్యం, శ్రేయస్సుకు చిహ్నంగా పరిగణించబడుతుంది. 3. నెయ్యి: నెయ్యి జ్ఞానం, కాంతికి చిహ్నంగా పరిగణించబడుతుంది. 4. తేనె: తేనె మాధుర్యం, జీవితానికి చిహ్నంగా పరిగణించబడుతుంది. 5. గంగాజలం: గంగాజలం స్వచ్ఛతకు చిహ్నంగా పరిగణించబడుతుంది. పంచామృతం ఆచార ప్రయోజనాలు: పంచామృతం దేవతలను అభిషేకించడానికి ఉపయోగిస్తారు. దేవతలకు పంచామృతాలతో అభిషేకం చేయడం వల్ల దేవతలు త్వరగా ప్రసన్నమవుతారని, భక్తుల కోర్కెలు నెరవేరుతాయని విశ్వాసం. పూజలో కూడా పంచామృతాన్ని ఉపయోగిస్తారు. పంచామృతాలతో దేవుడిని పూజించడం ద్వారా పూజా ఫలాలు రెట్టింపు అవుతాయని విశ్వాసం. ఆధ్యాత్మిక ప్రయోజనాలు: పంచామృతం మనస్సును శాంతపరచడంలో, ఏకాగ్రతను పెంచడంలో సహాయకరంగా పరిగణించబడుతుంది. పంచామృతం ప్రతికూల శక్తిని వదిలించుకోవడానికి, సానుకూల శక్తిని ఆకర్షించడంలో సహాయపడుతుందని విశ్వసిస్తారు.

## పరగడుపున టమాటాలు తింటే ఇలా అవుతుందా..? ఖచ్చితంగా తెలుసుకోవాల్సిన విషయం ఇది..!

ఇంట్లో కూరగాయలు, పప్పు రుచిని పెంచడానికి ఉపయోగించే టమాటాలు తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. టమాటాలను తరచుగా కూరలు, సలాడ్‌లు, సూప్‌లు, చట్నీలలో ఉపయోగిస్తారు. టమాటాలు చర్మ ఆరోగ్యానికి చాలా ఉపయోగకరంగా పనిచేస్తాయి. టమాటాలను అందం కోసం కూడా చాలా హోం రెమెడీస్ లో ఉపయోగిస్తుంటారు. అంతే కాదు, టమాటాలను అనేక సౌందర్య ఉత్పత్తులలో కూడా ఉపయోగిస్తారు. టమాటాలో విటమిన్ సి, లైకోపీన్, విటమిన్ కె, పొటాషియం పుష్కలంగా ఉన్నాయి. దీన్ని తినడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. టమాటా బరువు తగ్గడానికి కూడా సహాయపడుతుంది . టమోటాలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకుందాం. టమాటా తినడం వల్ల కలిగే ప్రయోజనాలు.. 1- బాగా పండిన టమాటాలను ఉదయం పూట నీళ్లు తాగకుండా ఖాళీ కడుపుతో తింటే ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. 2- రికెట్స్‌తో బాధపడుతున్న పిల్లలకు రోజూ ఒక గ్లాసు టమాటా రసం ఇవ్వాలి. దీంతో వారికి ఎంతో మేలు జరుగుతుంది. 3- టమాటా తినడం వల్ల పిల్లల శారీరక, మానసిక అభివృద్ధి మెరుగుపడుతుంది. 4- బరువు తగ్గడానికి, మీరు టమాటాలు తినండి. మీరు టమాటాను సలాడ్‌లో కూడా చేర్చుకుని తినవచ్చు. లేదా 1-2 గ్లాసుల టమాటా రసం చేసుకుని కూడా తాగొచ్చు. 5- ఆర్థరైటిస్‌తో బాధపడేవారు టమాటా తినాలి. టమాటా జ్యూస్‌లో సెలెరీని కలిపి తాగడం సహాయపడుతుంది. 6- గర్భిణీలకు కూడా టమాటా మేలు చేస్తుంది. దీని కారణంగా శరీరానికి విటమిన్ సి లభిస్తుంది. గర్భధారణ సమయంలో శరీరానికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. 7- కడుపులో నులిపురుగుల సమస్య ఉంటే ఖాళీ కడుపుతో టమాటా ఎండుమిర్చి కలిపి తింటే మంచిది. 8- రోజూ పచ్చి టమాటాలు తింటే ముఖం మెరుస్తుంది. 9- టమాటా తినడమే కాకుండా ముఖానికి రాసుకుంటే ముఖం కాంతివంతంగా మారుతుంది. ఇందుకోసం టమాటా గుజ్జును ముఖానికి రాసుకుంటే మెరుపు వస్తుంది. 10- టమాటా తినడం మధుమేహంలో ప్రయోజనకరంగా ఉంటుంది. కంటి చూపును మెరుగుపరుస్తుంది.

# ఎండు ద్రాక్ష నీరు ఇలా తాగారంటే.. కేవలం 10 రోజుల్లోనే ఆ సమస్యలన్నీ పరార్..!



ప్రస్తుత కాలంలో ఎంతో మంది ఎదుర్కొంటున్న సమస్యల్లో అధిక బరువు కూడా ఒకటి. అధిక బరువు కారణంగా చాలా మంది అనేక అనారోగ్య సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. వెయిట్ లాస్ అయ్యేందుకు ఎన్నో రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. వ్యాయామం, వాకింగ్, హెల్దీ డైట్, జిమ్ ఇలా చాలానే ట్రై చేస్తున్నారు. అయితే కొన్ని రకాల సింపుల్ చిట్కాలతో కూడా వెయిట్ లాస్ అవ్వొచ్చని నిపుణులు చెబుతున్నారు. వెయిట్ లాస్ అయ్యేందుకు ఎండు ద్రాక్ష వాటర్ ఎంతగానో సహకరిస్తుంది. ప్రతిరోజూ ఎండు ద్రాక్ష నీరు తాగుతూ, మంచి డైట్ మెయిన్ టైన్ చేస్తూ.. వ్యాయామం చేస్తే మీకు కేవలం 10 రోజుల్లోనే రిజల్ట్ కనిపిస్తుంది. ఇలాంటి వాటర్ తాగడం వల్ల మీ బాడీ కూడా ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉంటుంది. మరి ఇంకా ఎండు ద్రాక్ష నీటిని తీసుకుంటే ఎలాంటి లాభాలు ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం. బాడీని డిటాక్సిఫికేషన్ చేస్తుంది: ఎండుద్రాక్ష నీటిని తాగడం వల్ల శరీరం డీటాక్సిఫై అవుతుంది. రోజు వారీ జీవితంలో మనకు తెలియకుండానే కాలుష్యం, తినే ఆహారం ఇలా రకరకాల కారణాల వల్ల శరీరంలో మలినాలు అనేవి చేరతాయి. కాబట్టి ఎండు ద్రాక్ష నీటిని తాగడం వల్ల శరీరంలో ఉండే మలినాలు బయటకు పోతాయి. శరీరం ఫ్రీ రాడికల్స్‌తో పోరాడే శక్తి కూడా లభిస్తుంది. నిద్ర లేమి సమస్యలను దూరం చేస్తుంది: బరువు పెరిగేందుకు నిద్ర లేమి సమస్యలు కూడా ఒక కారణంగా ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. సరైన నిద్ర లేకపోతే.. తిన్నది అరగక.. పొట్టలో కొవ్వు అనేది నిల్వ ఉండిపోతుంది. అంతే కాకుండా గ్యాస్ అసిడిటీ సమస్యలు కూడా వస్తాయి. కాబట్టి మీరు ఎండు ద్రాక్ష నీటిని తాగితే నిద్ర లేమి సమస్యల్ని దూరం చేస్తుంది. ఎలక్ట్రోలైట్ సమతుల్యత: ఎండు ద్రాక్ష నీటిలో పొటాషియం, మెగ్నీషియం వంటివి లభ్యమవుతాయి. ఇవి శరీరంలోని ద్రవాల స్థాయిల్ని కంట్రోల్‌లో ఉంచుతుంది. చెమట వల్ల కోల్పోయిన శక్తి ఈ నీళ్ల వల్ల తిరిగి వస్తుంది. నాడీ వ్యవస్థ పనితీరు, కండరాల తీరును సరి చేస్తుంది. గట్ హెల్త్: ఎండు ద్రాక్ష నీరు తాగడం వల్ల గట్ హెల్త్ కూడా మెరుగు పడుతుంది. శరీరంలో నుంచి మలినాలన్నీ బయటకు పంపుతుంది. ఎండు ద్రాక్షలో ఉండే ఫైబర్ జీర్ణ శక్తిని, మలబద్ధకం వంటి సమస్యలు రాకుండా చేస్తుంది. వెయిట్ లాస్: ఎండు ద్రాక్ష నీరు తాగడం వల్ల తక్కువ రోజుల్లోనే బరువు తగ్గుతారు. ఎండు ద్రాక్ష నీటిలో ఫైబర్ కంటెంట్ మెండుగా ఉంటుంది. కాబట్టి ఈ నీటిని తీసుకుంటే కడుపు నిండిన భావన కలుగుతుంది. గోరు వెచ్చటి నీటిలో 3 లేదా 4 ఎండు ద్రాక్షను వేసి రాత్రంతా నానబెట్టాలి. ఉదయం లేవగానే ఆ నీటిని తాగి ఎండుద్రాక్ష తినాలి.

# కోహ్లీ మోస్ట్ ఎమోషనల్ మూమెంట్..

# స్పోర్ట్స్



డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఈ సీజన్‌లోనూ దుమ్ములేపుతోంది. 7 మ్యాచ్‌ల్లో ఐదు విజయాలు సాధించిన ఆర్‌సీబీ.. 10 పాయింట్లతో రెండోస్థానంలో ఉంది. నేడు ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడుతోంది. 18 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఐపీఎల్ ఛాంపియన్‌గా నిలిచిన తరువాత విరాట్ కోహ్లీ తొలిసారి తన సొంత మైదానం ఢిల్లీలో ఆడనున్నాడు. తన కెరీర్‌లో తొలిసారిగా ఐపీఎల్ ట్రోఫీని అందుకున్నప్పుడు కోహ్లీ ఎలా ఉన్నాడో ఆర్‌సీబీ ఆల్‌రౌండర్ కృనాల్ పాండ్యా వెల్లడించాడు. జియోస్టార్ 'ది కృనాల్ పాండ్యా ఎక్స్‌పీరియన్స్'లో మాట్లాడుతూ.. ట్రోఫీకి అత్యంత అర్హుడు విరాట్ కోహ్లీ, ఆర్‌సీబీ అభిమానులు అని అన్నాడు. మొదటి సీజన్ నుంచి విరాట్ కోహ్లీ ఆర్‌సీబీ టీమ్‌లో అంతర్భాగం అయయాడని.. ట్రోఫీ గెలిచినప్పుడు భావోద్వేగానికి గురికావడం చూడటం చాలా ప్రత్యేకమైనదని అన్నాడు. విరాట్ కోహ్లీ ఏడవడం చూడటం.. మీరు అభిమాని అయినా లేదా జట్టులో భాగమైనా.. ప్రతిఒక్కరికీ ఒక భావోద్వేగ క్షణం. చెన్నైతో ఆడి బస్సులో బయటకు వెళ్తున్నప్పుడు ఆర్‌సీబీ ప్రజలకు ఎంతో ప్రేమ ఉందో చూశా.. ఆ రోజు నేను అభిమానుల కోసం మనం తప్పకుండా కప్ గెలవాలని చెప్పాను. నేను ఆ మాట అన్నందుకు.. ఫైనల్‌లో గెలిచి మేము కల నెరవేర్చగలిగినందుకు సంతోషంగా ఉంది. ఈ ట్రోఫీకి అందరికంటే ఎక్కువగా అభిమానులే అర్హులు.. అలాగే విరాట్ కూడా. విజేతగా నిలవడంతో భాగమై.. చిన్న విధంగానైనా నా వంతు సహకారం అందించినందుకు నేను కృతజ్ఞుడను. నాకు దేశం కోసం ఆడటమే ప్రథమం. కానీ 18 ఏళ్ల తర్వాత ఆర్‌సీబీ కోసం గెలవడం.. జట్టుకు చక్కగా సహకరిస్తూ నా అత్యుత్తమ సీజన్‌ను సొంతం చేసుకోవడం నా జీవితంలోని అత్యుత్తమ క్షణాలలో ఒకటిగా నిలుస్తుంది." అని కృనాల్ పాండ్యా చెప్పుకొచ్చాడు.కాల క్రమేణా తాను చాలా మారిపోయానని తన ఐపీఎల్ ప్రయాణం గురించి కృనాల్ పాండ్యా వివరించాడు. ఈ ప్రయాణంలో ముందుకు సాగుతున్నకొద్దీ.. ఎన్నో విషయాలు నేర్చుకుంటామన్నాడు. "నా విజయానికి చాలా వరకు నా తల్లిదండ్రులే కారణం. ఒక మనిషిగా నా వ్యక్తిత్వం మాత్రం మారలేదు. నాకు క్రికెట్ అంటే చాలా ఇష్టం. క్రికెట్ ఆడేందుకు ఇప్పటికీ అంతే ఉత్సాహంగా.. ఆసక్తిగా ఉంటాను. నేను ఎప్పుడూ కుటుంబానికి ప్రాధాన్యతనిస్తా.. నా కుటుంబాన్ని, పిల్లలను, నా జీవితంలో కీలక పాత్ర పోషించిన నా భార్యను ఎక్కువగా ప్రేమిస్తాను." అని కృనాల్ పాండ్యా అని చెప్పాడు. కృనాల్ పాండ్యా ఈ సీజన్‌లో 7 మ్యాచ్‌లలో 8 వికెట్లు పడగొట్టాడు. మొత్తంగా ఐపీఎల్ కెరీర్‌లో 149 మ్యాచ్‌లలో 101 వికెట్లు తీయడంతో పాటు.. 1792 పరుగులు కూడా చేశాడు. ఐపీఎల్ మినీ వేలానికి ముందు కృనాల్ పాండ్యాను రూ.5.75 కోట్లకు ఆర్‌సీబీ అట్టిపెట్టుకుంది.

## క్రికెట్ అకాడమీని ప్రారంభించిన విరాట్ కోహ్లీ


క్రికెట్ గ్రౌండ్‌లో తన అగ్రెసివ్ ఆట తీరుతో ప్రత్యర్థులను వణికించే విరాట్ కోహ్లీ ఇప్పుడు ఒక మంచి ప్రసంగంతో విద్యార్థులకు ఒక మర్చిపోలేని సందేశం ఇచ్చారు. దిల్లీలోని డీపీఎస్ (దిల్లీ పబ్లిక్ స్కూల్) ఆర్కేపురంలో కొత్తగా ఏర్పాటు చేసిన క్రికెట్ అకాడమీ ప్రారంభోత్సవానికి విరాట్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్కూల్ మీటింగ్‌లలో మాట్లాడటం తనకు కొంత కొత్తగా ఉందని చెప్పినప్పటికీ విద్యార్థులతో తన మనసులోని మాటలను పంచుకున్నారు. తాను కూడా ఒకప్పుడు ఇలాంటి దశ నుంచే వచ్చానని చెబుతూ తన ప్రసంగాన్ని మొదలుపెట్టారు. కోహ్లీ రాకతో ఆ ప్రాంగణమంతా కోలాహలంగా మారింది. జీవితంలో ఏదైనా సాధించాలంటే ముందుగా మన కలల పట్ల మనం నిజాయితీగా ఉండాలని విరాట్ కోహ్లీ విద్యార్థులకు హిత బోధ చేశారు. "మీరు ఏం చేయాలనుకుంటున్నారో దానిపై క్లారిటీతో ఉండండి. ఆ టార్గెట్ కోసం పూర్తి నిబద్ధతతో పని చేయండి. మీరు మీ పని పట్ల 100 శాతం నిజాయితీగా ఉన్నారో లేదో మీకు మాత్రమే తెలుస్తుంది" అని కోహ్లీ పేర్కొన్నారు. తాను చిన్న వయసులోనే క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకున్నానని, ఆ విషయాన్ని తన కుటుంబ సభ్యులకు, టీచర్లకు ఎంతో నిజాయితీగా వివరించానని ఆయన గుర్తుచేసుకున్నారు. ఏ రంగంలోనైనా క్లారిటీ ఉంటేనే అనుకున్నది సాధించగలమని ఆయన స్పష్టం చేశారు. పాఠశాల అనేది కేవలం చదువుకునే చోటు మాత్రమే కాదని మంచి వ్యక్తులుగా ఎదిగే ప్లాట్‌ఫామ్ అని కోహ్లీ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా టీచర్లు తమ జీవితంలో కొంత భాగాన్ని విద్యార్థుల భవిష్యత్తు కోసం వెచ్చిస్తారని అటువంటి వారి పట్ల ఎంతో గౌరవం కలిగి ఉండాలని సూచించారు. నేర్చుకునే వాతావరణాన్ని, మీకు విద్యను నేర్పించే గురువులను గౌరవించినప్పుడే మీరు సరైన మార్గంలో పయనిస్తారని చెప్పారు. నేర్చుకోవాలనే తపన, వినే ఏకాగ్రత ఉంటేనే ఏదైనా సాధ్యమవుతుందని విద్యార్థులకు వివరించారు. కింగ్ కోహ్లీ చెప్పిన ఈ పాయింట్స్ విద్యార్థులను ఎంతగానో ఆలోచింపజేశాయి. తన చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ విరాట్ కొన్ని ఆసక్తికర విషయాలు చెప్పారు. తాను ఎనిమిదేళ్ల వయసు ఉన్నప్పుడే క్రికెట్ ప్రాక్టీస్ మొదలుపెట్టానని ఈ అకాడమీ తన జీవితంలో ఒక ముఖ్యమైన భాగమని తెలిపారు. ఇప్పటికీ సమయం దొరికినప్పుడల్లా తాను అకాడమీకి వస్తూనే ఉంటానని చెప్పారు. ఇక్కడ క్రికెట్ నేర్చుకోవడానికి వచ్చే పిల్లలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ అకాడమీ స్కూల్‌కు, ఇక్కడి క్రికెట్ సెటప్‌కు మంచి పేరు తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు కోహ్లీ తన ప్రసంగాన్ని ముగించారు. మరోవైపు ఐపీఎల్‌లో విరాట్ కోహ్లీ సరికొత్త రికార్డు సృష్టించారు. ఐపీఎల్ చరిత్రలో 9000 పరుగుల మార్క్ రికార్డును అందుకున్న తొలి ఆటగాడిగా విరాట్ మళ్లీ తానేంటో నిరూపించుకున్నాడు. సోమవారం దిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో దిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కోహ్లీ ఈ రికార్డును అందుకున్నాడు. మరో హైలెట్ ఏమిటంటే తన క్రికెట్ ప్రయాణం మొదలైన గ్రౌండ్‌లోనే ఈ అపురూపమైన రికార్డు నమోదు చేయడం విశేషం. కింగ్ కోహ్లీ ఫామ్ చూస్తుంటే ఈ సీజన్‌లో మరిన్ని రికార్డులు బద్దలవ్వడం ఖాయంగా కనిపిస్తోంది. గత ఏడాది సీజన్ ఐపీఎల్ ట్రోఫీని దక్కించుకున్న ఆర్?సీబీ ఈసారి కూడా అంతే పట్టుదలతో ఆడుతోంది.



## నా రీఎంట్రీని అడ్డుకుంటున్నారు

### స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్

రిటైర్మెంట్‌ను పక్కన పెట్టిన స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ 2028 ఒలింపిక్స్‌లో పోటీపడతానని ఇప్పటికే ప్రకటించింది. రెజ్లింగ్‌లోకి తన పునరాగమనాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నారంటూ తాజాగా ఆమె ఆరోపించింది. ఆసియా, వరల్డ్ ఛాంపియన్‌షిప్స్ ట్రయల్స్ గడువు సమీపిస్తోన్న నేపథ్యంలో ఆమె జాతీయ మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేసింది.నేషనల్ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లోకి తిరిగి రావాలని చూస్తున్నట్లు వినేశ్ ఫొగాట్ ప్రకటించింది. " నేషనల్ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో పునరాగమనం చేయాలని ఆశిస్తున్నా. రిజిస్ట్రేషన్ తుది గడువు ఏప్రిల్ 30 వరకు ఉంది. కానీ రిజిస్టర్ చేసుకోవాలని ప్రయత్నిస్తుంటే గడువు ముగిసింది అనే సందేశం వస్తోంది. దీనిపై రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలోని పాలనా యంత్రాంగాన్ని సంప్రదించేందుకు ప్రయత్నించాను. కానీ వారు నా కాల్స్‌కు స్పందించలేదు. ఫెడరేషన్ కప్‌లోను పాల్గొందామనుకున్నాను. కానీ అక్కడ చివరి నిమిషంలో ఎంపిక ప్రమాణాలు మార్చారు. దాంతో నేను ఆడలేకపోయాను. నన్ను ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవాలని చూస్తున్నారని అనిపిస్తోంది. ఆసియా గేమ్స్, వరల్డ్ ఛాంపియన్ షిప్ సెలక్షన్ ట్రయల్స్‌లో పోటీలో ఉండాలంటే ఈ టోర్నమెంట్ ఎంతో కీలకం" అని వినేశ్ ఆరోపించింది. అయితే, ఈ ఆరోపణలను రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చీఫ్ సంజయ్ సింగ్ తోసిపుచ్చారు. చాలా మంది రెజ్లర్లు రిజిస్ట్రేషన్ విషయంలో సమస్యలు ఎదుర్కొన్నారని, వారు ఫెడరేషన్ సిబ్బందిని సంప్రదించి సమస్యలు పరిష్కరించుకున్నారని చెప్పారు. "పోటీపడకుండా మేం ఎవరినీ అడ్డుకోం. టోర్నమెంట్ అందరికీ అందుబాటులో ఉంటుంది" అని సంజయ్ సింగ్ స్పష్టం చేశారు. వినేశ్ ఇప్పటికి పలుమార్లు ఒలింపిక్స్‌లో పోటీ పడ్డారు. 2016లో జరిగిన ఒలింపిక్స్‌తో ఆమె ఎంట్రీ ఇచ్చారు. అయితే అప్పట్లో మోకాలి గాయంతో క్వార్టర్స్ నుంచి వైదొలగాల్సి వచ్చింది. 2021లో భారీ అంచనాలతో టోక్యో ఒలింపిక్స్‌లోకి అడుగు పెట్టినప్పటికీ అక్కడా క్వార్టర్స్‌లోనే అనూహ్యంగా ఓటమి చవిచూశారు. 2024లో పారిస్ ఒలింపిక్స్ మహిళల 50 కేజీల విభాగంలో ఫైనల్‌కు చేరిన వినేశ్ ఫొగాట్?కు రజతం ఖాయమైంది. కానీ రెండో రోజు బరువు చూసే సమయానికి 100 గ్రాములు అదనంగా ఉండటంతో ఆమెపై అనర్హత వేటు పడి రజత పతకాన్ని కోల్పోయింది. ఈ బాధతోనే ఆమె రెజ్లింగ్‌కు రిటైర్‌మెంట్ ప్రకటించింది. తర్వాత రాజకీయాల్లోకి వచ్చిన ఆమె హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి, జులానా నియోజకవర్గం నుంచి విజయం సాధించింది. అప్పట్లో వినేశ్ ఫొగాట్‌పై వేటు వెనుక కుట్ర కోణం ఉందనే ఆరోపణలు వినిపించాయి. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేస్తూ అతడిని బహిష్కరించాలనే డిమాండ్‌తో అప్పట్లో దేశ రెజ్లర్లంతా ఏడాదికిపైగా ఆందోళన నిర్వహించారు. ఆ ఉద్యమానికి వినేశ్‌తోపాటు ఇతర స్టార్ రెజ్లర్లు బజరంగ్ పూనియా, సాక్షి మాలిక్ నేతృత్వం వహించారు. తీవ్ర స్థాయికి చేరిన ఆ ఉద్యమం చివరికి పార్లమెంట్ ముట్టడికి దారి తీయడం, ఆ క్రమంలో వినేశ్ సహా ఇతర రెజ్లర్లను పోలీసులు అరెస్ట్ చేయడం వరకు వెళ్లింది. రెజ్లర్ల ఆందోళన ఫలితంగా డబ్ల్యూఎఫ్‌ఐకి బ్రిజ్‌భూషణ్ రాజీనామా చేయక తప్పలేదు.



## ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులోకి మిచెల్ స్టార్క్

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభమై సగం మ్యాచ్‌లు ముగిసిన తర్వాత ఢిల్లీ క్యాపిటల్స్ అభిమానులకు ఊరటనిచ్చే వార్త అందింది. ఆస్ట్రేలియా స్టార్ ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ ఎట్టకేలకు తన ఫ్రాంచైజీతో చేరాడు. క్రికెట్ ఆస్ట్రేలియా నుంచి నిరభ్యంతర పత్రం లభించడంతో స్టార్క్ ఢిల్లీ జట్టులో చేరినట్లు యాజమాన్యం ధృవీకరించింది. మెగా వేలంలో రూ. 11.75 కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన ఈ స్టార్ బౌలర్ అందుబాటులోకి రావడం ఢిల్లీ బౌలింగ్ విభాగానికి కొండంత అండగా మారనుంది. మిచెల్ స్టార్క్ ఈ ఏడాది జనవరి చివరి వారం నుండి ఎటువంటి పోటీ క్రికెట్ ఆడలేదు. ఆస్ట్రేలియాలో జరిగిన బిగ్ బాష్ లీగ్ లో సిడ్నీ సిక్సర్స్ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న సమయంలో ఆయన గాయపడ్డారు. బౌండరీ వద్ద క్యాచ్ పట్టే ప్రయత్నంలో స్టార్క్ ఎడమ భుజం మరియు మోచేతికి తీవ్రమైన గాయమైంది. ఈ గాయం కారణంగా ఫిట్‌నెస్ సాధించడం ఆలస్యం కావడంతో, ఐపీఎల్ ప్రారంభ మ్యాచ్‌లకు ఆయన దూరం కావాల్సి వచ్చింది. ఇప్పటివరకు ఢిల్లీ ఆడిన ఎనిమిది మ్యాచ్‌ల్లో స్టార్క్ లేని లోటు స్పష్టంగా కనిపిస్తోంది. సోమవారం రాత్రి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్ అనంతరం ఢిల్లీ కెప్టెన్ అక్షర్ పటేల్ స్టార్క్ రాకపై స్పందించారు. "అవును, మిచెల్ స్టార్క్ జట్టుతో చేరారు. ఆయనకు మే 1వ తేదీ నుండి ఆడేందుకు ఎన్‌ఓసీ లభించింది. ప్రస్తుతానికి ఆయన వర్క్‌లోడ్‌ను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ఆయన పూర్తిగా అందుబాటులోకి వచ్చిన వెంటనే తుది జట్టులోకి తీసుకుంటాం" అని అక్షర్ పేర్కొన్నారు. గత సీజన్‌లో 11 మ్యాచ్‌ల్లో 14 వికెట్లు తీసి స్టార్క్ అద్భుతంగా రాణించారు. స్టార్క్ రాక వార్త ఒకవైపు సంతోషాన్ని కలిగిస్తున్నా, సోమవారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ ప్రదర్శన మాత్రం పీడకలలా మిగిలిపోయింది. ఆర్సీబీ బౌలర్ల ధాటికి ఢిల్లీ బ్యాటింగ్ ఆర్డర్ కుప్పకూలింది. పవర్‌ప్లేలోనే ఏకంగా ఆరు వికెట్లు కోల్పోయి 75 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ స్వల్ప లక్ష్యాన్ని ఆర్సీబీ వికెట్ కోల్పోకుండా సునాయాసంగా ఛేదించింది. ఈ ఘోర ఓటమిపై అక్షర్ పటేల్ అసహనం వ్యక్తం చేశారు. "అసలేం జరిగిందో నాకిప్పటికీ అర్థం కావడం లేదు. క్రికెట్‌లో ప్రతిరోజూ కొత్త సవాళ్లు ఎదురవుతాయి. ఈ ఓటమిని మర్చిపోయి వచ్చే మ్యాచ్‌పై దృష్టి సారించాల్సి ఉంది" అని ఆయన అన్నారు ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఏడో స్థానానికి పడిపోయిన ఢిల్లీ క్యాపిటల్స్, తన తదుపరి పోరులో మే 1వ తేదీన జైపూర్‌లోని సవాయ్ మాన్ సింగ్ స్టేడియంలో రాజస్థాన్ రాయల్స్‌తో తలపడనుంది. అదే రోజున స్టార్క్ అందుబాటులోకి వస్తుండటంతో, రాజస్థాన్ పటిష్టమైన బ్యాటింగ్ ఆర్డర్‌ను స్టార్క్ ఏ మేరకు అడ్డుకుంటాడో చూడాలి.

## బంతులు ఖచ్చితత్వంతో వేయాలి

**అప్పుడే వైభవ్ ని అడ్డుకోవచ్చు**

**మిడిల్, ఆఫ్ స్టంప్ మీదుగా సంధించాలి**


**టీమిండియా మాజీ క్రికెటర్ చేతేశ్వర్ పుజారా**

ఐపీఎల్‌లో నేడు మరో హైవెలాసిటీ మ్యాచ్ జరుగనుంది. ఈ సాయంత్రం చండీగఢ్ లో పంజాబ్ కింగ్స్ తో తలపడబోతోంది రాజస్థాన్ రాయల్స్. ఇప్పటివరకు ఓటమి ఎరుగని జట్టుగా ఉంటూ వస్తోన్న పీబీకేఎస్ ను వాళ్ల సొంత గడ్డపై రాజస్థాన్ రాయల్స్ ఎలా అడ్డుకుంటుందనేది ఈ రాత్రికి తేలిపోతుంది. పాయింట్ల పట్టిలో అగ్రస్థానంలో ఉన్న జట్లు ఇవి. పంజాబ్ టాప్ లో ఉండగా.. రాజస్థాన్ నాలుగో పొజిషన్ లో కొనసాగుతోంది. రాజస్థాన్ రాయల్స్ లో వైభవ్ సూర్యవంశీపైనే అందరి దృష్టి నిలిచిందనడంలో సందేహాలు అక్కర్లేదు. మొన్నటికి మొన్న సన్ రైజర్స్ హైదరాబాద్ పై సెంచరీ ఊది అవతలపడేశాడీ 15 సంవత్సరాల కుర్రాడు. అతన్ని అడ్డుకోవడంపైనే ఆ జట్టు భారీ స్కోర్ ఆధారపడి ఉంది. దీనికోసం పంజాబ్ కింగ్స్ ప్రత్యేకంగా వల పన్నడం ఖాయం. బౌలర్లు వేసే బంతులు ఖచ్చితత్వంతో కూడుకుని ఉండటం, సరైన్ లైన్ అండ్ లెంగ్త్ తో పడితేనే దాని ఫలితం ఉంటుంది.ఈ పరిస్థితుల మధ్య టీమిండియా మాజీ క్రికెటర్ చేతేశ్వర్ పుజారా తెరమీదికి వచ్చాడు. పంజాబ్ కింగ్స్ బౌలర్లకు కొన్ని సూచనలు చేశాడు. వైభవ్ సూర్యవంశీని త్వరగా అవుట్ చేసే విషయంలో ప్రత్యేకించి సీమర్ అర్షదీప్ సింగ్ కు చిట్కాలు ఇచ్చాడు. వైభవ్ సూర్యవంశికి బౌలింగ్ చేసేటప్పుడు మిడిల్, ఆఫ్ స్టంప్ మీదుగా బంతిని సంధించాలని చెప్పాడు. స్టార్ స్పోర్ట్స్ 'గేమ్ ప్లాన్' లో పుజారా మాట్లాడాడు. అర్షదీప్ బ్యాక్ ఆఫ్ లెంగ్త్ బౌలింగ్‌పై దృష్టి పెట్టాలని, స్లో బాల్స్, యార్కర్లను కూడా ప్రభావవంతంగా ఉపయోగించాలని సూచించాడు.

## శాంట్నర్ స్థానంలో కేశవ్ మహరాజ్

### ముంబయి జట్టులోకి రానున్న స్పిన్నర్

ఐపీఎల్ 2026లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్న ముంబయి ఇండియన్స్ కష్టాలు రెట్టింపయ్యాయి. ఆ జట్టు ప్రధాన స్పిన్ ఆల్‌రౌండర్ మిచెల్ శాంట్నర్ భుజం గాయం కారణంగా ఈ సీజన్ నుండి వైదొలిగారు. బౌండరీ లైన్ వద్ద క్యాచ్ పట్టే ప్రయత్నంలో ఆయనకు ఈ గాయమైంది. శాంట్నర్ స్థానంలో దక్షిణాఫ్రికా వెటరన్ స్పిన్నర్ కేశవ్ మహరాజ్‌ను ముంబయి జట్టులోకి తీసుకుంది. చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన హోమ్ మ్యాచ్‌లో శాంట్నర్ ఫీల్డింగ్ చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బౌండరీ వద్ద ఒక కఠినమైన క్యాచ్‌ను అందుకునే క్రమంలో ఆయన భుజానికి తీవ్రమైన గాయమైంది. అదే సమయంలో ఆయన తల కూడా బలంగా నేలకు తగిలింది. దీంతో ఆయనను మైదానం నుంచి వెలుపలికి తీసుకెళ్లాల్సి వచ్చింది. వాస్తవానికి అప్పటికే శాంట్నర్ తన 4 ఓవర్ల కోటాను పూర్తి చేసి, ఒక వికెట్ తీసి 44 పరుగులు సమర్పించుకున్నారు. శాంట్నర్ తలకు దెబ్బ తగలడంతో, నిబంధనల ప్రకారం శార్దూల్ ఠాకూర్‌ను కన్కషన్ సబ్‌స్టిట్యూట్‌గా జట్టులోకి తీసుకున్నారు. అయితే, ముంబయి అప్పటికే అల్లా గజన్ఫర్ స్థానంలో డానిష్ మలేవర్‌ను 'ఇంపాక్ట్ ప్లేయర్'గా ఉపయోగించుకుంది. 208 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో శార్దూల్ ఠాకూర్ 12 బంతుల్లో కేవలం 6 పరుగులు మాత్రమే చేయగలిగారు. ఈ మ్యాచ్‌లో ముంబయి 103 పరుగుల భారీ తేడాతో ఓటమిని చవిచూసింది. శాంట్నర్‌ను గత కొంతకాలంగా భుజం గాయం వేధిస్తోంది. ఏప్రిల్ 4న ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆయన బౌలింగ్ చేయని భుజానికి చిన్న గాయమైంది. దీనివల్ల ఏప్రిల్ 7న రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌కు ఆయన దూరమయ్యారు. ఏప్రిల్ 12న ఆర్సీబీతో మ్యాచ్‌లో పునరాగమనం చేసినప్పటికీ, ఏప్రిల్ 23న చెన్నైతో జరిగిన మ్యాచ్‌లో అదే భుజానికి మళ్ళీ గాయం కావడంతో ఈసారి టోర్నీ నుంచే తప్పుకోవాల్సి వచ్చింది. శాంట్నర్ స్థానాన్ని భర్తీ చేసేందుకు ముంబయి మేనేజ్‌మెంట్ దక్షిణాఫ్రికా స్పిన్నర్ కేశవ్ మహరాజ్‌ను ఎంపిక చేసింది. రూ. 75 లక్షల కనీస ధరకు ఆయనను ఒప్పందం చేసుకున్నారు. మహరాజ్ గతంలో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడారు. ప్రస్తుతం మంచి ఫామ్‌లో ఉన్న ఆయన, న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో అద్భుతంగా రాణించారు. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ కావడంతో శాంట్నర్ లోటును ఆయన కొంతవరకు భర్తీ చేస్తారని ముంబయి ఆశిస్తోంది. వరుస ఓటములతో పాయింట్ల పట్టికలో దిగువన ఉన్న ముంబయికి శాంట్నర్ వంటి అనుభవజ్ఞుడైన ఆటగాడు దూరం కావడం పెద్ద మైనస్. మరి కొత్తగా వచ్చిన కేశవ్ మహరాజ్ ముంబయి రాతను మారుస్తారో లేదో చూడాలి.



# విశ్వేజి



## కాస్మోటిక్స్‌తో కాదు ఈ ఆహారాలతో మీ చర్మానికి నిగారింపు.. ట్రై చెయ్యండి!

చాలామంది చర్మం అందంగా ఉండడం కోసం, ఆరోగ్యంగా ఉండడం కోసం రకరకాల ప్రయోగాలు చేస్తారు. చర్మం నికారింపును సొంతం చేసుకోవడానికి రకరకాల కాస్మోటిక్స్ ను ఉపయోగిస్తారు. అయితే ఎటువంటి సౌందర్య క్రీములు ఉపయోగించకుండా కేవలం మంచి ఆహారంతోనే చర్మం మెరిసిపోయేలా చేయవచ్చని చెబుతున్నారు వైద్య నిపుణులు. చర్మానికి ఆహారంతో పోషణ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి అవసరమైన పోషణ అందించడానికి కొన్ని ఆహారాలు ఎంతగానో దోహదం చేస్తాయని చెబుతున్నారు. చర్మ సౌందర్యాన్ని మరింత పెంచే, అద్భుతమైన నిగారింపును ఇచ్చే అటువంటి ఆహారం గురించి ప్రస్తుతం మనం తెలుసుకుందాం. మనం తినే ఆహారంలో పోషకాలు పుష్కలంగా ఉండే ఆహారాలు చర్మ ఆరోగ్యానికి దోహదం చేస్తాయి. అవకాడో చర్మం ఆరోగ్యంగా అందంగా ఉండాలంటే, నిగారింపును సొంతం చేసుకోవాలంటే అవకాడో ఎంతగానో దోహదం చేస్తుంది. అవకాడోలో విటమిన్ ఏ, విటమిన్ సి, విటమిన్ ఈ పుష్కలంగా లభిస్తాయి. ఇది మీ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతాయి. ముఖం మీద ముడతలను నివారిస్తాయి. ఆకుకూరలు కూరగాయలు చర్మం ఆరోగ్యంగా ఉండడానికి ఆహారంలో బచ్చలికూరతో పాటు పాలకూర, తోటకూర వంటి ఆకుకూరలు ఎంతగానో దోహదం చేస్తాయి.ఇక ఆహారంలో గుమ్మడికాయ, దోసకాయ, టమాటా వంటి కూరగాయలు కూడా చర్మ ఆరోగ్యానికి ఉపయోగపడతాయి. వాటర్ కంటెంట్ ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయలను తింటే అవి చర్మాన్ని తేమగా ఉంచడంలో సహాయపడతాయి ఫలితంగా చర్మం నిగారింపును సొంతం చేసుకుంటుంది. నట్స్ మరియు సీడ్స్ బాదంపప్పు, జీడిపప్పు వంటి వివిధ రకాల డ్రై ఫ్రూట్స్ ను తింటే చర్మం నిగారింపును సొంతం చేసుకుంటుంది. బయోటిన్, ప్రోటీన్, విటమిన్ ఈ తో ఉన్న నట్స్, సీడ్స్ మన చర్మాన్ని రక్షిస్తాయి. వృద్ధాప్య ప్రభావాలను తగ్గిస్తాయి. నీరు ఎక్కువ తీసుకోవడం వయసు పెరిగే కొద్దీ చర్మం పైన ముడతలు సహజంగా వస్తూ ఉంటాయి. అయితే రోజు శరీరానికి కావాల్సినంత నీటిని ఇస్తే ఇవి ముడతలు రాకుండా చేసి చర్మం హైడ్రేటెడ్ గా బిగుతుగా ఉండేలా చూస్తాయి. మీరు ఎక్కువగా నీటిని తాగడం వల్ల రక్తప్రసరణ కూడా మెరుగు అవుతుంది. అంతేకాదు ఇది చర్మానికి నిగారింపును ఇస్తుంది.


## డయాబెటిస్ ఉంటే కొబ్బరినీళ్ళు తాగొచ్చా?

కొబ్బరి నీరు ఆరోగ్యానికి చాలా మంచిది. కొబ్బరి నీళ్లలో ఉండే హైడ్రేటింగ్ లక్షణాలు మరియు పోషక పదార్థాలు మన శరీరానికి కావలసిన శక్తినిస్తాయి. అయితే, మధుమేహం ఉన్నవారు కొబ్బరి నీళ్లు తాగొచ్చా? కొబ్బరి నీళ్లు తాగితే షుగర్ పెరుగుతుందా? వంటి అనుమానాలతో ఉంటారు . కొబ్బరి నీళ్లు తాగితే మధుమేహ వ్యాధిగ్రస్తుల రక్తంలో చక్కెర పెరుగుతుందా? తెలుసుకోవాలంటే ఈ కథనాన్ని చదవండి. కొబ్బరి నీళ్ళలో ఫుల్ పోషకాలు కొబ్బరి నీరు తక్కువ కేలరీలు కలిగి ఉంటుంది. కొబ్బరి నీళ్లలో సహజ చక్కెరలు, ఎలక్ట్రోలైట్లు మరియు ఖనిజాలు ఉంటాయి. ఇది పొటాషియం, మెగ్నీషియం మరియు విటమిన్ %జ% ని అందిస్తుంది. ఈ పోషకాలు మొత్తం ఆరోగ్యానికి మద్దతుని ఇస్తాయి. డయాబెటిస్ లేనివారికి కొబ్బరి నీళ్ళు మంచి పోషకాలతో కూడిన పానీయం. అయితే మధుమేహంతో బాధపడే వారు మాత్రం కొబ్బరి నీళ్ల విషయంలో కాస్త జాగ్రత్తగానే ఉండాలి. రక్తంలో చక్కెరపై ప్రభావం కొబ్బరి నీళ్లలో ఉండే సహజ చక్కెర కంటెంట్ కారణంగా ఇది రక్తంలో చక్కెరను నిదానంగా పెంచుతుంది. కొబ్బరి నీరు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగి ఉండడం వల్ల రక్తంలో చక్కెరను నెమ్మదిగా పెంచుతుంది. అయితే, గ్లూకోజ్ స్థాయిలలో పెరుగుదలను నివారించడానికి కొబ్బరినీళ్ళ విషయంలో జాగ్రత్త పాటించడం అవసరం. %ూశీషవతీవస దీఎ% మధుమేహ రోగులకు కొబ్బరి నీళ్ళతో ప్రయోజనాలు, కానీ కొబ్బరి నీటిలోని ఎలక్ట్రోలైట్లు హైడ్రేషన్‌ను నిర్వహించడంలో సహాయపడతాయి. ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులకు చాలా అవసరం. పొటాషియం రక్తపోటును నియంత్రించడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని మద్దతు ఇస్తుంది. మెగ్నీషియం ఇన్సులిన్ సున్నితత్వానికి సహాయపడుతుంది, గ్లూకోజ్ నియంత్రణకు ప్రయోజనం కలిగిస్తుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులకు కొబ్బరి నీళ్లను తాగితే ప్రయోజనాలు ఉంటాయి, కానీ బాగా ఎక్కువగా తాగడం మాత్రం మంచిది కాదు. ఇలా ఉంటే కొబ్బరి నీళ్ళు తాగొద్దు కొబ్బరి నీళ్లను తాగిన తర్వాత కూడా చక్కెర స్థాయిలను పర్యవేక్షించటం కూడా అవసరం.కొబ్బరి



నీళ్ళను డయాబెటిస్ బాధితులు తీసుకోవాలి అనుకుంటే వైద్యుల సలహా మేరకు తీసుకుంటే మంచిది. డయాబెటిస్ బారిన పడిన, ముఖ్యంగా మూత్ర పిండాల సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారు కొబ్బరి నీళ్ళ జోలికి వెళ్ళకుండా ఉంటేనే మంచిది.

## పచ్చి బొప్పాయితో ఆరోగ్య అద్భుతాలు.. తెలిస్తే వదిలిపెట్టరు!



బొప్పాయి పండు మాత్రమే కాదు పచ్చి బొప్పాయి కాయ కూడా మనకు ఎంతో ఆరోగ్య ప్రయోజనాలను కలిగిస్తుంది. పచ్చి బొప్పాయి లో ఉండే పోషకాలు అన్ని ఇన్ని కాదు. పచ్చి బొప్పాయి లో కొవ్వులు, కార్బోహైడ్రేట్లను విచ్చిన్నం చేసే ఛైమో పాపైన్, పాపైన్ వంటి సహజ ఎంజైమ్స్ ఉంటాయి. పచ్చి బొప్పాయి కాయలో ఉండే ఫైబర్ న్యూట్రియంట్లు మన ఆరోగ్యానికి ఎంతగానో మేలు చేస్తాయి. పచ్చి బొప్పాయితో ఈ హెల్త్ బెనిఫిట్స్ పచ్చి బొప్పాయిలో యాంటీ ఆక్సిడెంట్ లు, విటమిన్లు మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. పచ్చి బొప్పాయి తినడం వల్ల మన జీర్ణ ప్రక్రియ మెరుగుపడుతుంది. బొప్పాయి కాయ మన శరీరాన్ని శుభ్రం చేయడంలో ఎంతగానో దోహదం చేస్తుంది. గ్యాస్ సమస్యలను, అజీర్ణాన్ని, కడుపు ఉబ్బరాన్ని తగ్గిస్తుంది. పచ్చి బొప్పాయి కాయ మలబద్ధకాన్ని నివారిస్తుంది. మన శరీరంలో నుండి టాక్సిన్స్ ను బయటకు పంపుతుంది. పచ్చి బొప్పాయితో ఈ సమస్యలకు చెక్ పచ్చి బొప్పాయి కాయ మన శరీర కొత్త కణాలను నిర్మించడానికి వాటిని మరమ్మతు చేయడానికి ఎంతగానో దోహదం చేస్తుంది. గొంతు ఇన్ఫెక్షన్, శ్వాసకోశ ఇన్ఫెక్షన్, రుతుస్రావ సమస్యల వల్ల శరీరంలో కలిగే నొప్పులు, వాపులు, మంటలను పచ్చి బొప్పాయి కాయ సమర్థవంతంగా తగ్గిస్తుంది. పచ్చి బొప్పాయి గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. పచ్చి బొప్పాయిలో పొటాషియం, ఫైబర్, ఫోలేట్ ఉంటాయి. పచ్చి బొప్పాయితో క్యాన్సర్ నుండి రక్షణ పచ్చి బొప్పాయి కాయ రక్తపోటుని తగ్గించడంతో పాటు గుండె జబ్బుల ప్రమాదాన్ని కూడా తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. పచ్చి బొప్పాయి కాయ మగవారికి ఎంతో ఉపయోగపడుతుంది. పురుషులలో వచ్చే ప్రోస్టేట్ క్యాన్సర్, పెద్ద పేగు క్యాన్సర్ వంటి క్యాన్సర్ల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఇందులో ఉండే డైటరీ ఫైబర్ పెద్ద పేగుల్లో ఉండే టాక్సిన్స్ ను బయటకు పంపుతుంది. 'ఆ డైరెక్టర్ వలలో చిక్కిన మోనాలిసా.. హీరోయిన్ ను చేస్తానని చెప్పి..' ఆహారంలో పచ్చి బొప్పాయితో మేలు ఇన్ని ఆరోగ్య ప్రయోజనాలను ఇచ్చే పచ్చి బొప్పాయి కాయను ఆహారంలో భాగంగా చేసుకుంటే ఎంతో మంచిది. పచ్చి బొప్పాయి కాయను కూరగా వండుకుని, పచ్చడి చేసుకుని, వివిధ రకాలుగా మనం ఆహారంలో భాగంగా చేసుకోవచ్చు.


# మార్కెట్

## అమల్లోకి ఫాస్టాగ్ కొత్త రూల్స్.. పాటించకపోతే అంతే సంగతులు

జాతీయ రహదారులపై ఫాస్టాగ్ లావాదేవీలకు సంబంధించి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కొత్త నిబంధనలు తీసుకువచ్చిన విషయం తెలిసిందే. టోల్ గేట్ల వద్ద లావాదేవీలు సులువుగా జరిగేలా, మోసాలు నివారించేలా తీసుకువచ్చిన ఈ నిబంధనలు నేటి నుంచి అమల్లోకి వచ్చాయి. కొత్త రూల్స్ ప్రకారం. వాహనం టోల్ బూత్‌కు చేరడానికి ముందు 60 నిమిషాల కంటే ఎక్కువ సేపు ఫాస్టాగ్ బ్లాక్‌లిస్ట్ అయి ఉన్నా, హాట్‌లిస్ట్‌లో ఉన్నా, బ్యాలెన్స్ తక్కువగా ఉన్నా టోల్ బూత్ వద్ద ఫాస్టాగ్ లావాదేవీ విఫలమవుతుంది. టోల్ బూత్ వద్ద స్కాన్ చేసిన తర్వాత 10 నిమిషాల వరకు ఫాస్టాగ్ ఇన్‌యాక్టివ్‌గా ఉన్నా లావాదేవీ తిరస్కరణకు గురవుతుంది. ఈ రెండు సందర్భాల్లో 176 ఎర్రర్ కోడ్‌తో లావాదేవీ విఫలమవుతుంది. ఇలా అయితే, వాహనానికి జరిమానా కింద రెట్టింపు టోల్ చార్జ్ పడుతుంది. ఈ రూల్స్‌కు అనుగుణంగా వాహనదారులు ముందుగానే జాగ్రత్త పడటం మంచిది. లేదంటే మీ జేబులకు చిల్లు పడటం ఖాయం.




## పసిడి ప్రియులకు గుడ్‌న్యూస్.. భారీగా పతనమైన ధరలు..



### హైదరాబాద్‌లో ధరలివే..!

పసిడి ప్రియులకు గుడ్‌న్యూస్. బంగారం ధరలు ఇటీవల గతంలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయికి చేరిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ధరలు దిగి వస్తున్నాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో స్టాకిస్టులు అమ్మకాలకు దిగుతున్నారు. ఐదురోజుల తర్వాత సోమవారం దేశ రాజధాని ఢిల్లీ నగరంలో బంగారం ధరలు ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి నుంచి పతనమయ్యాయి. 24 క్యారెట్ల బంగారంపై రూ.900 తగ్గి తులానికి రూ.1,02,520కి చేరింది. అలాగే, 22 క్యారెట్ల గోల్డ్ ధర సైతం రూ.900 తగ్గడంతో తులానికి రూ.1,02,100కి చేరుకుంది. అయితే, బంగారం గత ఐదు ట్రేడింగ్ సెషన్లలో బంగారం ధర రూ.5800 పెరిగిందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ధ్రువీకరించింది. మార్కెట్‌లో బంగారానికి డిమాండ్ తగ్గడంతో ధర దిగివస్తుందని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. రష్యా ఉక్రెయిన్ మధ్య యుద్ధం కొనసాగుతుండగా.. ట్రంప్ శాంతి ప్రయత్నాల నేపథ్యంలో చర్చలకు రష్యా అధ్యక్షుడు పుతిన్ అంగీకరించారు. అలాస్కాలో కలిసేందుకు అంగీకరించడంతో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయని, దాంతో విలువైన ఆస్తులకు డిమాండ్ తగ్గినట్లు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ విశ్లేషకుడు (కమోడిటీస్) సౌమిల్ గాంధీ పేర్కొన్నారు. గోల్డ్ బార్స్‌పై 39శాతం సుంకాలకు సంబంధించి వైట్‌హౌస్ స్పష్టతనివ్వడంతో ధరలపై ఒత్తిడి తెచ్చిందని తెలిపారు. సోమవారం వెండి ధర కిలోకు రూ.1000 తగ్గి రూ.1,14,000కి చేరుకుంది. వెండి సైతం గత ఐదురోజుల్లో కిలోకు రూ.2,500 పెరిగిన విషయం తెలిసిందే. న్యూయార్క్‌లో గోల్డ్ ఫ్యూచర్ ఔన్స్‌కు 40.61 డాలర్లు తగ్గి 3,358.17కి చేరుకుంది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో అక్టోబర్ కాంట్రాక్టుకు సంబంధించిన గోల్డ్ ఫ్యూచర్స్ 10 గ్రాములకు తగ్గి 1.26శాతం తగ్గి రూ.1,00,518 వద్ద ట్రేడవుతున్నది. కోటక్ సెక్యూరిటీస్‌లోని కమోడిటీ రీసెర్చ్ ఏవీపీ కైనత్ చైన్వాలా తెలిపిన ప్రకారం.. బంగారం ఒకశాతానికి తగ్గింది. గతవారంలో ధరల పెరుగుదల లాభాలన్నింటిని తుడిచిపెట్టేశాయి. బంగారం ఉత్పత్తులపై సుంకాలపై వచ్చిన వార్తలన్నీ తప్పుడు సమాచారంగా ట్రంప్ పరిపాలన పేర్కొనగా.. మార్కెట్ వర్గాలన్నీ మరింత స్పష్టత కోసం ఎదురుచూస్తున్నాయి. స్పాట్ సిల్వర్ 1.39 శాతం తగ్గి ఔన్సుకు 37.81 డాలర్లకు చేరింది. ఏంజెల్ వన్‌లో వ్యవసాయేతర వస్తువులు, కరెన్సీల డీవీపీ పరిశోధన నిపుణుడు ప్రథమేష్ మాల్యా మాట్లాడుతూ సుంకాలు ప్రపంచవ్యాప్తంగా గందరగోళాన్ని సృష్టించాయన్నారు. మరింత పెరిగితే అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధర మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఔన్స్‌కు 3800 డాలర్ల వరకు చేరుకోవచ్చన్నారు. రాబోయే మూడు నెలల్లో ఎంసీఎక్స్ ఫ్యూచర్ పది గ్రాములకు రూ.1.10లక్షలకు చేరుకునే అవకాశం ఉందని చెప్పారు. ఇక హైదరాబాద్‌లో బంగారం ధరల విషయానికి వస్తే 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ.1,02,280 పలుకుతుండగా.. 22 క్యారెట్ల పుత్తడి రూ.93,750గా ఉన్నది. కిలో వెండి రూ.1.27లక్షలు పలుకుతున్నది.

## యాపిల్ కన్నా.. రిలయన్సే మిన్న

**అత్యుత్తమ బ్రాండ్లలో ప్రపంచంలోనే రెండో స్థానం**

**ఫ్యూచర్‌బ్రాండ్ ఇండెక్స్‌లో చోటు దక్కించుకున్న ఏకైక భారతీయ సంస్థ**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: యాపిల్, నైక్ తదితర గ్లోబల్ దిగ్గజ బ్రాండ్లను వెనక్కునెట్టి భారతీయ సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ అత్యుత్తమ బ్రాండ్ల జాబితాలో దూసుకుపోయింది. తాజాగా విడుదలైన ఫ్యూచర్‌బ్రాండ్ ఇండెక్స్ 2024 లిస్టులో సామ్‌సంగ్ తర్వాత బెస్ట్ బ్రాండ్‌గా ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ రెండో స్థానంలో నిలిచింది. ఆ తర్వాతే యాపిల్, నైక్, వాల్ట్ డిస్నీ, నెట్‌ఫ్లిక్స్, మైక్రోసాఫ్ట్, ఇంటెల్, టొయోటా వంటి ప్రముఖ సంస్థలుండటం గమనార్హం. కాగా, 2023తో పోల్చితే 2024లో సామ్‌సంగ్ 5వ స్థానం నుంచి నెంబర్ 1కు చేరింది. ఇక రిలయన్స్ 13 నుంచి 2కు వచ్చింది. అయితే యాపిల్ 1 నుంచి 3కు దిగజారింది. 2014లో అగ్రస్థానంలో ఉన్న గూగుల్.. 2024లో 57కు పడిపోయింది. మెటా కూడా 11 నుంచి 52కు దిగొచ్చింది. బోయింగ్, ఫోక్స్‌వాగన్ సంస్థలకైతే తాజా ర్యాంకింగ్స్‌లో చోటే లేకుండా పోయింది. ఇదిలావుంటే ఈసారి జాబితాలో రిలయన్స్ మినహా మరే ఇతర భారతీయ సంస్థలు లేవు. 'గడిచిన దశాబ్దానికిపైగా ఫ్యూచర్‌బ్రాండ్ ఇండెక్స్.. విజయవంతమైన బ్రాండ్లు మనుగడ సాగించడంపైనేగాక, నిలకడైన వృద్ధిని ఎలా నిలబెట్టుకుంటున్నాయో తెలియపరుస్తున్నది' అని నిర్వాహకులు ఈ సందర్భంగా అన్నారు. కాగా, ఫ్యూచర్‌బ్రాండ్ ఇండెక్స్.. ఓ వార్షిక అధ్యయనం. మార్కెట్ క్యాపిటలైజేషన్, మరికొన్ని అంశాల ద్వారా టాప్-100 కంపెనీలతో ఓ జాబితాను సిద్ధం చేస్తుంది.



# ఆంధ్రప్రదేశ్

## చిత్తూరు జిల్లా వి.కోటలో దారుణం

### ఎబిఎన్ జర్నలిస్టును హత్య చేసిన రౌడీ షీటర్

### దర్యాప్తు చేపట్టిన పోలీసులు

చిత్తూరు,ఏప్రిల్28 : వి.కోటలో ఎబిఎన్ ఆంధ్రజ్యోతి జర్నలిస్టు జగన్మోహన్ రెడ్డి దారుణ హత్యకు గురయ్యారు. మంగళవారం ఉదయం వాకింగ్ చేస్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి జగన్‌ను కత్తులతో నరికి చంపేశారు. ఆపై అక్కడి నుంచి పరారయ్యారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. హత్యకు పాల్పడింది రౌడీ షీటర్ తమీమ్‌గా గుర్తించారు. తమీమ్‌కు మరో వ్యక్తి సాయపడినట్లు పోలీసులు వెల్లడించారు. తమీమ్‌ది వి.కోట అయినప్పటికీ ప్రస్తుతం కర్ణాటకలో నివాసం ఉంటున్నాడు. మృతుడు జగన్మోహన్ రెడ్డి ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సంస్థలో జర్నలిస్టుగా పనిచేస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి హత్యను జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ప్రజాస్వామ్యంలో ఇటువంటి సంఘటనలు సిగ్గుచేటని ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరం తిరుపతి జిల్లా సభ్యుడు అరవ గోపాల్ అన్నారు. ఏదైనా సమస్య ఉంటే చర్చించి పరిష్కరించుకోవాల్సిన మార్గాలు చాలా ఉన్నాయని... అలా కాదని దుర్మార్గమైన, దురహంకారమైన ఆలోచనలతో తోటి మనిషిని చంపడం బాధాకరమన్నారు. ఇలాంటి వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తోటి విలేకరి చనిపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ 'ఆంధప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరం' తరపున అరవ గోపాల్ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఃత్తూరు జిల్లా ఆంధ్రజ్యోతి రిపోర్టర్ జగన్మోహన్ రెడ్డి హత్యను ఆంధప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ తిరుపతి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చెంగల్రాయులు (గాంధీ), వళిగళం గోపిలు తీవ్రంగా ఖండించారు. హత్య చేసిన దుండగులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. హత్య వెనకున్నది ఎవరైనా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని హత్య వెనుకున్న అసలు నిందితులను అరెస్ట్ చేసి శిక్షించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫెడరేషన్ జర్నలిస్టుల ఆందోళనకు ఆ సంఘం అధ్యక్షులు జి ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఒక సామాన్య జర్నలిస్టును అతికిరాతంగా చంపడం దారుణమని అన్నారు. చిత్తూరు జిల్లా పోలీసులు వెంటనే హత్య వెనుక దాగి ఉన్న కుట్రను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. జగన్మోహన్ రెడ్డి హత్యను జర్నలిస్ట్ సంఘాలు జీర్ణించుకోలేకపోతున్నాయని చెంగల్రాయులు, వళిగళం గోపి ఆవేదన వ్యక్తం చేశారు.

## కాలేజీ కోసం ప్రభుత్వం రోడ్డు

### హైకోర్టు ఆగ్రహం..సిఐడి విచారణకు ఆదేశం

అమరావతి,ఏప్రిల్28 : కడప జిల్లా ప్రొద్దుటూరులో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఓ ప్రైవేట్ కాలేజీ కోసం.. లే అవుట్‌లో ప్రభుత్వ నిధులతో రహదారి వేశారు. దీనిపై ఏపీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారంటూ.. సీఐడీ విచారణకు హైకోర్టు ఆదేశించింది. ఈ అంశంపై కోర్టులో మంగళవారం విచారణ జరిగింది. ఈ నేపథ్యంలో ఏపీ హైకోర్టు పైవిధంగా స్పందించింది. తమ అనుమతి లేకుండా రహదారి వేశారంటూ లే అవుట్‌లోని పలువురు భూ యజమానులు హైకోర్టును గతంలో ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపి నివేదిక అందించాలంటూ జిల్లా కలెక్టర్‌ను హైకోర్టు ఆదేశించింది. రహదారి వేసే సమయంలో ఎవరూ అభ్యంతరం చెప్పలేదని.. కానీ ప్రైవేట్ భూముల్లో భూ సేకరణ చేయకుండానే ఈ రోడ్డు వేశారంటూ కోర్టుకు జిల్లా కలెక్టర్ నివేదిక అందజేశారు. రోడ్డు నిర్మాణం వల్ల ప్రభుత్వ ధనం దుర్వినియోగమైందని కోర్టు స్పష్టం చేసింది. దీనికి ఆ సమయంలో ఉన్న అధికారులు, కౌన్సిల్ చైర్మన్‌తో పాటు సభ్యులు కారణమయ్యారని స్పష్టం చేసింది. ప్రభుత్వ ధనం దుర్వినియోగం కావడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై సీఐడీ విచారణ చేపట్టాలని హైకోర్టు ఆదేశించింది. 2021లో వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ లే అవుట్‌లో రహదారి నిర్మాణం జరిగినట్లు తెలుస్తోంది.

## నేడు బెల్లంకొండ సాయిశ్రీనివాస్ వివాహం

### బంధువుల సమక్షంలో తిరుమలలో పెళ్లిబాజాలు

తిరుపతి,ఏప్రిల్28 : టాలీవుడ్ యంగ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ఒక ఇంటివాడు కాబోతున్నాడు. కావ్య అనే యువతితో కలిసి ఆయన వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టనున్నాడు. వీరికి పెళ్లికి సంబంధించిన ముహూర్తం ఖరారైంది. 29వ తేదీ బుధవారం రాత్రి 11:13 గంటలకు తిరుమల పుణ్యక్షేత్రంలో శ్రీవారి సాక్షిగా అత్యంత వైభవంగా వీరి వివాహ వేడుక జరగబోతున్నట్లు సమాచారం. సంప్రదాయబద్ధంగా సాగే ఈ వైదిక వేడుక కోసం వధూవరులిద్దరూ ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ శ్రవణ్ కుమార్ ప్రత్యేకంగా రూపొందించిన వస్త్రాలను ధరించబోతున్నారు. తిరుమలలో కేవలం కుటుంబ సభ్యులు మరియు అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ పెళ్లి వేడుక జరగనుంది. అనంతరం మే నెలలో హైదరాబాద్‌లో చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖులు, రాజకీయ నాయకులు ,బంధుమిత్రుల కోసం భారీ ఎత్తున రిసెప్షన్ నిర్వహించబోతున్నారు

## శ్రీవారిని దర్శించుకున్న ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్

### దర్శనానంతరం పండితుల వేదాశీర్వచనం

తిరుమల,ఏప్రిల్28 : భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో పాటు తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, సీవీఎస్‌ఓ మురళీకృష్ణ, టిటిడి సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి, అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఉపరాష్ట్రపతి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆ తర్వాత వకుళామాత, విమాన వేంకటేశ్వరస్వామి, భాష్యకార్ల సన్నిధి, యోగా నరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో భారత ఉపరాష్ట్రపతికి పండితులు వేదాశీర్వచనం చేయగా.. తితిదే ఛైర్మన్, ఈవో స్వామి వారి చిత్ర పటాన్ని, తీర్థప్రసాదాలను అందించారు. సోమవారం విశాఖ ఆంధ్రావర్సిటీ శతాబ్ది ఉత్సవాల్లో ఉపరాష్ట్రపతి పాల్గొన్నారు. అక్కడి నుంచి నేరుగా ఇక్కడికి చేరుకున్నారు. ఆయనకు స్థానిక నేతలు, అధికారులు స్వాగతం పలికారు.

## తరుపేరుతో రైతుల లూటీ

### ఆందోళనకు దిగిన రైతులు

నల్లగొండ,ఏప్రిల్28 :గట్టుప్పల్ మండలంలోని తెరట్పల్లి గ్రామంలో రైతు సేవా సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రం వద్ద రోడ్డుపై కూర్చొని రైతులు ధర్నా చేశారు. తేమ, తరుగు పేరుతో క్వింటాకు 8 కిలోలు కోత విధిస్తున్నారని వాపోయారు. ధాన్యం కోత వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు.

## జిల్లాలో సాధారణ స్థితికి పెట్రోల్, డీజిల్‌కు సరఫరా..

### ప్రత్యేక కంట్రోల్ రూమ్ ద్వారా పెట్రోల్ డీజిల్ సరఫరా పర్యవేక్షణ..

### వినియోగదారుల అవసరాలకు అందుబాటులో పెట్రోల్ డీజిల్..

### జిల్లాలో ప్రతి రోజు 8 లక్షల డీజిల్ 6 లక్షల పెట్రోల్ సరఫరా..

### జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ.



విజయవాడ,ఏప్రిల్28 : జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫరా పూర్తిగా సాధారణ స్థితికి చేరుకుందని ప్రస్తుతం ఎటువంటి కొరత లేకుండా ఇంధనం సమృద్ధిగా అందుబాటులో ఉందని వినియోగదారులు ఎటువంటి అందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ డా.జి. లక్ష్మీశ తెలిపారు. జిల్లాలో పెట్రోల్ డీజిల్ సరఫరా పై కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ పర్యవేక్షణ నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం నిడమానూరులో హెచ్‌పిసిఎల్, బిపిసిఎల్, ఐఓసిఎల్ బంకులను ఎనికెపాడులోని హెచ్‌పిసిఎల్ బంకును రామవరప్పాడులోని ఐఓసిఎల్ బంకులలో పెట్రోల్ డీజిల్ నిల్వలు సరఫరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల వదంతుల కారణంగా పెట్రోల్ డీజిల్ కొరత ఏర్పాటుడుందనే అపోహలతో వినియోగదారులు బయాందోళనలకు గురై అవసరాలకు మించి డీజిల్ పెట్రోల్ కొనుగోళ్ళు చేయడంతో కొంత ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదురయ్యాయన్నారు. డీజిల్ పెట్రోల్ సజావుగా వినియోగదారులకు అందజేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచనల మేరకు జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యల కారణంగా పెట్రోల్ డీజిల్ సరఫరా సాధారణ స్థితికి చేరుకోవడం జరిగిందన్నారు. ఇంధన సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి జిల్లాలోని పెట్రోల్ బంక్‌ల వద్ద సరఫరా పరిస్థితిని క్రమం తప్పకుండా సమీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పెట్రోల్, డీజిల్ సరఫరా కొనసాగుతున్నదని, ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. అపోహాలు, అసత్య ప్రచారాలను నమ్మకుండా అవసరమైన మేరకు మాత్రమే ఇంధనం వినియోగించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ప్రతి రోజు సుమారు 8 లక్షల లీటర్ల డీజిల్, 6 లక్షల లీటర్ల పెట్రోల్ సరఫరా జరుగుతోందని కలెక్టర్ వెల్లడించారు. ఆయిల్ కంపెనీలతో సమన్వయం చేసుకుంటూ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రెవెన్యూ పోలీస్ వ్యవసాయ తదితర శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి, ఎక్కడా ఇంధన కొరత ఏర్పడకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారన్నారు. ఈకారణంగా పెట్రోల్ బంకుల వద్ద క్యూ లైన్‌లలో వాహనాలు నిలబడాల్సిన అవసరం లేకుండా తక్షణమే ఆయిల్ పొందగలుగుతున్నారన్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ కంపెనీలలో పెట్రోల్ డీజిల్ అవసరాల మేరకు నిల్వలతో సిద్దంగా ఉన్నాయని తెలిపారు. బంకులలో ఆయిల్ అయిపోయిన రెండు గంటలలోపే ట్యాంకర్లతో ఆయిల్ సరఫరా చేసేలా మోనిటరింగ్ చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి, అవసరానికి తగినంత మాత్రమే ఇంధనం కొనుగోలు చేయాలని సూచించారు. జిల్లాలో ఇంధన సరఫరా పూర్తిగా నియంత్రణలో ఉందని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం, ఆయిల్ కంపెనీలు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో సరఫరా వ్యవస్థను సమర్థంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇంధన సరఫరాపై ఎలాంటి సమస్యలు ఎదురైనా సంబంధిత అధికారులకు తెలియజేయాలని, ఇందుకోసం కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని వినియోగదారులకు ఇబ్బంది తలెత్తిన పక్షంలో 9154970454 నందు సంప్రదించవచ్చని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సూచించారు. ఆయిల్ బంకుల పర్యవేక్షణలో జిల్లా కలెక్టర్ వెంట విజయవాడ రూరల్ తహాశీల్దార్ బి. సుగుణ, రెవెన్యూ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎఐ యుగంలో గూగుల్ డేటా సెంటర్ కీలకం

### గ్లోబల్ ఏఐ ఎకానమీ దిశగా ఆంధ్రప్రదేశ్ పరుగులు

### గూగుల్ క్లౌడ్, గ్లోబల్ ఇన్‌ఫ్రా వైస్ ప్రెసిడెంట్ బికాస్ కోలే

విశాఖపట్నం,ఏప్రిల్ 28 : ఆనందపురం మండలం తర్లువాడలో గూగుల్ ఏఐ డేటా సెంటర్‌కు శంకుస్థాపన జరిగింది. మంగళవారం ఉదయం కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌తో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భూమి పూజ చేశారు. వన్ గిగా వాట్ సామర్థ్యంతో రూ.1.35 లక్షల కోట్ల భారీ పెట్టుబడితో మెగా డేటా సెంటర్‌ను గూగుల్ సంస్థ ఏర్పాటు చేయనుంది. డేటా సెంటర్‌కు తర్లువాడ, అడవివరం, రాంబిల్లిలో మొత్తం 600 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. అన్ని రకాల అనుమతులను సర్కార్ క్లియర్ చేసింది. ఈ సందర్భంగా గూగుల్ క్లౌడ్, గ్లోబల్ ఇన్‌ఫ్రా వైస్ ప్రెసిడెంట్ బికాస్ కోలే మాట్లాడుతూ... గూగుల్ ఇండియా ఏఐ హబ్‌కు ఇవాళ చేసిన శంకుస్థాపన 2047 వికసిత్ భారత్‌కు ఓ పునాదిరాయి లాంటిదన్నారు. ఏఐ యుగంలో విశాఖలో ఏర్పాటు చేస్తున్న ఈ డేటా సెంటర్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. భారత డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లోనూ ఈ డేటా సెంటర్ అత్యంత ముఖ్యమైనదని చెప్పుకొచ్చారు. గ్లోబల్ ఏఐ ఎకానమీ దిశగా ఇప్పుడు విశాఖ, ఆంధ్రప్రదేశ్ పరుగులు పెడుతోందని అన్నారు. ఇంటర్నేషనల్ సబ్ సీ గేట్ వేగా ఉన్న ముంబై, చెన్నైలతో పాటు విశాఖ కూడా కీలకంగా మారిందని వెల్లడించారు. కొత్త ఫైబర్ ఆప్టిక్ లైన్లు ఇతర ప్రాంతాలతో విశాఖను అనుసంధానం చేస్తాయని బికాస్ కోలే తెలిపారు. సముద్ర గర్భ లైన్లతో సంప్రదాయ నౌకాయాన మార్గాలు ఇక డిజిటల్ ట్రేడ్ రూట్లుగా మారతాయన్నారు. అదానీ కనెక్స్, ఎయిర్ టెల్ నెక్స్ట్రాలు ఈ డేటా సెంటర్ ఏర్పాటులో భాగస్వామ్యం వహిస్తున్నందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఇండస్ట్రియల్ కారిడార్‌గా ఎదుగుతున్న ఈ ప్రాంతానికి టెక్ ఫ్యూచర్‌ను అందించేలా ఈ డేటా సెంటర్ ఉంటుందని చెప్పారు. స్థానిక యువతకు ఉద్యోగ భద్రత, ఇంధన భద్రత, నీటి వినియోగం లాంటి అంశాలతో స్థానిక భాగస్వామ్యంతో ముందుకు అడుగులు వేస్తామన్నారు. యువతకు భవితను అందించేలా వారికి అడ్వాన్స్‌డ్ క్లౌడ్, ఏఐలో శిక్షణ కార్యక్రమాలను గూగుల్ నిర్వహిస్తుందని తెలిపారు. 10 వేల మందికిపైగా మహిళలకు మైక్రో ఎంటర్‌ప్రైజ్‌గా మారేందుకు సహకారం అందిస్తుందని అన్నారు. న్యూ ట్రాన్స్ మిషన్ లైన్లు, ఎనర్జీ స్టోరేజి సిస్టమ్స్ లాంటివి ఈ ప్రాంతానికి ఇంధన భద్రతను కల్పిస్తాయన్నారు. విశాఖలోని వివిధ నివాస ప్రాంతాలు, పర్యావరణ పరిరక్షణతో పాటు ఈ ప్రాంతానికి ఆర్థిక స్థిరత్వం కల్పించేలా ఈ డేటా సెంటర్ నిర్మితం అవుతుందని బికాస్ కోలే వెల్లడించారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాస్ వర్మ, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు లోకేశ్, అనిత, బాల వీరాంజనేయ స్వామి, సంధ్యారాణి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఎమ్మెల్యేలు, ఎంపీలు, గూగుల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసిపి విమర్శలు

### గూగుల్‌కు శంకుస్థాపన వేళ విపరీత ప్రచారాలు

### తమ పాలనలో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన వారే విమర్శలా

### వైసిపి తీరుపై మండిపడ్డ మంత్రి పార్థసారథి

మచిలీపట్నం,ఏప్రిల్28 : పెట్రోల్, డీజిల్ సమస్యపై వైసీపీ భయాందోళన పరిస్థితులు సృష్టిస్తోందని రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కె.పార్థసారథి మండిపడ్డారు. మధ్యాహ్నం మూడు గంటలకల్లా రాష్ట్రంలో కొరత ఉన్న 75 శాతం బంకుల్లో ఆయిల్ సరఫరా చేశామన్నారు. బుధవారానికి పరిస్థితి పూర్తిగా అదుపులోకి వస్తుందని చెప్పారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ సమస్యలపై కృష్ణా జిల్లా మొవ్వ మండలం కారకంపాడులో మంత్రి కొలుసు పార్థసారథి స్పందించారు. అంతర్జాతీయ గూగుల్ సంస్థ విశాఖపట్నంలో శంకుస్థాపన జరుగుతున్న వేళ.. అది చూసి ఓర్వలేక ప్రజల దృష్టి మళ్లించేందుకు వైసీపీ శాయశక్తులా కృషి చేస్తోందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఏం పరిశ్రమలు తెస్తున్నారంటూ వైసీపీ నేతలు ప్రశ్నిస్తున్నారని మంత్రి పార్థసారథి ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి రూ. 9 లక్షల కోట్ల పెట్టుబడులతో పాటు పలు పరిశ్రమలకు శంకుస్థాపనలు జరిగాయని.. ఇవన్నీ కనిపించడం లేదా? అంటూ వైసీపీ నేతలకు ఈ సందర్భంగా మంత్రి చురకలంటించారు. దేశంలో 25 శాతం పెట్టుబడులు మనరే వస్తున్నాయని వివరించారు. 2019-24లో ఎంత మంది పారిశ్రామికవేత్తలు రాష్ట్రం నుంచి పారిపోయారో మీరు మర్చిపోయారా? అంటూ వైసీపీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో ప్రతిపక్షమే ఒక పెద్ద దౌర్భాగ్యంగా తయారైందని మండిపడ్డారు. వారికి చట్ట సభల్లో ప్రశ్నించే ధైర్యం లేదన్నారు. వైసీపీ కావాలనే పానిక్ సిట్యువేషన్ సృష్టిస్తోందని ఆరోపించారు. దీంతో ప్రజలు భయపడి పెట్రోల్, డీజిల్ అధికంగా కొనుగోలు చేస్తున్నారన్నారు. పెట్రోల్, డీజిల్ సమస్యపై సీఎం చంద్రబాబు నాయుడు రోజూ సమీక్షిస్తున్నారని మంత్రి పార్థసారథి గుర్తు చేశారు. రైతులకు 6 నెలల్లో ఇవ్వలేని నగదును తాము 48 గంటల్లో ఇచ్చామని ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి గుర్తు చేశారు. మొక్కజొన్న రైతుల సమస్యలపై కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. పొగాకు, కోకో, మామిడి రైతులకు నష్టం రాకుండా మద్దతు ధర చెల్లిస్తున్నామన్నారు. ధరల స్థిరీకరణకు రూ.800 కోట్లు చెల్లించిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని చెప్పారు. రైతాంగ వ్యవస్థలను చిన్నాభిన్నం చేసి.. ప్రస్తుతం ముసలి కన్నీరు కారుస్తున్నారంటూ వైసీపీ నేతల వైఖరిని మంత్రి పార్థసారథి ఎండగట్టారు. ప్రగల్భాలు మాని.. చిత్తశుద్ధి ఉంటే వాస్తవ పరిస్థితులను ప్రజలకు తెలియజేయాలని వైసీపీ నేతలకు మంత్రి పార్థసారథి సూచించారు.

## ఉత్తరాంధ్రలో రూ.2 వేల కోట్లతో 11 కీలక ప్రాజెక్టులు

### 2.69 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు లక్ష్యంగా పనులు

### రెండేళ్లలో పూర్తి చేసేలా ప్రణాళికలు: మంత్రి నిమ్మల



అమరావతి,ఏప్రిల్28 : రానున్న రెండేళ్లలో ఉత్తరాంధ్రలో రూ.2 వేల కోట్లతో 11 కీలక ప్రాజెక్టులు పూర్తి చేయాలని సీఎం నారా చంద్రబాబు నాయుడు లక్ష్యంగా నిర్దేశించుకున్నారని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. కీలకమైన 11 ప్రాజెక్టులు పూర్తి చేయడం ద్వారా ఉత్తరాంధ్రలో 2.69 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుతో పాటు 2.49 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ సాధ్యమౌతుందని చెప్పారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు సాగులోకి తీసుకురావడంతో పాటు, కరువు ప్రాంతాలకు ప్రయోజనం కలిగించే ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఆయన వివరించారు. మంగళవారం అమరావతిలో ఉత్తరాంధ్ర ఇరిగేషన్ ప్రాజెక్టుల పురోగతిపై ఆ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. వంశధార ట్రిబ్యునల్ 2021 తీర్పును గెజిట్‌లో చేరుస్తూ నోటిఫికేషన్ ఇవ్వడంలో సీఎం చంద్రబాబు కృషి ఫలించిందని పేర్కొన్నారు. కేంద్రం ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్‌తో శ్రీకాకుళం జిల్లాలోని నేరడి బ్యారేజ్ నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోయాయని చెప్పారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఉత్తరాంధ్రలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని మండిపడ్డారు. ఈ సమీక్షా సమావేశంలో నీటి పారుదల సలహాదారు వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తితోపాటు ఉత్తరాంధ్రలోని నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు, ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## గూగుల్‌తో మారనున్న విశాఖ ముఖచిత్రం

### సరికొత్త చరిత్రకు నాంది పలికాం

### గూగుల్ సెటంర్ కార్యక్రమంలో లోకేశ్

విశాఖపట్నం : డబుల్ ఇంజిన్ సర్కార్‌తో రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యశాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ఏపీలో ప్రయోజనాలు చూపిస్తున్నామని పేర్కొన్నారు. మంగళవారం తర్లువాడలో రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న గూగుల్ ఏఐ డేటా సెంటర్‌కు సీఎం చంద్రబాబు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో గూగుల్ క్లౌడ్ సంస్థ ప్రతినిధులు, కేంద్రమంత్రులు అశ్విని వైష్ణవ్, కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాసవర్మ, హోంమంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు. ఈ డేటా సెంటర్‌కు తర్లువాడ, రాంబిల్లి, అడవివరంలో 600 ఎకరాలను ఏపీ సర్కార్ కేటాయించింది. ఈ కార్యక్రమంలో పాల్గొని మంత్రి లోకేశ్ మాట్లాడారు. విశాఖ అంటే గూగుల్ అని మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు ఒకలెక్క.. ఇక నుంచి మరో లెక్క అని చెప్పుకొచ్చారు. ఇవాళ్టి నుంచి విశాఖ ముఖచిత్రం మారబోతోందని తెలిపారు. సరికొత్త చరిత్రకు ఇవాళ పునాదిగా మారిందని వెల్లడించారు. ఇకపై డేటా ఏఐ హబ్‌గా విశాఖపట్నం మారుతోందని వివరించారు. పెట్టుబడులతో ఏపీ కొత్త చరిత్ర సృష్టిస్తోందని ఉద్ఘాటించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలోని ఐదేళ్లు ఏపీలో విధ్వంస పాలన చూశామని విమర్శించారు. గూగుల్ ప్రాజెక్టు తెచ్చిందెవరని గూగుల్‌ని అడిగితే చంద్రబాబు పేరే చెబుతోందని అన్నారు. వైసీపీ పాలనలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు భయపడ్డారని ఆరోపించారు. తమది గూగుల్.. వైసీపీది గొడ్డలి.. బోత్ ఆర్ నాట్ సేమ్ అని చెప్పుకొచ్చారు. నమో అంటే నాయుడు.. మోదీ అని మంత్రి లోకేశ్ అభివర్ణించారు.

## పూడి శ్రీహరికి సుప్రీంలో చుక్కెదురు

### ముందస్తు బెయిల్ నిరాకరించిన కోర్టు

న్యూఢిల్లీ,ఏప్రిల్ 28 : ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటోల మార్ఫింగ్ కేసులో మాజీ సీఎం జగన్ సీపీఆర్‌వోగా పని చేసిన పూడి శ్రీహరికి సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు, మధ్యంతర ఉపశమనం కలిగించేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. ఈ కేసులో పూడి శ్రీహరిని రిమాండ్‌కు అప్పగించాలంటూ గతంలో పోలీసులు కుప్పం ట్రయల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం అందుకు అంగీకరించలేదు. దీంతో పోలీసులు హైకోర్టును ఆశ్రయించగా.. కుప్పం కోర్టు ఆదేశాలను తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ.. విచారణకు సహకరించాలని పూడి శ్రీహరిని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఆయన సుప్రీం కోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం కుప్పం కోర్టు ఆదేశాలను తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరించింది.

## కాలువలకు మరమ్మత్తులు

### తెలుగుగంగ ద్వారా కృష్ణాజలాలు నిలివివేత

చిత్తూరు,ఏప్రిల్28 : తెలుగు గంగ ప్రాజెక్టు కింద చెన్నైకి సరఫరా చేస్తున్న కృష్ణా జలాలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. ఆంధ్రరాష్ట్రంలోని కృష్ణానది నుంచి తెలుగుగంగ కాలువ ద్వారా విడుదల చేస్తున్న నీటిని ఏపీ సరిహద్దు ప్రాంతమైన కండలేరులో నిల్వవుంచుతారు. అక్కడి నుండి తెలుగుగంగ కాలువ ద్వారా తిరువళ్లూరు జిల్లాలోని పూండి రిజర్వాయర్‌కు మళ్లిస్తారు. ప్రస్తుతం కండలేరు-పూండి మధ్య తెలుగుగంగ ప్రాజెక్టులో ఏపీ ప్రభుత్వం చేపట్టిన మరమ్మతుల కారణంగా కృష్ణాజలాల సరఫరాను తాత్కాలికంగా నిలిపివేసినట్లు అధికారులు ప్రకటించారు. మరమ్మతులు ఈ నెలాఖరుకు పూర్తిచేశాక మే 1వ తేదీ నుంచి యథావిధిగా కృష్ణాజలాలను సరఫరా చేయనున్నట్లు ఏపీ అధికారులు హామీ ఇచ్చినట్లు రాష్ట్ర నీటిపారుదలశాఖ తెలిపింది.




# మైఖేల్ మూవీ వసూళ్ల సునామీ


దివంగత పాప్ స్టార్ మైఖేల్ జాక్సన్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన ప్రతిష్టాత్మక బయోపిక్ 'మైఖేల్' బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తోంది. విడుదలైన అతి తక్కువ కాలంలోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రికార్డులను తిరగరాస్తూ అంతర్జాతీయ స్థాయిలో సెన్సేషన్ సృష్టిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా దాదాపు రూ.2000 కోట్లు మిలియన్ల మార్కుకు చేరువలో ఉండగా, భారత మార్కెట్‌లోనూ మైఖేల్ జాక్సన్‌కు ఉన్న తిరుగులేని క్రేజ్‌ను చాటుతూ రూ.20 కోట్ల భారీ వసూళ్లను సాధించింది. కింగ్ ఆఫ్ పాప్ మ్యూజిక్, ఐకానిక్ డ్యాన్స్ మూమెంట్స్ మరియు ఆయన జీవితంలోని లోతైన సంఘర్షణలను దర్శకుడు ఆంటోనీ ఫుక్వా వెండితెరపై అద్భుతంగా ఆవిష్కరించడంతో అంతర్జాతీయ ప్రేక్షకులతో పాటు భారతీయ ప్రేక్షకులు కూడా ఈ చిత్రానికి బ్రహ్మరథం పడుతున్నారు. ముఖ్యంగా మైఖేల్ జాక్సన్ మేనల్లుడు జాఫర్ జాక్సన్ టైటిల్ పాత్రలో ఒదిగిపోయిన తీరుపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఆయన బాడీ లాంగ్వేజ్ మరియు డ్యాన్స్ విన్యాసాలు చూస్తుంటే సాక్షాత్తు మైఖేల్ జాక్సనే మళ్లీ తిరిగి వచ్చారా అన్నట్లుగా ఉందని విమర్శకులు సైతం కొనియాడుతున్నారు.



# లుక్ టెస్ట్ పూర్తయ్యింది

## చిరు -బాబీ కాంబినేషన్‌లో మూవీ


అగ్ర కథానాయకుడు చిరంజీవి ఫుల్ జోష్‌లో ఉన్నారు. వరుస చిత్రాలతో అలరించేందుకు సిద్ధమవుతోన్న ఆయన తాజాగా కొత్త ప్రాజెక్ట్‌కు సంబంధించిన లుక్ టెస్ట్‌ను పూర్తి చేశారు. బాబీ దర్శకత్వంలో చిరంజీవి హీరోగా రెండో సినిమా రానున్న విషయం తెలిసిందే. మెగా 158గా ఇది ప్రచారంలో ఉంది. ఈ సినిమా అప్‌డేట్‌ను దర్శకుడు పంచుకున్నారు. ఈ రోజు లుక్‌టెస్ట్ పూర్తయిందని..త్వరలోనే షూటింగ్ ప్రారంభించేం దుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. చిరు ఫొటోషూట్‌కు సంబంధించిన ఫొటోను షేర్ చేస్తూ 'హింసకు ముందు నిశ్శబ్దం' అనే క్యాప్షన్ రాశారు. దీంతో భారీ స్థాయి యాక్షన్ చిత్రంగా ఇది రానున్నట్లు తెలుస్తోంది. చిరంజీవి – బాబీ కాంబినేషన్‌లో గతంలో 'వాల్తేరు వీరయ్య' రూపొందింది. 2023లో వచ్చిన ఈ చిత్రం మంచి ఆదరణను సొంతం చేసుకోవడంతో వీరి రెండో సినిమాపై అంచనాలు నెలకొన్నాయి. ఈ ఏడాది 'మన శంకర వరప్రసాద్ గారు'తో హిట్ అందుకున్న చిరంజీవి మూడు సినిమాలతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'విశ్వంభర' ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ సోషియో ఫాంటసీ యాక్షన్ థ్రిల్లర్‌తో పాటు శ్రీకాంత్ ఓదెల చిత్రం లైనప్‌లో ఉంది.



## మా ఇంటి బంగారం ప్రమోషన్స్

### ఇంకా మొదలు పెట్టని నటి సమంత


ఈ మధ్య కాలంలో ప్రేక్షకులను మెప్పించడం చాలా కష్టంగా మారింది. ఒకప్పుడు స్టార్ హీరో, స్టార్ హీరోయిన్ సినిమా వస్తోంది అంటే చాలు.. అది ఎలా ఉన్నా కూడా ఫ్యాన్స్ హిట్ చేసేవారు. కానీ, ఇప్పటి జనరేషన్ అలా కాదు. ఎంత పెద్ద స్టార్ అయినా సరే కంటెంట్ ఉంటేనే హిట్ చేస్తున్నారు. కంటెంట్ తో పాటు ప్రమోషన్స్ ని కూడా లెక్కలోకి తీసుకుంటున్నారు. అందుకే ఈ మధ్య స్టార్ హీరోలు సైతం సరికొత్తగా ప్రచారాలు చేస్తూ తమ సినిమాను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. అయితే తాజాగా స్టార్ హీరోయిన్ సమంత మాత్రం తన సినిమాను ప్రజల్లోకి తీసుకెళ్ళలేకపోయారు అని టాక్ నడుస్తోంది. టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత నటిస్తోన్న తాజా చిత్రం మా ఇంటి బంగారం. నందినిరెడ్డి దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రాన్ని సామ్ భర్త రాజ్ నిడిమోరు నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్, సాంగ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మే 15 న ఈ చిత్రం రిలీజ్ కు సిద్ధమవుతోంది. రిలీజ్ ఇంకా పట్టుమని 15 రోజులు కూడా లేదు.. కానీ, ఇప్పటివరకు ఈ సినిమా ప్రమోషన్స్ మొదలుపెట్టలేదు. ఒకప్పుడు సామ్ సినిమా రిలీజ్ అంటే ఆ బజ్ వేరే లెవెల్ లో ఉండేది. కానీ, ఇప్పుడు అలా లేదు. రాజ్ నిడిమోరుతో పెళ్ళి తరువాత సామ్ ఒకపక్క నిర్మాతగా.. ఇంకోపక్క హీరోయిన్ గా చేస్తున్న సినిమా మా ఇంటి బంగారం. ఓ బేబీ లాంటి హిట్ తరువాత సామ్– నందినిరెడ్డి కాంబోలోవస్తోన్న చిత్రం కావడంతో ఓ రేంజ్ లో బజ్ ఉంటుంది అనుకున్నారు. అయితే సామ్ మాత్రం ప్రమోషన్స్ చేయడంలో విఫలమయ్యారు అని చెప్పొచ్చు. ఇప్పటివరకు ఈ సినిమా నుంచి ఒక్క ప్రమోషన్ ఇంటర్వ్యూ తప్ప ఇంకేమి రాలేదు. వెన్నెల కిషోర్ – సామ్ ఇంటర్వ్యూ రిలీజ్ అయినా కూడా అదేమీ అంతగా ఆసక్తి రేకెత్తించలేదు అని టాక్. అందుకనే ప్రేక్షకులు సైతం మా ఇంటి బంగారం సినిమాను పట్టించుకోవడం లేదని అంటున్నారు. మరి ఇప్పటికైనా సామ్ ప్రమోషన్స్ ను వేగవంతం చేసి ప్రేక్షకుల్లో ఆసక్తి కలిగించకపోతే సినిమాపై ఆశలు వదులుకోవాల్సిందే అని పలువురు చెప్పుకొస్తున్నారు.




# పండుగాడి జర్నీకి 20 ఏళ్లు

## పోకిరీ విడుదలై సరిగ్గా రెండు దశాబ్దాలు

తెలుగు చలనచిత్ర చరిత్రలో ఒక సరికొత్త అధ్యాయాన్ని లిఖించి, బాక్సాఫీస్ వద్ద రికార్డుల సునామీ సృష్టించిన 'పోకిరి' చిత్రం సరిగ్గా 20 వసంతాలను పూర్తి చేసుకుంది. సరిగ్గా రెండు దశాబ్దాల క్రితం ఇదే రోజున 2006 ఏప్రిల్ 28న విడుదలైన ఈ సినిమా, అప్పటి వరకు ఉన్న తెలుగు సినిమా బాక్సాఫీస్ లెక్కలను పూర్తిగా మార్చివేసింది. ఈ చిత్రం సూపర్ స్టార్ మహేష్ బాబును మాస్ ప్రేక్షకులకు అత్యంత చేరువ చేయడమే కాకుండా, ఆయనను తిరుగులేని పవర్‌హౌస్‌గా నిలబెట్టింది. డైనమిక్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ మార్క్ మేకింగ్, పదునైన సంభాషణలు మరియు మహేష్ బాబు అల్టా మోడ్రన్ లుక్ కలిసి వెండితెరపై ఒక మ్యాజిక్ చేశాయి. దాదాపు రూ.12 కోట్ల పరిమిత బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం, ఏకంగా రూ.66 కోట్లకు పైగా వసూళ్లను సాధించి అప్పట్లో 'ఇండస్ట్రీ హిట్'గా రికార్డు సృష్టించింది. కేవలం వసూళ్ల పరంగానే కాకుండా, సాంకేతికంగానూ ఈ చిత్రం సరికొత్త ప్రమాణాలను నెలకొల్పింది. ముఖ్యంగా మణిశర్మ అందించిన అద్భుతమైన సంగీతం, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ప్రతి థియేటర్లో వైబ్రేషన్స్ పుట్టించాయి. హీరోయిన్ ఇలియానాకు ఈ సినిమా ఓవర్ నైట్ స్టార్‌డమ్ తీసుకురాగా, విలన్‌గా ప్రకాష్ రాజ్ నటన సినిమాకు ప్రాణం పోసింది. సినిమా ప్రథమార్థం అంతా పండుగాడు అనే ఒక సాధారణ లోకల్ రౌడీగా కనిపించిన మహేష్ బాబు, క్లైమాక్స్ వచ్చేసరికి కృష్ణ మనోహర్ అనే అండర్ కవర్ ఐపీఎస్ ఆఫీసర్ అని రివీల్ అయ్యే సీన్ ప్రేక్షకులకు ఊహించని థ్రిల్ ఇచ్చింది. ఈ ఒక్క ట్విస్ట్ అప్పట్లో థియేటర్లలో సంచలనం సృష్టించడమే కాకుండా, సినిమాను మళ్ళీ మళ్ళీ చూసేలా ప్రేక్షకులను ప్రోత్సహించింది. 'ఎవడు కొడితే దిమ్మతిరిగి మైండ్ బ్లాక్ అవుతుందో వాడే పండుగాడు', 'ఒకసారి కమిట్ అయితే నా మాట నేనే వినను' వంటి డైలాగులు నేటికీ తెలుగు ప్రేక్షకుల నాలుకలపై నానుతూనే ఉన్నాయి. ఈ సినిమా క్రేజ్ కేవలం టాలీవుడ్‌కే పరిమితం కాకుండా, తమిళంలో విజయ్ హీరోగా, హిందీలో సల్మాన్ ఖాన్ హీరోగా, కన్నడలో దర్శన్ హీరోగా రీమేక్ అయ్యి అక్కడ కూడా ఘనవిజయాలను అందుకుంది. 'పోకిరి' 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న మహేష్ బాబు అభిమానులు సోషల్ మీడియాలో భారీ ఎత్తున వేడుకలు జరుపుకుంటున్నారు.




## వరుస సినిమాలతో బాలయ్య బిజీ

### కొరటాల శివతో తదుపరి మూవీ అంటూ ప్రచారం

నందమూరి బాలకృష్ణ మాత్రం తన రూటే సెపరేటు అంటూ పయనిస్తున్నారు. ప్రస్తుతం ఆయన వయసు 66 సంవత్సరాలు. అయినా ఓ వైపు నటునిగా బిజీగా ఉన్నారు. మరోవైపు హిందూపురం ఎమ్మెల్యేగా తన నియోజకవర్గ అభివృద్ధి కోసం శ్రమిస్తున్నారు. అలాగే తన తల్లి పేరిట నెలకొన్న బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ ఛైర్మన్ గానూ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇంత బిజీగా ఉన్నా ఈ సారి సినిమాల సంఖ్య పెంచాలని యోచిస్తున్నారు బాలయ్య. అందుకు తగ్గట్టుగానే పలువురు దర్శకులు, నిర్మాతలు ఆయనతో సినిమాలు తీయడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఓ సినిమా అయిన తరువాత మరో చిత్రాన్ని లైన్ లో పెడతారు ఎవరైనా. అయితే బాలయ్య ప్రస్తుతం గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ యాక్షన్ ఎంటర్ టైనర్ చేస్తున్నారు.ఆ సినిమా ఓ వైపు షూటింగ్ జరుపుకుంటూ ఉండగానే మరో చిత్రాన్ని లైన్ లో పెట్టనున్నారట బాలయ్య. ఈ మధ్యే బాలకృష్ణకు డైరెక్టర్ కొరటాల శివ ఓ సబ్జెక్ట్ వినిపించారు. ఆ సబ్జెక్ట్ బాలయ్యకు ఎంతగానో నచ్చిందని, త్వరలోనే షూటింగ్ మొదలు కానుందనీ సమాచారం. ప్రస్తుతం బాలయ్య హీరోగా గోపీచంద్ మలినేని రూపొందించే చిత్రాన్ని సంక్రాంతికి రిలీజ్ చేసే ప్రయత్నంలో ఉన్నారు. వెంకట సతీశ్ కిలారు ఈ సినిమాను నిర్మిస్తున్నారు.. ఇక బాలయ్యతో కొరటాల శివ రూపొందించే చిత్రానికి సాహు గారపాటి, మిక్కిలినేని సుధాకర్ నిర్మాతలుగా వ్యవహరించనున్నారు. సమాంతరంగా ఈ రెండు చిత్రాల షూటింగ్ జరపనున్నారు. వేసవి పూర్తి కాగానే ఈ రెండు చిత్రాల కోసం డేట్స్ కేటాయించారు బాలకృష్ణ. రెండు సినిమాల్లో ఒకటి సంక్రాంతికి వస్తే, మరోటి ఎప్పుడు వస్తుందనే అనుమానం కలుగక మానదు. రెండు సినిమాలు వచ్చే సంవత్సరమే వెలుగు చూస్తాయని వినిపిస్తోంది. అయితే ఈ యేడాది బాలయ్య సినిమా లేనట్టేనా అని అభిమానులు నిరాశ చెందుతున్నారు. నిజానికి బాలయ్య–గోపీచంద్ మలినేని చిత్రాన్ని ఈ యేడాదే దసరా కానుకగా రిలీజ్ చేయాలని ప్లాన్ చేశారు. కథలో మార్పులు జరగడం, క్యాస్టింగ్ లోనూ ఛేంజెస్ చోటు చేసుకోవడంతో బాలయ్య–గోపీచంద్ మలినేని మూవీ సంక్రాంతికి షిఫ్ట్ అయింది.



## దర్శకురాలిగా మారతానంటున్న ఫరియా అబ్దుల్లా ..

'గాయపడ్డ సింహం' ప్రమోషన్స్‌లో ఆసక్తికర వ్యాఖ్యలు 'జాతిరత్నాలు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఫరియా అబ్దుల్లా , చిట్టి పాత్రతో మంచి గుర్తింపు సంపాదించుకుంది. తన సహజ నటన, భావ వ్యక్తీకరణతో యువతలో ప్రత్యేక స్థానం సంపాదించిన ఆమె, ఇప్పుడు 'గాయపడ్డ సింహం' అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా విడుదలకు ముందు నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఫరియా పలు ఆసక్తికర విషయాలను పంచుకుంది. ఈ చిత్రంలో తరుణ్ భాస్కర్ హీరోగా నటించగా, ఫరియా అబ్దుల్లా, మానస చౌదరి కథానాయికలుగా కనిపించనున్నారు. తాను ఇందులో శాలిని అనే వ్లాగర్ పాత్రలో కనిపిస్తానని, చిన్న పాత్ర అయినప్పటికీ కథలో ప్రాధాన్యం ఉంటుందని ఫరియా తెలిపింది. తరుణ్ భాస్కర్‌తో ఒక ప్రేమ కథాంశం కూడా ఉంటుందని, దర్శకుడు కశ్యప్ కథను చాలా భిన్నంగా రూపొందించారని చెప్పింది. ఆయన సృష్టించిన పాత్రలు, కథా ప్రపంచం చాలా వినోదాత్మకంగా ఉంటాయని వెల్లడించింది. ఈ సినిమా పలు స్థాయిల్లో సాగే కథగా ఉంటుందని, ప్రతి పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని ఫరియా వివరించింది. తన పాత్రలో హాస్య అంశాలు ఎక్కువగా ఉంటాయని, ప్రేక్షకులు సినిమా చూసిన తర్వాత మళ్లీ చూడాలనిపించేలా ఉంటుందని ఆమె ధీమా వ్యక్తం చేసింది. కథ నచ్చితే పాత్ర నిడివి గురించి పట్టించుకోకుండా నటిస్తానని ఫరియా పేర్కొంది. ఈ కథ వినగానే కొత్తగా అనిపించిందని, ప్రేక్షకులు ఖచ్చితంగా ఆనందిస్తారని ఆమె నమ్మకం వ్యక్తం చేసింది. తరుణ్ భాస్కర్‌తో పనిచేసిన అనుభవాన్ని గురించి మాట్లాడుతూ, ఆయన చాలా సరదాగా ఉంటారని, ఆయన హాస్య టైమింగ్ ప్రత్యేకమని చెప్పింది. చిన్న అభినయంతోనే నవ్వు తెప్పించగల సామర్థ్యం ఉందని పేర్కొంది. సినిమా తుది రూపం చాలా బాగా వచ్చిందని, ఇది విజయవంతమవుతుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేసింది.ఈ చిత్రంలో శ్రీ విష్ణు పాత్ర కూడా చాలా ఆసక్తికరంగా ఉంటుందని, దానిని ఎంతో చక్కగా రూపొందించారని తెలిపింది. మానస చౌదరి హీరోను వదిలే పాత్రలో కనిపిస్తే, తాను అతనికి అండగా నిలిచే పాత్రలో నటించానని సరదాగా చెప్పింది. ఇక తన భవిష్యత్ ప్రణాళికల గురించి మాట్లాడుతూ, ప్రస్తుతం కొన్ని కథలు రాస్తున్నానని, వచ్చే ఏడాది తన దర్శకత్వంలో సినిమా చేయాలని భావిస్తున్నానని ఫరియా వెల్లడించింది. ప్రస్తుతం 'భగవంతుడు', 'సిగ్మా' వంటి చిత్రాలతో పాటు సత్యదేవ్ కంచరణతో ఒక సినిమా కూడా చేస్తున్నానని తెలిపింది. 'గాయపడ్డ సింహం'తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైన ఫరియా అబ్దుల్లా, భవిష్యత్తులో దర్శకురాలిగా మారాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com